సంపుటి: 32
సంచిక: 5

ఫోన్ నెం
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 55 రూపాయలు.
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 325 రూపాయలు.

జూన్, 1981

మేనేజింగ్ ఎడిటర్:
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:
నందూరి శైలజ

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
ఏ. పీ. మోహన్రావ్
విద్వాన్ షీలాదేవి

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 33 : నటరాజు అనే కళాకారుడు మ్యూజిక్ ప్రోగ్రాము లివ్వటానికి ఒక ఆడిటోరియంను నెల రోజులకు అద్దెకు తీసుకున్నాడు. హాలు యాజమాన్యానికి అద్దె పూర్తిగా చెల్లించి ప్రోగ్రాము ఏర్పాట్లు చేసుకోసాగాడు.

ప్రోగ్రాం రేపనగా దైవికంగా హాలు దగ్ధమైంది. నటరాజు అప్పటికే పబ్లిసిటీ, టిక్కెట్ల అమ్మకం వగైరాలకు ఐదువేల వరకూ ఖర్చు చేశాడు. తనకైన ఖర్చులు నష్టపరిహారంగా చెల్లించాలని కోరగా హాలు యాజమాన్యం నిరాకరించటంతో నటరాజు కోర్టుకెక్కాడు.

న్యాయమూర్తిగా మీరిచ్చే తీర్పు ఏమిటి?

నిబంధనలు : మీ తీర్పును 7-6-'81 తేదీ లోపల మాకు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు జూలై' 81 నెల సంచికలో చూడండి.

కేసు నెం. 31 : తీర్పు

తీర్పు : సాక్ష్యం చెప్పటానికి డబ్బు ఇవ్వనక్కరలేదు.

కోర్టులో సాక్ష్యం చెప్పటం అనేది చట్టం విధించిన విద్యుక్త ధర్మం. ఇది నిర్వహించటానికి ఎవరూ ఏమీ ఇవ్వనక్కరలేదు. అలా ఇవ్వటం చట్ట విరుద్ధం అవుతుంది కూడా.

ఈ నెల న్యాయనిర్ణేత : శ్రీ ఇ.టి. రామారావు, బి.కాం., పర్చేజ్ అసిస్టెంట్, ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్, శ్రీహరికోట - 524 124.

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. కుక్కల హత్యలు—క్రిష్ణవేణి
16. దొంగలకు విందు—సూర్యశ్రీ
24. ఇల్లు దోపిడి—బొమ్మిడి అచ్చారావు
42. టికెట్ లేని పెద్దమనుషులు—వసుంధర
61. బ్యాంకు దొంగలు—ఎమ్. సత్యవతీదేవి
76. అందంలో అగ్నిజ్వాల—శ్రీ భగవాన్
92. దొరకని దొంగ—మల్లిక్
107. పార్శిల్లో బాంబు—క్రిష్ణవేణి
117. నేరం ఎవరిది—వాణిశ్రీ
128. దెయ్యం కారు—ప్రతాప రవిశంకర్
137. నల్లపిల్లి—ఎమ్. వి. వి. సత్యనారాయణ
177. సీక్రెట్ గ్యాంగ్ (సీరియల్)—'సికిందర్'

నవలలు (సప్లిమెంట్)

3. ఆవేశం అనర్థం—వసుంధర
44. దారి దోపిడి—సికిందర్
112. రచయిత బందిఖాన—ఎమ్. వి. వి. సత్యనారాయణ
160. పొగమంచు (సీరియల్)—ముద్దా సురేష్

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, ఆపరాధ పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు మరెన్నో ఆకర్షణలు!!

ముక్కల హత్యలు

కృష్ణవేణి

సార్జంటు తంగం వాళ్ళావిడ చేసిన "చికెన్ ఎగ్ వింగ్సు"
వంటకం గూర్చి నోరూరేలా వర్ణించి వర్ణించి

చెప్తున్నాడు.

"చికెన్ ఎగ్ వింగ్సా? ఇదేదో క్రొత్త పేరులా వుందే. నేను ఎక్కడా వినలేదు కదయ్యా! దానికి అర్థం ఏమిటీ?" ఇనస్పెక్టరు పళనివేలు ఆశ్చర్యంగా అడిగాడు.

"సార్! మా ఆవిడ క్రొత్తగా కనిపెట్టిన వంటకం. బ్రహ్మాండంగా వుంది. చేసి వుంచు అన్నాను. ఈ రోజు మా యింట్లో మీకు...."

మాట ఆగిపోయింది.

ఎందుకంటే....

పోలీసు స్టేషనుని కప్పేసేంత పడవలాంటి కారు వచ్చి స్టేషన్ ముందు ఆగింది.

కారు రెక్కలు చాచుకొని వున్న పెద్ద పక్షిలా వుంది.

"సార్ కోడిగ్రుడ్డు రెక్కలు....అని నేనన్నానా? పక్షి వచ్చి వాలింది" అని కుతూహలంగా అటువేపు చూడ సాగాడు.

అంత అందమైన కారులో నుండి ఎంత అందమైన మనుష్యులు దిగుతారో అని.

నాలుగు అడుగులు ఎత్తు, ఎత్తు పళ్ళు, పీలగా, నల్లగా, గుప్పెడు వెంట్రుకలతో చిన్న పిల్లలా వున్న యువతి గున గునా నడుచుకుంటూ వచ్చింది.

కారుకి తగ్గ అందం, ఆ కారులో నుండి దిగిన మనిషిలో లేదు.

బహుశా, ఆ కారు యాజమాని యింటిలోని పని గత్తేమో?

"నమస్కారం" ఇంగ్లీషులో అంది.

ఇనస్పెక్టరు తల పంకించాడు.

"నేను కూర్చోవచ్చా" ఇంగ్లీషులోనే అడిగింది. వుచ్చారణ అమెరికన్ వుచ్చారణ మాదిరిగా వుంది.

ఆమె మాట వింటే పనిమనిషిగా అనుకోలేకపోతున్నాడు తంగం.

కళ్ళు ఎర్రగా వుబ్బి వున్నాయి. మనిషి మొహం చూస్తే బాగా ఏడ్చినట్లుగా వుంది.

"సార్! నా పేరు సంపద! టి.ఆర్. నాయుడు మా నాన్నగారు" అంది.

టి.ఆర్. నాయుడు పేరు వినగానే బాంబు పడినట్లుగా వులిక్కిపడ్డాడు.

దేశంలో వున్న కొద్దిమంది కోటీశ్వరులలో టి.ఆర్. నాయుడు ఒకరు. ఎన్నికోట్ల ఆస్తి వుందో బహుశా ఆయనకే తెలియదేమో అనే అనుమానం అందరికీ వుంది.

నాయుడుగారికి ఏకైక పుత్రిక వుందని, ఇంతటి సంపదకి ఆమె ఏకైక వారసురాలని అందరికీ తెలుసు.

ఆమెను వివాహం చేసుకోవడానికి ఎంతోమంది వచ్చినా నాయుడుగారు నిరాకరించినట్లు తను విన్నాడు.

ఆ కూతురు యింత వికారంగా వుంటుందని ఎవరూ వూహించి వుండరు.

"ఏమ్మా? మా నించి ఏం సహాయం కావాలి?" ఇనస్పెక్టరు మర్యాదగా అడిగాడు.

"మా రిచెర్డు చనిపోయా....లేదండి మా రిచెర్డుని ఎవరో చంపేశారు...." అంటూ భోరున ఏడ్చింది.

"ఎప్పుడు జరిగింది?" తంగం ప్రశ్నించాడు.

"మామూలుగా నిన్న రాత్రంతా నాతో బాగానే ఆడాడు. తెల్లవారి లేచి చూసేసరికి చనిపోయి వున్నాడు. సార్!

నాకీ లోకంలో వున్నది మా నాన్నగారు కాక రిచర్డు, సీజరు మాత్రమే. నేనెవ్వరికీ అపకారం చేయలేదు. ఎందుకిలా చేశారో తెలియదు....'' మళ్ళీ ఏడుపు సాగించింది.

ఇనస్పెక్టరుకి అనుమానం వచ్చింది.

''రిచర్డు....అంటే ఎవరు? మీకేం అవుతారు?''

''రిచర్డు మా కుక్క అండి. నేను ఐదేళ్ళ క్రితం అమెరికాలో వున్నప్పుడు రెంటినీ లక్షరూపాయలు యిచ్చి కొని మా నాన్నగారు నాకు ప్రజంట్ చేశారు. వాళ్ళిద్దరే నా స్నేహితులు'' వెక్కి వెక్కి ఏడుస్తూ అంది.

తంగానికి కోపం వచ్చింది.

కుక్క యాభై వేలు రూపాయలు విలువైనదయితే మాత్రం, కుక్కల చావులని కూడా పరిశోధించాలనా?

రానురాను పోలీసు డిపార్టుమెంటు అంటే అందరికీ చులకన అయిపోతోంది అని అనుకున్నాడు.

''చూడమ్మా! దొంగతనం ఏమైనా జరిగిందా? లేక ప్రయత్నం ఏమైనా జరిగిందా? రిపోర్టు వ్రాసి యిస్తే యాక్షన్ తీసుకుంటాము'' ఇనస్పెక్టరు కుక్క చావుకి మాకు సంబంధం లేదన్నట్లు చెప్పాడు.

''సార్! మీ గూర్చి నేను పేపరులో తరుచూ చదువుతూ వుంటాను కాబట్టి ఆశతో మీ వద్దకి వచ్చాను. ఇది ప్రయివేటు కేసుగా అయినా తీసుకొని మా రిచర్డుని ఎవరు చంపారో మీరు తెలుసుకోవాలి. ఎన్ని లక్షలైనా ఖర్చు చేస్తాను'' దీనంగా అంది.

''మేము గవర్నమెంటు సర్వెంట్సుము. ప్రయివేటు కేసులని టేకప్ చేయకూడదు. మౌంటురోడ్డులో ప్రయివేటు డిటెక్టివ్ ఏజెన్సీ వుంది'' తంగం అన్నాడు.

"ప్రాహు! నాకు మీమీదే నమ్మకం. మీరే సాల్వు చేయాలి" చిన్నపిల్లలా మంకుపట్టు పట్టి అంది.

"సరే! మీ యింట్లో దొంగతనం ప్రయత్నం జరిగి నట్లు రిపోర్టు వ్రాసి యివ్వండి" అన్నాడు గత్యంతరం లేక.

చకచకా ముత్యాలవంటి అక్షరాలతో ఇంగ్లీషులో వ్రాసి యిచ్చింది.

2

తన కారులోనే సంపద ఇనస్పెక్టర్లని రమ్మని ఆహ్వా నించింది గానీ ఇద్దరూ దానికి ఒప్పుకోక, తమ బుల్లెటు మీదే బయలుదేరారు.

ఇంటికి, గేటుకు మధ్య ఒకటిన్నర ఫర్లాంగు దూరం వుంది. ఆ పురాతన కట్టడం వర్ణించడానికి వీలుకానంత ఐశ్వర్యంతో అలరారుతోంది. ఆ యింటి గోడలకి అంగుళం అంగుళంకి డబ్బుని పరచినట్లు అనేక ఖరీదైన వస్తువులు తాపడంచేసి వున్నవి.

టి.ఆర్. నాయుడు గంభీరంగా ఓ కుర్చీలో కూర్చొని వున్నారు. బుంగమీసాలు, భారీ విగ్రహం. చూడగానే గౌరవం, భయం కూడా పుట్టించగల చూపు.

ఆయన కాళ్ళవద్ద రిచర్డు పడివున్నాడు. దాదాపు వంద మంది పరిచారకులు ఓ ప్రక్కగా భయంతో వణుకుతూ నిలబడి వున్నారు.

కుక్క నిర్జీవంగా వున్నప్పుడే భయంకరంగా వున్నది. ప్రాణంతో వుంటే ఇంకెలా వుండేదో?

దీని జోడి సీజరుది కాబోలు ఎక్కడనుండో గర్జనలు అతి భీకరంగా వినిపిస్తూ వున్నవి.

ఇనస్పెక్టర్లకి నాయుడుగారు గంభీరంగానే స్వాగతాన్ని చెప్పారు.

సంపద క్రింద కూర్చొని రిచెర్డు తలని తన వొళ్ళో పెట్టుకొని విలపిస్తోంది.

"ఇనస్పెక్టర్! నా కూతురుకి యీ ప్రపంచంలో స్నేహితులు వేరే లేరు. యీ మూగజీవాలే నా కూతురి ఫ్రెండ్సు. ఆ కుక్కలని చంపే అవసరం ఎవరికి కలిగిందో నాకు అర్థం కావడంలేదు."

"దొంగతనం ప్రయత్నమేమో?" ఇనస్పెక్టరు అన్నారు.

"నా యింట్లో చోరీ చేయాలనే ప్లాను వేసుకునేంత తెలివితక్కువ వాళ్ళు వుండరని నా అభిప్రాయం" గాంభీర్యంలోనే గర్వం కనబడుతోంది.

అదీ నిజమే అనిపించింది ఇనస్పెక్టరుకి.

"మరి! యీ కుక్క హత్య ఎందుకు?"

"అదే మీరు పరిశోధించాలి" అని అక్కడి నుండి వెళ్ళిపోయారు.

ఇంటిచుట్టూ కారులో ఒక రౌండు వేస్తేనే వారికి ఒక గంట పట్టింది. మరి భవంతిలో ఇద్దరూ కాలినడకన తిరగ గలరా?

వందమంది నౌకర్లు చాకర్లు వున్నారు. వారినందరినీ ప్రశ్నించడం కుదురుతుందా?

ఇద్దరికీ తలనొప్పి వచ్చినట్లు అయింది.

కుక్కనీ పోస్టుమార్టమ్‌కి పంపారు. తర్వాత ఇద్దరూ సంపద గదిని చూపమని అడిగారు.

బెడ్ రూమ్, దానికి ఎటాచ్‌డ్ బాత్ రూమ్ వుంది. అది అమెరికన్ స్టయిల్లో వున్నది.

బెడ్ రూము తరువాత రీడింగ్ రూము వున్నది. అందులో లక్షలు ఖరీదు చేసే విలువైన యింగ్లీషు నావల్సు వున్నాయి.

ఇవికాక టీపాయ్ మీద, ప్రోబ్, ఇమ్‌ప్రింటు, రీడర్సు డైజిస్టు, టుడే ఇండియా, కారవాన్, మిర్రర్, ఇలస్ట్రేటడ్ వీక్లీ, ఫెమినా, వుమన్ అండ్ ఎరా, వుమన్ అండ్ హోమ్ ఇలా చాలా రకాల మాగ్‌జైన్సు వున్నాయి.

రీడింగు రూముని ఆనుకొని డ్రాయింగురూము వున్నది. ఖరీదైన సోఫాసెట్టు వున్నది. రూమంతా ఆర్టుగేలరీ మాదిరి వున్నది. గోడలకి ఖరీదైన పెయింటింగ్సు వున్నాయి. అవి అంతా ఫారిన్‌లో కలెక్టు చేసినవిగా వున్నాయి. ఖరీదైన బొమ్మలు అద్దాల బీరువాలో అందంగా అమర్చి వున్నవి.

ఓ చెట్టు, దాని క్రింద గూడారం ముందు ప్రేయసీ ప్రియులు ప్రక్కగా గుర్రాలతో రథం వున్నది. దానిని ఓ పెద్ద గాజుపెట్టెలో పెట్టి గదిలో ఓ మూలగా వున్నది.

గంధంతో చేసినట్లుగా వున్నది.

కుతూహలాన్ని ఆపుకోలేక దాని ఖరీదు ఎంత? అని తంగం అడిగినప్పుడు—

సంపద అతి సాధారణంగా—"యాభై వేలు అనుకుంటా" అని చెప్పినప్పుడు తంగం మూర్ఛపోకుండా ఎలానో వుండగలిగాడు.

అతి చిన్నదిగా వున్న ఓ చిన్న బొమ్మ ఖరీదు అడిగినప్పుడు ఐదువేలు అన్నది.

ధనమంతా ఇలా ధనవంతుల యిళ్ళల్లో అలంకార వస్తువుల రూపంలో బంధింపబడి వుంటే పేదరికం



దేశంలో వుండక ఏమౌతుంది?—అని ఇన్‌స్పెక్టర్లకి అనిపించింది.

"మీ దినచర్య ఏమిటి?" తంగం సంపదని ప్రశ్నించాడు.

"ప్రొద్దుటే లేచి రిచర్డు, సీజరుతో వాకింగుకి మా గార్డెన్ లోకే వెళ్తాను. తరువాత పక్షులకి, పిల్లులకి, మా రిచర్డు, సీజరుకి వాటి వాటి ఆహారాలు వేస్తాను. నేను స్నానం చేసి బ్రేక్‌ఫాస్టు తీసుకునేసరికి పదిగంటలు అవుతుంది.

పదినుండి ఒంటిగంట వరకు వీక్లీసు చదువుకుంటాను. తరువాత నా పెంపుడు జంతువులకి ఆహారం వేసి నేను లంచ్ తీసుకొంటాను. రెండున్నర అవుతుంది. మళ్లీ లైబ్రరీలో కూర్చుని నావల్సు చదువుకొంటాను. నాలుగు నుండి ఆరువరకూ తోటలో నా పెంపుడు జంతువులతో ఆడుకొంటాను...."

"మీకు స్నేహితులు ఎవ్వరూ లేరా?"

"లేరు...." విచారంగా అంది.

"స్కూల్లో కాలేజీలో...."

"నన్ను అందరూ గేలిచేస్తున్నారని చిన్నప్పటినుండే నా ప్రపంచం వేరై పోయింది. మా డాడి యూరోపియన్ లేడీని, ఇండియన్ టీచరుని నాకు పెట్టారు. ఇంటివద్దే నేను చదువుకున్నాను."

"మీకు ఆయా లేదా? మీ అమ్మగారు...."

"మా అమ్మ నా చిన్నప్పుడే చనిపోయింది. ఒక ఆయా వుండేది, నాలుగేళ్ళ క్రితం ఆమె చనిపోయింది."

"ప్రస్తుతం సర్వెంట్సులో ఎవరితో మీ కెక్కువ పరిచయం?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించారు.

"ఎవ్వరూ లేరు."

"మీ అవసరాలు?"

"ఫోన్ చేస్తే కావలసింది రూములోకి వస్తుంది."

"జంతువులతోగాక రోజులో మనుష్యులతో ఎవ్వరితో మాట్లాడుతారు?" తంగం జాలిగా ప్రశ్నించాడు.

"వూహూ....ఎవ్వరూ లేరు. డాడీ ఎప్పుడూ ఆయన బిజినెస్‌లో వుంటారు....నాకు తోడు రిచెర్డు, సీజరే. అందులో...." ఆమె కళ్ళల్లో కన్నీరు వుబికింది.

3

రిచెర్డుకి ముందు క్లోరోఫారమ్ చూపి ఆ తరువాత షూట్ చేసినట్లు పరీక్షలో తేలింది.

తరువాత నాలుగురోజుల్లో సీజరు కూడా రిచర్డులాగానే చంపబడింది.

సీజరు చనిపోయే సమయానికి టి. ఆర్. నాయుడు

అమెరికాలో వున్నారు. కూతురి కేబుల్‌ని చూచుకొని ఆయన అమెరికా నుండి పరిగెట్టుకొని వచ్చారు.

తంగం 'చికెన్ ఎగ్ వింగ్స్' గూర్చి మరచిపోయి కుక్కల హత్య గూర్చి అంతు తేల్చుకోవాలని విశ్వ ప్రయత్నంలో వున్నాడు.

ఫోన్ గణగణ మన్నది.

ఇన్‌స్పెక్టర్ ఫోన్ ఎత్తారు.

"సార్! నేను సంపదని మాట్లాడేది. మా డాడీ చని పోయి వున్నారు. డాక్టరు హార్టు ఎటాక్ అని అన్నారు. నా కెందుకో భయంగా వుంది" అంది గాభరాగా.

ఇద్దరూ బుల్లెటుమీద అక్కడికి చేరేసరికే లోనికి వెళ్ళ డానికి వీలులేనన్ని కారులు జీపులు ఆవరణ అంతా ఆగి వున్నవి.

విపరీతమైన జనసందోహం. ఫోన్‌కాల్సు, ట్రంకాల్సు. పోలీసులు,ఫోటోగ్రాఫరులు, విలేఖరులు నానా హంగామాగా వున్నది.

డెడ్‌బాడీ అప్పుడే పూలమాలలతో నిండిపోయి వున్నది.

ఏదో చిన్నపిల్ల ఫోన్ చేసిందిగానీ, హార్టు ఎటాక్‌తో చనిపోయిన వ్యక్తి వద్దకి వెళ్లి తామేం చేయగలరు?

వెళ్లి ఓ మూల నుంచున్నారు ఇన్‌స్పెక్టరు పళనివేలు, సార్జంటు తంగం.

ఐ. జి. పి. కూడా వచ్చివున్నారు. సంపద వీళ్ళని చూడగానే పరుగున వచ్చి, ఇన్‌స్పెక్టరు చెయ్యి పుచ్చు కొని—"సార్! మా నాన్న హార్టు ఎటాక్‌తో చనిపోయా రంటే నేను నమ్మను. మా రిచెర్డు, సీజర్ల చావుకి మా డాడీ చావుకి కనెక్షను వుందని నా అనుమానం—" అంది ఏడుస్తూ.

సంపద మాటలకి అందరూ ఆశ్చర్యపోయారు.

ఐ. జి. ఆశ్చర్యంగా—"వాట్ యీజ్ ద మేటర్" అని ఇన్‌స్పెక్టర్‌ని ప్రశ్నించారు.

ఇన్‌స్పెక్టరు కుక్కల హత్య గూర్చి చెప్పాడు.

విలేఖరులు ఈగల్లా ముసిరారు.

"అయితే ఆమె డౌట్‌ని క్లియర్ చేసుకోవలసిందే" అని ఐ.జి. డెడ్‌బాడీని వెంటనే పోస్టుమార్టమ్‌కి పంపించారు.

ఈ వార్త క్షణాలలో మద్రాసంతా వ్యాపించిపోయింది. ప్రజలు తీర్థప్రజల్లా టి. ఆర్. నాయుడు భవంతికి రాసాగారు.

పోలీసులు వారిని కంట్రోలు చేయలేకపోతున్నారు.

పోస్టుమార్టమ్ రిజల్ట్సు మధ్యాన్నం మూడు గంటలకి వచ్చాయి.

అంతవరకూ అందరూ ఓపిగ్గా యెదురు చూస్తూనే వున్నారు.

ఆర్సెనికో యింజక్షను యివ్వడంవలన మరణం సంభవించినట్లుగా రిపోర్టు వున్నది.

"సో ఇట్ యీజ్ మర్డర్" ఐ.జి. అరిచారు.

"అసలు హార్టు ఎటాక్ అని ఎవ్వరన్నారు?" సంపదని ప్రశ్నించారు.

"మా డాడీ పర్సనల్ డాక్టరు" ఏడుస్తూ అన్నది.

అతనికోసం చూస్తే డెడ్‌బాడీతో వెళ్లిన మనిషి దానితో తిరిగిరాలేదని తెలిసింది.

ఇన్‌స్పెక్టరు పళనివేలు, సార్జంటు తంగం డాక్టరు యింటికి పరిగెట్టారు.

అతను ఓ చిన్న ఆధునిక బంగళాలో తల్లితండ్రితో

వుంటున్నాడు.

తండ్రి రిటైర్డ్ ఆర్మీ ఆఫీసరు.

అతని బెడ్ రూము తలుపులు లాక్ చేసి వున్నవి. పగుల గొట్టి చూస్తే—మంచంమీద చనిపోయి వున్నాడు.

అతని తల్లి గొల్లుమంది. టేబుల్ మీద లెటరు వుంది.

"టి. ఆర్. నాయుడుగారిని నేనే చంపాను. ఆయన కూతురు కుక్కలని నేనే హత్య చేశాను. రోజూ ఆ భవం తికి వెళ్లి వస్తూవుంటే ఆ యింటి సంపదని చూసి నాకు కళ్లు తిరుగుతూవుండేది. అంతటి ఐశ్వర్యానికి ఏకైక వారసురాలైన సంపదని చూస్తే ఎలర్జీ.

చివరకి డబ్బు ముఖ్యం అని తలచి సంపదతో స్నేహం సంపాదించాలంటే ముందు కుక్కలని హత్య చేయాలని కుక్కలని హత్య చేశాను.

అదే విధంగా అనుమానం రాకుండా నాయుడుగారిని హత్యచేసి, ఒంటరిగా నిస్సహాయురాలిగా వున్న సంపదకి సానుభూతి చూపి స్నేహం చేసి పెండ్లి చేసుకొని అంతటి ఐశ్వర్యాన్ని హస్తగతం చేసుకోవాలని తలంచాను. అయితే సంపద బయటికి కనబడేంత అమాయకురాలు కాదని తెలిసి పోయింది.

అందుకే శిక్షకి దొరక్కుండా నేను ఆత్మహత్య చేసు కొంటున్నాను" అని వ్రాసి వుంది.

డబ్బు ఎంతెంత పనులు చేయిస్తుంది.

కొండంత తండ్రీ కూడా లేడు.

కుళ్లి కుళ్లి ఏడుస్తున్న సంపద భుజం మీద ఓదార్పుగా తట్టాడు ఇన్స్పెక్టరు పళనివేలు.

"బాస్టర్డు" కసిగా తిట్టాడు తంగం.

విలేఖరులు హడావుడిగా వున్నారు. □

దొంగలకు విందు

సూర్యశ్రీ

జీవించడానికి ఎన్నో మార్గాలు. కష్టపడి బ్రతుకవచ్చు లేక పోతే, సునాయాసంగా. ఏమీ కష్టపడకుండా బ్రతికేందుకు అడుక్కుతినటం దొంగతనం చెయ్యటం.

అయితే అడుక్కు తినటం రిస్కులేని పని. దొంగతనం అంటే చాలా ప్రమాదమైన పని. దొరికేవరకు దొరలా తిరుగుతాడు కదా.

అదొక క్యాంప్ కాలనీ. సుమారు వంద క్వార్టర్సు వుంటాయి. ఆ ఊరికి మైలు దూరంలో వుంటుంది కాలనీ.

గత పది రోజుల్లోనూ ఆ ఊరిలో సంచలనం. ఎందుకంటే గత పదిరోజుల్లోనూ రోజుకు ఒక ఇల్లు చొప్పున దోపిడి దొంగలు వచ్చి, దొరికినవి దోచుకుని ఒకవేళ ఎవరైనా ప్రతిఘటిస్తే వారిని కొట్టి వెళ్ళిపోతున్నారు. ఇంత వరకు పోయిన ఆస్థి విలువ సుమారు లక్షరూపాయలు వుంటుంది.

ఊళ్ళో దొంగతనాలు విని కాలనీలో అందరికి భయం పట్టుకుంది. అసలే ఊరికి మైలుదూరంలో వున్నారు. తమని కాపాడేవాళ్ళు లేరు. గూర్ఖాలు వున్నారు కాని ఇద్దరు ఏం చేస్తారు? పైగా దొంగలు నోరు ఎత్తకుండా మెడమీద కత్తులు పెట్టి మరీ దొంగతనం ఘరానాగా చేస్తున్నారట.

ఆ దొంగతనాలు విని, ప్రజల విజ్ఞప్తులు విని, ప్రభుత్వం స్పెషల్ క్రైమ్ బ్రాంచి పోలీస్ బలగం ఏర్పాటు చేసింది.

స్పెషల్ బ్రాంచ్ పోలీస్ బలగం ఆ వూరు వచ్చి రెండు రోజులైంది. అయినా ఒక దొంగతనం జరిగింది.

ఆ రోజు—

2

రాత్రి పన్నెండు గంటలైంది.

రెండు మోటార్ సైకిళ్ళు కాలనీలో ప్రవేశించాయి. వాటిమీద నలుగురు వ్యక్తులున్నారు.

మోటార్ సైకిళ్ళు కాలనీలో ప్రవేశించగానే కాలనీలో

తిరుగుతున్న గూర్ఖాలు ఆపేరు.

"ఎవరు మీరు?"

"మీకెందుకు?"

"ఈ కాలనీకి కాపలా కాసేది మేమే. ఏదైనా జరిగితే మా పీకల మీదకు వస్తుంది. అసలే ఊర్లో దొంగల భయం ఎక్కువగా వుంది."

"అయితే, మేము దొంగలం అనుకుంటున్నారా?"

"ఏమో, ఎవరికి తెలుసు? మీరు ఎవరింటికి వెళ్ళాలో చెప్పండి?"

"చెప్పకపోతే—" అని నలుగురూ మోటార్ సైకిళ్లు దిగేరు.

"లోపలకు వెళ్ళనివ్వం!"

"అలాగా" అని ఇద్దరు వ్యక్తులు గూర్ఖాల వెనక్కి వెళ్లి వాళ్ళ చేతుల్లో కర్రలు లాక్కొని, వాళ్ళ తలలమీద కొట్టేరు. ఇద్దరూ పడిపోయేరు. ఇంక ఆ కాలనీకి దిక్కు లేదు. ఏం జరిగినా.

3

అది డివిజినల్ ఇంజనీరుగారి బంగళా. ఆ ఇంటికి ఇద్దరు వాచ్‌మెన్‌లు వున్నారు. అసలైతే ఒక్కడే వుండేవాడు కాని ఈ దొంగతనాల దృష్ట్యా ఇద్దర్ని పెట్టేరు ఆయన.

మోటార్ సైకిళ్ళు ఇంజనీరుగారి ఇంటిముందు ఆగేయి. గేటు దగ్గర వాచ్‌మెన్‌కి, గుమ్మం దగ్గర వాచ్‌మెన్‌కి నోరెత్తడానికి అవకాశం ఇవ్వకుండా నాలుగు తగిలించి స్పృహ పోగొట్టారు.

"టక్ టక్" తలుపులు తట్టేరు.

లోపల ఇంజనీరు గారి ఇంట్లో అందరూ గాఢ నిద్రలో వున్నారు. ఎందుకంటే కాలనీలో ఇద్దరు గూర్ఖాలు, ఇంటి

దగ్గర ఇద్దరు వాచ్‌మెన్‌లు వుండగా తమకేం భయం అని.

ఇంజనీరుగారు లేచేరు.

తలుపు తీసేరు.

ఎదురుగా నలుగురు వ్యక్తులు.

"పదండిరా. ఒకడు ఇంటి వెనక్కి వెళ్ళండి. ఎవరూ పారిపోకుండా" అని ఇంజనీరుగార్ని లోపలకు తోసి, ముగ్గురూ లోపలకు వెళ్లి తలుపులేశారు.

ఇంజనీరుగారి పేరు మూర్తి.

మూర్తిగారి మెడ దగ్గర తుపాకిపెట్టి, ఒకడు అన్నాడు.

"అనవసరంగా మీరు అరవ్వద్దు గొడవ చెయ్యవద్దు. అలా చేస్తే మీ కుటుంబంలో ఎవర్నీ మిగల్చకుండా అందర్నీ పైకి పంపిస్తాము——"

మూర్తిగారు గడగడ వణుకుతున్నారు.

"మీకు ఏం కావాలో అవి తీసుకువెళ్ళండి నాకేం అభ్యంతరం లేదు. మమ్మల్ని ఏమి చేయకండి" అన్నారు మూర్తిగారు.

"ఎందుకైనా మంచిది ఈయన దగ్గర ఒకడు కత్తితో వుండండిరా" అన్నాడు అందరిలోకి పొడుగ్గా వున్నవాడు. వాడు నాయకుడులా వున్నాడు.

"లోపల బీరువాలు, ఖరీదైన వస్తువులు వున్న చోటుకు తీసుకువెళ్ళండి" అన్నాడు నాయకుడు. అరగంటలో డబ్బు, విలువైన వస్తువులన్నీ మూటకట్టుకున్నారు.

ఈలోగా ముగ్గురూ ఏదో గుసగుసలాడుకొన్నారు.

"మాకు బాగా ఆకలేస్తోంది. ఏమైనా తినటానికి కావాలి వున్నాయా?" అన్నాడు నాయకుడు.

"ఈ రోజు మా నాన్నగారి తద్దినం. పిండివంటలు వున్నాయి. నిజంగా మీరు ఈ రోజు వచ్చి తినటం నాకు

చాలా సంతోషంగా వుంది. ఉండండి నా భార్యను లేపు తాను. ఆమె మీకు వడ్డిస్తుంది," అని తన భార్యను లేపేరు మూర్తిగారు.

ఆమె లేచి వాళ్ళను చూసి అరవబోయింది. ఒక దొంగ వెళ్ళి ఆమెకు కత్తి చూపించేడు.

"నువ్వు మాట్లాడకు. వాళ్ళకు కావాల్సినవి యిచ్చి పంపించేద్దాం. ప్రాణంకన్నా ఎక్కువా?" మూర్తి నచ్చ చెప్పాడు ఆమెకు. ఆమె ఎలాగో నిలదొక్కుకుని వంట ఇంట్లోకి నడిచింది.

డైనింగ్ టేబుల్ చుట్టూ కూర్చున్నారు ముగ్గురు దొంగలు. వాళ్ళు అడిగినవన్నీ—అందులోనూ ఆ రోజు తద్దినం కాబట్టి పిండివంటలతో సహా పెట్టేసింది ఆమె. వాళ్ళు అవి తింటూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూంటే మూర్తిగారు దొంగలతో "నేను ఒకసారి బాత్‌రూమ్‌కి వెళ్తాను" అన్నాడు.

"అరేయ్! ఒకడు వెళ్ళండి ఆయన కూడా" అన్నాడు వాళ్ళ నాయకుడు.

మూర్తిగారి కూడా బాత్‌రూమ్‌దాకా వెళ్ళి బయట కూర్చున్నాడు దొంగ. లోపలకెళ్ళి ఐదు నిముషాల్లో మూర్తిగారు బయటకు వచ్చేరు.

ఏదో పిచ్చాపాటీ మాట్లాడుతూ దొంగలను మంచి చేసుకుని కనీసం కొన్ని అయినా మిగుల్చుకోవాలని మూర్తిగారి భార్య ఆరాట పడుతోంది. తాము ఎంతో కష్ట పడి సంపాదించుకున్నామని, తమకు కావల్సినవే తీసుకు వెళ్ళమని, ఇద్దరు ఆడపిల్లలకు కొంచం బంగారం అట్టే పెట్టమని దొంగలను బ్రతిమాలుతోంది ఆమె. దున్నపోతు



మీద వాన కురిసినట్లు వాళ్ళకు ఇవేమీ వినిపించలేదు.

ఒక అరగంట గడిచింది.

ఇంటిబయట దొడ్డిగుమ్మం దగ్గర ఉన్న దొంగకు నిద్ర మత్తుగా వుంది. గత పదిహేనురోజుల నుంచి ఒకటే నైట్ డ్యూటీలు. బాస్ చెప్తే వినడు.

తలమీద చిన్న దెబ్బ తగిలింది. తల ఎత్తేడు. అంతే, అతని తల తిరిగిపోయింది. తన ఎదురుగా కనీసం ఇరవై మంది పోలీసులు, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు నిలబడ్డారు.

"నోరెత్తావంటే చస్తావ్. నేను చెప్పినట్లు చెయ్యి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ జగన్. దొంగకు ఇంక మాట్లాడే అవకాశంలేదు.

"నువ్వు ముందుకు వెళ్ళి, వీధి తలుపు తట్టి 'ఆలస్యమవుతూంది రండి' అని మీ వాళ్ళని పిలువు. మర్యాదగా మేము చెప్పినట్లు చెయ్యి—"

దొడ్డి గుమ్మం దగ్గర కొంతమంది పోలీసులు ఒక ఇన్‌స్పెక్టర్, ముందువైపుకు దొంగతోపాటుగా కొంతమంది పోలీసులు ఇన్‌స్పెక్టర్ వెళ్ళేరు. దొంగచుట్టూ పోలీసులు ఇన్‌స్పెక్టర్ వుండి వీధి తలుపులు తట్టమని చెప్పేరు.

"బాస్! లైమవుతోంది. వెళ్దాం," అని అతను తలుపు తట్టేడు.

లోపల—

"అరేయ్! మనోడికి ఆకలవుతూందిలా వుంది. మీలో ఒకడు వెళ్ళి అణ్ణి పంపియ్యండి" అన్నాడు నాయకుడు.

వాళ్ళల్లో ఒకడు వచ్చి ఒక తలుపు తీసేడు. పోలీసులు, ఇన్‌స్పెక్టర్ తలుపు తీసిన దొంగను అరెస్టు చేసి లోపలకు దూసుకు వెళ్ళేరు. మిగతా ఇద్దరు దొంగలు దొడ్డివైపు పారిపోతుంటే వెనుక నున్న పోలీసులు పట్టుకున్నారు వాళ్ళను.

దొంగలను, చేతులు వెనక్కి విరిచికట్టి ఇంటిముందుకు తీసుకువచ్చేరు.

"మూర్తిగారూ! మీరు ఈ దొంగలను పట్టుకోవటంలో మాకు ఎలాగ ఇన్‌ఫర్‌మేషన్ ఇచ్చేరు?" అని అడిగేడు ఇన్‌స్పెక్టర్ జగన్.

"గత కొన్ని రోజులుగా దొంగతనాలు జరుగుతున్నాయి కదా. ఊళ్ళో ప్రముఖుల ఇళ్లు దాదాపు అయిపోయాయి. ఇక కాలనీలో మొదట నా యింటికే వస్తారని అనుకున్నాను.

అందుకని కాలనీలో చివరి ఇంటికి, అంటే రోడ్డుకు దగ్గరగా ఉన్న ఇంటికి, మా ఇంటిలోనుండి ఒక అలారమ్ పెట్టేను. దానికి స్విచ్ మా బాత్‌రూమ్‌లో పెట్టేను. ఎంత దొంగ అయినా బాత్‌రూమ్‌కి వెళ్తానంటే వద్దనడు కదా.

మా మనుషులను ఆ ఇంటిలో పెట్టేను. అలారం వినగానే పరుగులతో మీ క్రైమ్‌బ్రాంచి స్టేషన్‌కి వచ్చి బూట్లు లేకుండా మిమ్మల్ని నడిచిరమ్మని చెప్పమని చెప్పేను. ఈ సంగతి కాలనీలో ఎవరికి తెలియదు. మా ఆడవాళ్ళకు అసలు చెప్పలేదు. నా భార్య నిజంగా చాలా భయపడింది.

అంతే—నేను మామూలుగా బాత్‌రూమ్‌కి వెళ్తా నన్నాను. నా కూడా ఒకడు వచ్చి నన్ను బాత్‌రూమ్‌లోకి పంపించి బయట నుంచున్నాడు. నేను లోపలకు వెళ్లి అలారం స్విచ్ నొక్కి, అనుమానం రాకుండా ఒక క్షణం నిలబడి, బైటకు వచ్చేను.

మీరు వచ్చేవరకు వీళ్ళని ఎలా వుంచాలా అని కొంచెం భయపడ్డాను. కాని నాకు సమస్యలేకుండా వస్తూనే ఆకలి అన్నారు. శుభ్రంగా అన్నం పిండివంటలు కడుపునిండా పెట్టేను, ఈ రోజు మా ఇంటిలో తద్దినం కాబట్టి. మీరు మాతో సహకరించేరు. కృతజ్ఞుణ్ణి'' అన్నారు మూర్తిగారు.

''మిస్టర్ మూర్తీ! అయామ్ ప్రవుడ్ ఆఫ్ యు. దొంగలను చూసి ధైర్యంగా ఉపాయంతో పట్టుకోవటం ప్రశంసనీయం. యూ విల్ బి యవార్డెడ్ సూటబ్లీ'' అన్నారు ఇనస్పెక్టర్ జగన్.

''బాబూ, కడుపునిండిందా లేకపోతే ఇంకా తినండి. మిగిలిపోయాయి పిండివంటలు'' అంది మూర్తిగారి భార్య.

''కడుపు నిండటం కాదు. తిన్నవన్నీ కక్కిస్తాను. పదండిరా రాస్కెల్స్'' అని ఇనస్పెక్టర్ లాఠీతో తలా నాలుగు తగిలించేడు.

ఇంతలో పోలీస్ వేన్ వచ్చి మూర్తిగారి ఇంటిముందు ఆగింది. □

Robbery of House

ఇల్లు దోపిడి

బొమ్మిడి అచ్చారావు



"మా బావగారు పంపించారు, యిల్లు ఖాళీచేసి మీకు అప్పగించమని. లారీ కూడా తీసుకొచ్చాను" అన్నాడతను కోదండరామయ్యతో.

కోదండరామయ్య అతన్ని పరీక్షగా చూసి, "మిమ్మల్ని

యిదివరలో ఎన్నడూ చూసినట్టు లేదే!" అన్నాడు.

"చూసివుండరు. మా అక్కా, బావ యీ యింట్లో దిగాక నేను ఒక్కసారి కూడా రావటం పడలేదు. వైజాగ్‌లో యూనివర్శిటీలో చదువుతున్నాను. మా బావ గారికి ఈ లోపల అనుకోకుండా ఢిల్లీ ట్రయినింగ్ వచ్చింది" అన్నాడతను.

"అవును. ఆయన యిల్లు ఖాళీచేసి వెళ్ళేందు కక్కడా టైం లేకపోయింది, మీ అక్కగార్ని పిల్లల్ని మీ యింట దిగబెట్టి ఢిల్లీ వెళ్ళిపోతానని నాతో చెప్పారు. తర్వాత మీరొచ్చి యిల్లు ఖాళీచేసి అప్పగిస్తారని కూడా చెప్పారు" అన్నాడు కోదండ రామయ్య.

"సమయానికి నేనూ మా యింట లేనండి. మా నాన్న గారు నాకు టెలిగ్రాం యిచ్చి రప్పించారు వైజాగ్ నుంచి. మా అక్కను, పిల్లల్ని మా యింట విడిచి ఆయన అప్పటి కప్పుడే ఢిల్లీ వెళ్ళిపోయారట. అక్క చెప్పింది వివరాలు. తాళాలు యిచ్చి పంపింది. లారీ దార్లో మాట్లాడి తెచ్చాను" అన్నాడతను.

"మీ పేరు?...."

"భాస్కర్" అన్నాడతను.

లారీతోపాటు వచ్చిన క్లీనరు కుర్రాడు, డ్రైవరు సామాను పట్టడానికి వచ్చారు.

భాస్కర్ తలుపులు తీసి సామానుల వంక పరీక్షగా చూశాడు. చాలవరకు ప్యాక్ చెయ్యబడి వున్నాయి. ఇంకా పూర్తిగా సర్దలేదనడానికి నిదర్శనంగా కొన్ని సామానులు లూజ్‌గానే వున్నాయి. లారీ లోపల్నుండి గోతాములు తెప్పించాడు క్లీనరు కుర్రాడిచేత. వాటిలో లూజ్‌గా వున్న సామాన్లు ప్యాక్ చెయ్యటం మొదలెట్టాడు.

కోదండరామయ్య లోపలికి తొంగి చూసి, "మీ బావ గారు కరెంటు బిల్లు గురించి ఏమయినా చెప్పారా?" అన్నాడు.

భాస్కర్ తలెత్తి చూసి, "లేదండి. బాకీ వున్నారా?" అనడిగాడు.

"ఇప్పటివరకు కాలిన కరెంటుకి లెక్క కట్టలేదండి, సెపరేట్ మీటర్ కదా! ఎన్ని యూనిట్లు అయినదీ లెక్క కట్టి నాకిస్తుండేవారు. మెయిన్ మీటర్ మా పోర్షన్లో వుంది" అన్నారు కోదండరామయ్య.

"రీడింగ్ చూడండి. ఇచ్చేస్తాను." అన్నాడు భాస్కర్.

"నో, నో, మీరేం యివ్వనక్కరలేదు. నేనే తిరిగి యివ్వాల్సి వుంటాను. నెల మధ్యలో వెళ్ళిపోతున్నారు కదా—ఎడ్వాన్స్ సొమ్ము తిరిగివ్వాల్సి వున్నాము. పది రోజుల అద్దె, కరెంటు బిల్లు మినహాయించుకోగా, తక్కిన, అద్దె అరవై రూపాయల లెక్క తేలింది, తీసుకోండి!" అన్నాడు కోదండరామయ్య.

భాస్కర్ డబ్బు తీసుకున్నాడు. సామాన్లు సర్దడం పూర్తయింది. ముందు బీరావా, డబుల్ కాట్, సోఫాసెట్టు లారీ కెక్కించారు. ఆ తర్వాత చిన్న శాల్తీలు ఒక్కొక్కటే లారీ ఎక్కాయి.

కోదండరామయ్య యీ లోపల అందరికీ కాఫీలు పంపించాడు. భాస్కర్ని భోజనానికి వుండమని చాలా బలవంతం చేశాడు. కాని భాస్కర్ సున్నితంగా తిరస్కరించాడాయన ఆఫర్ని.

లారీ లోడ్ అయింది. భాస్కర్ కోదండరామయ్యగారి వద్ద సెలవు తీసుకున్నాడు.

లారీ బయల్దేరింది.

2

"ఈ యిల్లేనండి" అతను చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పోలీస్ జీప్ ఆ యింటి ముందు ఆగింది.

ఇన్‌స్పెక్టర్ దిగి ఆ యింట్లోకి నడిచాడు.

అతను అప్పటికే వెళ్ళి యింటి యజమానితో మాట్లాడుతున్నాడు.

"ఈయనే సార్ యింటి యజమాని. పేరు కోదండ రామయ్యగారు" అతను పరిచయం చేశాడు.

శ్రీనివాస్ ఆయన వంక నిశితంగా చూశాడు. వయసు ఏభై వరకు ఉండొచ్చు. సన్నగా పొడవుగా వున్నాడు. ముఖంలో అనుభవం గీతలు. శ్రీనివాస్‌ని చూసి నమస్కారం చేశాడు.

శ్రీనివాస్ తలూపి, "మీరెన్నాళ్ళుగా యీ యింట్లో కాపరమున్నారు?" అనడిగాడు తనతో వచ్చిన వ్యక్తిని.

"దాదాపు రెండేళ్ళున్నాను సార్!" చెప్పాడతను.

"ఈ రెండేళ్ళలోను మీ బావమర్ది మీ దగ్గరకు రాలేదా?" అడిగాడు శ్రీనివాస్.

"వచ్చాడు సార్, రెండు మూడుసార్లు వచ్చాడు."

శ్రీనివాస్ కోదండరామయ్య వంక తిరిగి, "మీరిదివరలో యీయన బావమర్దిని చూడలేదా?" అనడిగాడు.

"చూశాను సార్! అయితే మొన్నొచ్చినాయన మరో బామ్మరిది అనుకున్నాను" అన్నాడు కోదండరామయ్య.

"అతనెలా వున్నాడో వర్ణించగలరా?"

వివరంగా చెప్పాడు కోదండరామయ్య.

"మీరతన్ని యిదివరలో చూడలేదు కదా? అతన్ని మొన్న చూడగానే అనుమానం రాలేదా మీకు?"

"వచ్చింది సార్! అయితే,అతను ఎటువంటి అనుమానం కలక్కుండా వ్యవహరించటంతో నా అనుమానం తొలగి పోయింది."

"లారీ నంబరు చూశారా?"

"చూశాను సార్! అయితే యిటువంటి అవసర ముంటుందని వూహించలేదు. అయినా నంబరు గుర్తుంది- ఎ. పి. క్యూ. 6438. ఆకుపచ్చరంగు. లేల్యాండు బండి. కొత్తగా వుంది."

"అయినా నంబరు ప్లేటు మార్చెయ్యవచ్చు, చెప్పలేం. ఇంకా ఏమైనా వివరాలు చెప్పగలరా?"

కోదండరామయ్య రెండు నిమిషాలు ఆలోచించి "అంతే సార్!" అన్నాడు.

"మిష్టర్ రామకృష్ణా! ఈ ఘరానా దొంగెవడో మీ గురించి బాగా తెలిసినవాడై వుండాలి. మీ ట్రయినింగ్ గురించి, మీరా యిల్లు ఖాళీచేస్తాననటం, మీ బావమరిది పంపిస్తాననటం—విని వుంటాడు. మీరు కోదండరామయ్య గారితో మాట్లాడుతున్నప్పుడు యిదంతా విని వుండాలి. ఆ సమయంలో మీతో మరెవరైనా వున్నారా?" అడిగాడు శ్రీనివాస్.

"కొత్త వాళ్ళెవరూ లేరుసార్! అంతక్రితం చూసి వున్న వ్యక్తి అయితే కోదండరామయ్య గుర్తుపట్టి వుండే వారు. వాణ్ణి యిదివరలో ఆయన చూసివుండరు. పోలికల్ని బట్టి ఆలోచించినా అలాంటి వ్యక్తి ఎవరూ నాకు తెలిసిన వాళ్ళలో ఉన్నట్టు లేదు" అన్నాడు రామకృష్ణ.

"ఏ విధంగా చూసినా యిది చాలా ప్లాన్డ్‌గా జరిగిన దోపిడీలా వుంది. మీ సామానులో ఖరీదయిన వేమిటి?"

"స్టీలుబీరువా, సోఫాసెట్టు, డబుల్‌కాట్, ఫ్రిజ్, టేప్

రికార్డరు, రేడియో, ఫోల్డింగ్ టేబిల్సు రెండు సన్‌మైకా కుర్చీలు, టేబిల్ ఫాన్లు రెండు, ఖరీదైన సూట్‌కేసులు వున్నాయి. చాలా స్టీలు సామానుంది. ఇంకా గ్యాస్‌స్టౌ వగైరా గృహోపకరణమైన వస్తువులు చాలా వున్నాయి. అన్నిటి విలువా సలభై వేలకి తక్కువుండదు" విచారం ధ్వనించింది రామకృష్ణ గొంతులో.

"అన్ని సామాన్లు వాడు జాగ్రత్తపెట్టుకోడనిపిస్తోంది. ఖరీదైనవి వుంచుకుని తక్కిన వాటిని, బాగా గుర్తు తెలిసేవాటిని, ఎక్కడో వదిలిపెట్టెయ్యటమో, ఎవరికో యిచ్చెయ్యటయో చేస్తాడు. ముందు అతనే ప్రాంతం వాడో తెలిస్తే మన పరిశోధన తేలికవుతుంది" అన్నాడు శ్రీనివాస్.

రామకృష్ణ తలూపాడు. "రండి, మీ రుండిన పోర్షన్ ఓసారి పరిశీలిద్దాం" అన్నాడు శ్రీనివాస్. రామకృష్ణ అనుసరించాడు. "ఇంకా ఆ పోర్షన్ ఎవరికీ అద్దెకివ్వలేదనుకుంటాను. కడిగి ముగ్గులుపెట్టి వుంచారు" అన్నాడు.

శ్రీనివాస్ ఆ పోర్షన్ పరిశీలనగా చూశాడు. ఇంటి యజమాని వుంటున్న వాటా లాగానే వుంది. మూడు గదులు. సెపరేట్ కిచెన్, బాత్, సెప్టిక్ లావెట్రీ వున్నాయి.

"పూచికపుల్లతో పాటు ప్రతిసామానూ లారీ కెత్తేశాడు సార్! నా కనుమానం వస్తుందని ఏదీ మిగలనివ్వ లేదు" అన్నాడు కోదండరామయ్య.

శ్రీనివాస్ తలూపాడు.

"అయితే, రెండు ట్యూబులైట్లు, రుబ్బురోలు అలాగే వదిలేశాడు. నేనుకూడా మొదట గమనించలేదు. బహుశా అవి మావే ననుకుని వుంటాడు" అన్నాడు కోదండ రామయ్య.

"లారీ ఎటునించి వచ్చింది? మళ్ళీ లోడ్ చేసుకుని ఎటు వెళ్ళింది?" అడిగాడు శ్రీనివాస్.

కోదండరామయ్య ఏదో గుర్తు తెచ్చుకుని, "లారీ పిఠాపురం రోడ్‌న వచ్చింది సార్! మళ్ళీ అదే రోడ్డున తిరిగిపోయింది" అన్నాడు.

"లారీ విషయంగా బాగా గుర్తుపెట్టుకోవలసిన అంశ మేదైనా వుందా?"

"ఆఁ..గుర్తొచ్చింది సార్! సామాన్లమీద టార్పాలిన్ కప్పమన్నాడు సార్ అతను. అయితే అప్పటికే అవి తడిసిపోయి వున్నాయి. అంటే దార్లో వర్షం పడివుండాలి. కాని ఆ రోజు యిక్కడ ఒక చినుకు కూడా పడలేదు."

"ఐ.సీ. ఆ రోజు ఎక్కడెక్కడ వర్షం పడిందో ముందు తెలుసుకోవాలి. లారీ యెక్కడినుంచి, ఏ రూట్‌న వచ్చిందో తెలుస్తుంది. దాన్ని బట్టి అది ఎవరిదో ఆచూకీ తెలుసుకోవచ్చు" అన్నాడు శ్రీనివాస్.

రామకృష్ణ మౌనంగా తలూపాడు.

"మీరు ఢిల్లీ వెళ్ళి ఎన్నిరోజు లయింది?" అడిగాడు శ్రీనివాస్.

"పదిహేనో తేదీన వెళ్ళానండి. పదహారు మధ్యాహ్నం చేరాను ఢిల్లీ. పదిహేడున మా బావమర్దినుంచి టెలిగ్రాం వచ్చింది. ఆ రాత్రికి రాత్రి జి.టి. ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి వచ్చేశాను. నిన్న చేరాను కాకినాడ. వెంటనే మీకు రిపోర్టు చేశాను. మా బావమర్ది పదిహేడు ఉదయం యిక్కడికి వచ్చాడట - యిల్లు ఖాళీచేద్దామని. పదహారు రాత్రికి రాత్రే యీ ఘోరం జరిగిపోయింది. ఇంటి యజమాని చెప్పిన విషయం విని మావాడికి మతిపోయిందట. వెంటనే బయల్దేరి రమ్మని టెలిగ్రాం యిచ్చాడు. ట్రయినింగ్ అథార్టీస్ పర్మిషన్‌తో వచ్చాను" అన్నాడు రామకృష్ణ.

"మీ సన్నిహితుల, స్నేహితుల పేర్లు, విలాసాలు నాకో లిస్టు రాసివ్వండి. ముఖ్యంగా మీరంటే గిట్టనివాళ్ళు, మీ ఉన్నతిని చూసి సహించలేనివాళ్ళు యెవరన్నా వుంటే వివరాలు చెప్పండి."

"అలాగే సార్! నాకు ఆస్తి అంటూ వుంటే - అది యిదే! ఇవన్నీ సంపాదించుకోవాలంటే నా కీ జన్మ సరిపోదు!" రామకృష్ణ కంఠం బొంగురుపోయింది.

శ్రీనివాస్ అతని భుజం తట్టి, "డోంట్ వర్రీ! దోషి దొరక్కపోడు" అని ధైర్యం చెప్పాడు.

3

"పదహారో తేదీ సాయంత్రం నుండి ఆ రాత్రి ఎనిమిదిన్నర వరకు తుని, కత్తిపూడి మధ్య వర్షం పడింది సార్! కత్తిపూడికి యివతల మళ్ళీ వర్షం లేదు. పిఠా

పురంలో చిన్న జల్లు పడిందట. అంతే! ఇంకెక్కడా ఆ రోజు వర్షం లేదు" చెప్పాడు సార్జంట్.

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తలూపాడు.

అతనికి ఓ సమస్య విడిపోయింది. సామాను తీసుకు వెళ్ళిన లారీ తుని ప్రాంతాలదయి వుంటుంది. అక్కడి లారీ అయితే ఎవరికీ విషయం బయటపడదని అక్కడి నుంచే లారీ తెచ్చుకున్నాడు దొంగ. అంటే వాడిది కూడా ఆ ప్రాంతమే అయుంటుంది. తాము తుని చుట్టుపట్ల గాలిస్తే సొమ్ము దొరికిపోతుంది!

శ్రీనివాస్ చకచక బయటికొచ్చి జీప్ బయటికి తీశాడు. ఇద్దరు సార్జంట్స్‌ని తనతో తీసుకువెళ్ళాడు. కోదండ రామయ్య కూడా లోడ్ లారీ పిఠాపురం రోడ్డు పట్టినట్టు చెప్పాడు. కాబట్టి తను పిఠాపురం రోడ్డున ఎంక్వయిరీ చేస్తూ పోతే ఫలితం కనిపించవచ్చు.

శ్రీనివాస్ పిఠాపురం పోయే వరకు మధ్యలో కొన్ని చోట్ల ఆ లారీ గుర్తులు చెప్పి ఎంక్వయిరీ చేశాడు. ఎవరూ సరిగ్గా చెప్పలేకపోయారు.

పిఠాపురం, కత్తిపూడి రోడ్‌లో ఓ టీ బంక్ దగ్గర అతనికి ఆశాజనకమయిన సమాచారం దొరికింది. పదహారో తేదీ బుధవారం రాత్రి 'సంసారం సామాను' వేసుకున్న ఆకుపచ్చరంగు కొత్త లారీ తన టీ బంకు దగ్గర ఆగి 'టీ' తీసుకున్నట్టు టీ బంకు అతను చెప్పాడు.

"సంసారం సామానే అని ఎలా చెప్పగలవు? పైన టార్పాలిన్స్ పరిచి వుండాలే!?" అన్నాడు శ్రీనివాస్.

"మా బంకు దగ్గిర ఆగేటప్పటికి టార్పాలినులున్నాయి బాబూ! అయితే అవి తడిసి ముద్దయిపోయున్నాయి. వాటి మూలంగా కింద వున్న సామాను పాడయిపోద్దనుకున్నారు

డ్రైవరు, మరో మనిషీని. టార్పాలినులు విప్పేసి కేబిన్ టాప్‌మీద చుట్టచుట్టి పడేసారు. అప్పుడే చూశాను, అది సంసారం సామానని. ఎవరో పెద్దోరు ట్రాన్స్‌ఫరయి పోతన్నారని అనుకున్నాను" అన్నాడతను.

"అంతక్రితం ఇక్కడ వర్షం పడిందా?"

"పడ్డాదిబాబూ! అంతకి ఓ గంటకితమే తగ్గిపోయింది. ఇక్కడికన్నా కత్తిపూడి అవతల బాగా పడింది. నాకు అన్నవరంలో పనుండి వెళ్ళి అప్పుడే తిరిగొచ్చాను. నేనొచ్చిన పదినిమసాలకి లారీ వొచ్చింది."

"టీ తాగాక, ఎటుపోయింది లారీ?"

"కత్తిపూడివేపే పోయిందండి లారీ?"

"ఆ లారీ ఎక్కడికి కెళ్తుందో వాళ్ళేమయినా మాట్లాడుకున్నారా?"

"ఏం లేదండి."

"శ్రీనివాస్ కత్తిపూడివంక జీప్ పోనివ్వమని ఆదేశించాడు. కత్తిపూడివద్ద మళ్ళీ జంక్షన్ వచ్చింది. ఓ రోడ్ ప్రత్తిపాడు, మరో రోడ్ అన్నవరం పోతుంది. జంక్షన్లో అడిగాడు. కాని ఎవరూ సరయిన సమాచార మివ్వలేక పోయారు.

అయినా శ్రీనివాస్ నిరాశపడలేదు. అతని శ్రమ ఫలించింది. పోష్టుఠాణా వద్ద అతనికి సరైన సమాచారం దొరికింది. ఆ రాత్రి 11 గంటల ప్రాంతాల ఆకుపచ్చ లేలేండ్ లారీ తునివైపు వెళ్ళినట్టుగా ఠాణారికార్డ్సులో వుంది. అయితే, నంబరు మారిపోయింది, ఎ. పి. డబ్ల్యు 3388. శ్రీనివాస్ తనూహించిందే జరిగిందనుకున్నాడు. ఠాణేదార్‌ని ప్రశ్నించాడు.

"ఆ రాత్రి డ్యూటీలో మీరే వున్నారా?"

"అవును సార్! మాది డే అండ్ నైట్ డ్యూటీ. సంసారం సామాను వేసుకెళ్తున్న లారీ నేనే స్వయంగా చూశాను. లారీ అంతా చెక్ చేయనిది వదలను. లోపల చాలా ఖరీదైన సామానుంది. టార్పాలిన్లు ఓపన్ చేసి వున్నాయి. నేనే సలహా యిచ్చాను — మబ్బుగా వుంది కదా టార్పాలిన్సు వేసుకుపొమ్మని. తడిసి పోయాయని చెప్పారు. సామాను చుట్టిన గోతాములు కూడా తడిసి వున్నాయి.

"ఆ టార్పాలిన్స్ వాటర్‌ప్రూఫ్‌వి కావా?"

"కావండి. బాగా పల్చగావున్నాయి. కొత్త బండికి వుండాల్సినవి కాదు అవి!"

"సామాను ఎక్కడికో చెప్పారా?"

"వివరాలు నేనడగలేదండి."

"ఆ సామానులో స్టీలుబీరువా, సోఫాసెట్టు, ఫేన్లు, ఫోల్డింగ్ టేబిల్సు మొదలయినవి వున్నాయా?"

"కరెక్టుగా అవేనండి. లారీ నిండిపోయింది."

"థాంక్యూ! లారీ తునివైపు పోయిందా?"

"అవునండి. ఆ లారీ కూడా తునిదేనండి. చాలాసార్లు మా రూట్‌నే తిరుగుతుంటుంది. తునిలో మీకు దొరక వచ్చు ఆ లారీ."

"ఓ. కే." శ్రీనివాస్ జీప్ ఎక్కాడు. సరాసరి జీపు తుని చేరుకుంది. లారీ బ్రోకర్సు ఆఫీసుల్లో ఎంక్వయిరీ చేశాడు శ్రీనివాస్.

వెంకట్రామా లారీ బ్రోకర్స్ ఆఫీసులో లారీ దొరికింది.

శ్రీనివాస్ లారీ ఓనర్‌ని ఎంక్వయిరీ చేశాడు.

"పదహారో తేదీ మా లారీ కాకినాడ కిరాయికి వెళ్ళిన మాట నిజమే! అయితే ఆ డ్రైవరు ఆ మర్నాటి నుంచే పని మానేశాడు. ఆ క్లీనరు కూడా యిప్పుడు లేడు." అన్నాడు ఓనర్.

"ఎందుకు అంత సడన్‌గా మానేశాడో చెప్పగలరా?"

"లారీ డ్రైవర్ల సంగతి మీకు తెలియని దేముంది సార్! జీతం చాలడటం లేదని, నేనిచ్చిన బేటా సరిపోవటం లేదని—ఏవేవో గొంతెమ్మ కోర్కెలు కోరాడు. అసలు అతనికే పని చెయ్యటం ఇష్టంలేక యిదో సాకుపెట్టాడు. జీతం ఓ పాతిక పెంచుతానని కూడా అన్నాను. లెక్క చెయ్యకుండా మానేశాడు."

"అతని పేరు, అడ్రసు చెప్పండి."

"పేరు ఖాశిం సాహెబ్. ఇదివరకు యిక్కడే పాయక రావుపేటలో వుండేవాడు. మానేశాక అతని సంగతి తెలీదు. డ్రైవర్స్ ఎవరికేనా తెలుసేమో కనుక్కుంటా నుండండి" అన్నాడు ఓనర్.

అక్కడ చుట్టుపక్కల ఆఫీసులకు ఫోన్‌చేసి ఖాశిం వివరాలు అడిగాడతను. రెండు రోజుల క్రితమే అతను యిల్లు ఖాళీచేసి పొయాడని ఓ డ్రైవర్ ద్వారా తెలిసింది.

శ్రీనివాస్ తల పంకించాడు. ఈ దోపిడీలో ఆ డ్రైవర్‌కి కూడా భాగముందన్న మాట! అందుకే అకస్మాత్తుగా పని మానేసి యిల్లు ఖాళీ చేసేశాడు. పోనీ క్లీనర్ కుర్రాడయినా దొరుకుతాడేమోనని అడిగాడు శ్రీనివాస్.

"వాళ్ళిద్దరు కూడబలుక్కుని మానేసినట్లున్నారు సార్, ఆ ఖాశింతోపాటు ఆ క్లీనరు సుబ్బిగాడు కూడా మానేశాడు."

"ఆ రోజు లోడ్ ఎక్కడ దించారో మీకేమైనా తెలుసా?"

"తునివరకే మాట్లాడుకున్నారు. కాకినాడ వరకు ఎమ్టీ లారీయే తేసుకెళ్ళారు. తుని సామాను తీసుకురావటానికి కిరాయి మాట్లాడుకున్నాం. అయితే అన్‌లోడింగ్ ఎక్కడ అయిందో ఆ డ్రయివర్‌కీ, క్లీనర్‌కే తెలియాలి."

శ్రీనివాస్ పెదిమ విరిచాడు. తునివంటి పెద్దపట్నంలో ఎక్కడని, ఏ యిల్లని వెతకటం? ఎవర్ని అనుమానించటం? ఇది జరిగేపనిలా తోచలేదు శ్రీనివాస్‌కి.

సరాసరి పోలీస్‌స్టేషన్‌కి పోయి డ్యూటీ యినస్పెక్టర్‌కి వివరాలు చెప్పి ఎంక్వయిరీ చేయమని, తిరుగుప్రయాణ మయ్యాడు శ్రీనివాస్.

4

శ్రీనివాస్ కాకినాడ తిరిగొచ్చేసరికి స్టేషన్లో యెదురు చూస్తున్నాడు రామకృష్ణ. అంత బడలికలోను చిరునవ్వుతో రామకృష్ణ ప్రశ్నలకి సమాధానం చెప్పాడు శ్రీనివాస్.

"చాలవరకు ఫలితం కనిపించింది. త్వరలోనే నేర స్తున్ని పట్టుకుంటాం. మీ సన్నిహితుల వివరాలు తెచ్చారా?"

రామకృష్ణ ఓ అరఠావు సైజు కాగితం శ్రీనివాస్‌కి అందించాడు. శ్రీనివాస్ చకచక ఓసారి పేర్లు చూసి, "ఈ పేర్లుగలవాళ్ళ స్థిరనివాసాలు కూడా చెప్పండి" అన్నాడు.

రామకృష్ణ పేరు పేరునా చెపుతుంటే శ్రీనివాస్ ఆ పేరు కెదురుగా ఎర్రసిరాతో రాసుకుంటున్నాడు. "కె.రాఘవ రావు—నేటివ్ ఆఫ్ తుని" అన్నాడు రామకృష్ణ.

"ప్లీజ్ స్టాప్! రాఘవరావు మీ ఆఫీసేనా?"

"అవును సార్! నా కొలీగే. ఏం అలా అడిగారు?"

"మీరు కోదండరామయ్యగారితో యిల్లు ఖాళీ చేస్తానని

చెప్పినపుడు రాఘవరావు మీ వద్ద వున్నాడా?”

“ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరు సార్! మీరు అడుగుతుంటే గుర్తొచ్చింది—ఆ రోజు-అంటే నేను ఆఫీసులో రిలీజ్ అవుతున్నరోజు రాఘవరావు మాటల సందర్భంలో అన్నాడు—‘సంవత్సరంపాటు ట్రయినింగ్‌లో వుంటావు కదా! అన్నాళ్ళు అనవసరంగా అద్దె భరించటం దేనికి!’ అని. ఖాళీ చేసేస్తున్నానని, మా బావమర్ది మర్నాడొచ్చి సామాను వాళ్ళ వూరు తీసుకుపోయి అట్టిపెడతాడనీ చెప్పాను. ‘మంచిపని చేస్తున్నావు. అద్దె దండగలేకుండా!’ అన్నాడు. నాకు యిప్పటివరకు ఆ విషయమే గుర్తులేదు” అన్నాడు రామకృష్ణ.

శ్రీనివాస్ మస్తిష్కంలో మెరుపులు మెరిశాయి. రాఘవరావు స్వంతవూరు తుని. సామాన్లు తీసుకుపోయింది కూడా తునే! అంటే, రాఘవరావే యీ దోపిడీ చేయించి వుండాలి!

“మిష్టర్ రామకృష్ణ! కేసుకి తుదిరూపం రాబోతోంది. ప్లీజ్ ఫాలోమి! దారిలో కోదండరామయ్యగార్ని కూడా కలుపుకుని వెళ్దాం. మీకు తునిలోని రాఘవరావు వాళ్ళ

యిల్లు తెలుసా?" సీట్లోంచి చువ్వలా లేచాడు శ్రీనివాస్.

"ఇల్లు నే చూళ్ళేదుగాని, ఫలానా వీధి అని తెలుసు. ఓ సారి అతని సెలవు దర్యాప్తులో 'లీవ్ అడ్రసు' చూశాను. గుర్తుంది" అన్నాడు రామకృష్ణ.

"వెల్! పదండి పోదాం."

అప్పటి కప్పుడే మళ్ళీ జీప్ సిద్ధం చేశాడు శ్రీనివాస్. భానుగుడివద్ద కోదండరామయ్యని కూడా జీప్ ఎక్కించాడు-'భాస్కర్' అనబడే వ్యక్తిని గుర్తుపట్టడానికి! బహుశా పేరుకూడా మారుపేరు చెప్పివుంటాడు—భాస్కర్ అని!

5

సరిగ్గా గంటా నలభై నిమిషాల్లో తుని చేరుకుంది జీప్.

రామకృష్ణ చెప్పిన అడ్రసు ప్రకారం ఆ వీధికి పోనిచ్చాడు జీప్. త్వరలోనే అడ్రసు తెలిసింది.

ఇంటి ముందు జీప్ ఆగడం చూసి బయటికి తొంగి చూశాడు ఓ యిరవయ్యేళ్ళ యువకుడు. రేడియోలో నుండి కాబోలు పాటలు వినిపిస్తున్నాయి లోపల్నుండి.

శ్రీనివాస్ చటుక్కున జీప్ దిగాడు. వెనకనే రామకృష్ణ, కోదండరామయ్య దిగారు. శ్రీనివాస్ సాభిప్రాయంగా కోదండరామయ్యవంక చూశాడు ఆ యువకుడ్ని చూడమని. కోదండరామయ్య తల అడ్డంగా తిప్పాడు—అతను కాదని.

చొరవగా లోపలికి వచ్చేస్తున్న పోలీసుల్ని చూసి ఆ యువకుడు, "ఎవరు కావాలి సార్?" అన్నాడు.

"రాఘవరావుగారిల్లు యిదేనా?" అడిగాడు శ్రీనివాస్.

"ఏ రాఘవరావుగారు?"

"అదే కాకినాడ యి.ఆర్.వో. ఆఫీసులో పని చేస్తున్న కె. రాఘవరావు!"

"అవునండి, యిదేగాని ఆయన కాకినాడలోనేవున్నారు."

"అదేలెండి. కొంత ఇన్ఫర్మేషన్ కావాలి" అతనితో మాట్లాడుతూనే శ్రీనివాస్ లోపల అంతా ఎక్సరే కళ్ళతో పరీక్షిస్తున్నాడు. రామకృష్ణ సరేసరి! కాని ఎక్కడా అతనికి అనుమానించదగ్గ వస్తువు కంట పడలేదు.

"ఓ సారి లోపలిగదులు చెక్ చెయ్యాలి" అధికారికంగా అన్నాడు శ్రీనివాస్.

"మీరు అనవసరంగా శ్రమపడ్తున్నారు. ఇది నేరస్థు లుండే యిల్లుకాదు. మీ ప్రయత్నం వ్యర్థమని తెలిశాక ఓ గౌరవమయిన కుటుంబాన్ని అవమానించినందుకు బాధపడు తారు" అన్నాడతను తీవ్రంగా.

శ్రీనివాస్ అతని మాటలు లక్ష్యపెట్టకుండా లోపల గదులని పరిశీలించాడు. ఇద్దరు సార్జెంట్సు అతనికా పనిలో సహాయపడ్డారు. రామకృష్ణ అతన్ని ఫాలో అయ్యాడు.

ఇంట్లో ఖరీదయిన సామాను లేవీ లేవు. చివరికి స్టీలు బీరువాగాని, ఫోల్డింగ్ టేబిల్ వంటసామగ్రిగాని ఏమీలేవు.

"ఇక్కడ దాస్తే అనుమానమొస్తుందని మరెక్క డయినా దాచాడేమో?" గుసగుసగా అన్నాడు రామకృష్ణ.

శ్రీనివాస్ అన్యమనస్కంగా వున్నాడు. ఆ యువకుడు హెచ్చరించిందే నిజమయేటట్టుంది! ఎక్కడా ఏ చిన్న ఆధారము కనిపించలేదు. కోదండరామయ్య ఆ యువకుడు కాదని ముందేచెప్పేశాడు. రామకృష్ణ నడిగితే రాఘవరావుకి ఒక్కడే తమ్ముడని చెప్పాడు. తను పొరపడలేదు కదా!

"ఏం సార్ యిప్పుడేమంటారు?" అన్నాడా యువకుడు. శ్రీనివాస్‌కేమి చెప్పటానికీ పాలుపోలేదు.

"సార్, మనం యిక్కడి కొచ్చినప్పుడు రేడియోలో ఏవో పాటలొస్తున్నాయి కదూ!" రామకృష్ణ గుసగుసగా

అన్నాడు.

"అవును."

"అప్పుడు సమయం తొమ్మిదీ అయిదు నిమిషా లయింది. రాత్రి తొమ్మిది గంటలకి ఏ స్టేషనూ తెలుగు పాటలు ప్రచారం చెయ్యదు—యింగ్లీషు వార్తలు తప్ప!"

"అయితే?"

"అది టేప్‌రికార్డరు పాటలని నా అనుమానం."

శ్రీనివాస్ మొహంలో మెరుపు మెరిపింది.

"కాని టేప్‌రికార్డరేదీ కనిపించలేదే మనకు?"

"దాన్ని దాయటం పెద్దకష్టం కాదు. ఇల్లంతా సెర్చ్ చేద్దాం. దొరక్కపోదు. నా టేప్‌రికార్డరుకి 'ప్లే' నాబ్ పైనున్న స్టీల్‌ప్లేటు వూడిపోయింది. తక్కిన నాబ్స్‌కి మామూలుగా వుంటాయి ప్లేట్సు. వెతుకుదాం పదండి!" అన్నాడు రామకృష్ణ.

శ్రీనివాస్ ఆ యువకుడ్ని చూచి, "ఇందాకా మీ ఇంట్లో నుంచి పాటలు రావటం విన్నాం?" అన్నాడు అర్థ యుక్తంగా.

"అదా? అదిగో. మా రేడియోలో నుంచే వచ్చాయి. ఇదిగో మా రేడియో" చూపించాడు అతను.

'దొరికిపోయావు' అనుకున్నారు శ్రీనివాస్, రామకృష్ణ.

శ్రీనివాస్ కళ్ళు మంచం పరుపువైపు పరుగెట్టాయి. అక్కడ ఎత్తుగా కనిపిస్తోంది. ఒక్క అంగలో పరుగెత్తి పరుపు ఎత్తాడు. పరుపుకింద టేప్‌రికార్డరుంది. 'ప్లే'నాబ్ దగ్గిర స్టీల్‌ప్లేట్ నిజంగానే లేదు.

"మిస్టర్ యు ఆర్ అండర్ అరెస్టు! మమ్మల్ని తప్పు దోవన నడిపించాలనుకున్నావు. రామకృష్ణ అనబడే ఈయన యిల్లు దోపిడీలో నీకూ భాగముంది. అసలు దొంగ ఎవరో

నువ్వే చెపుతావు" అన్నాడు శ్రీనివాస్. ఆ యువకుడు స్థాణువులా నిల్చుండిపోయాడు.

సార్జెంటు పేడీలు పైకి తీశాడు.

"నాకేం తెలీదు నన్నొదిలెయ్యండి. నిజం చెప్పేస్తాను. మా అన్నయ్య పక్కవీధిలో వుంటున్న మా మేనమామ కొడుకు సుధాకర్ కలసిచేశారు ఈ దోపిడీ. నాకు టేప్ రికార్డరంటే చచ్చేంత యిష్టం! అన్నయ్య నడిగి ఈ టేప్ రికార్డర్ నేనే తెచ్చుకున్నాను. అప్పుడే చాలా సామాను చేతులు మారిపోయింది. ఇంకా కొన్ని సామాన్లు వాళ్ళ యింట్లోనే అటకమీద దాచేశారు. పోయి చూసుకోండి!" అన్నాడా యువకుడు గబగబ.

"నువ్వూ రా మాతో!" అతణ్ణివెంట లాక్కుని వచ్చి జీప్‌లో పడేశాడు శ్రీనివాస్.

కోదండరామయ్య సుధాకర్‌ని 'భాస్కర్'గా గుర్తు పట్టాడు. రామకృష్ణ తన సామాను గుర్తుపట్టాడు. పెద్ద సామాన్లు ఎక్కడెక్కడికి చేతులు మారినదీ సుధాకర్ చెప్పేశాడు. వాటిని సమీకరించటానికి తగిన ఏర్పాట్లు చేశాడు శ్రీనివాస్ తుని పోలీసు బలగం సాయంతో.

"మిస్టర్ రామకృష్ణా! దీనికంతకూ కారణమయిన మీ కొలీగ్ రాఘవరావుని అరెస్టు చెయ్యాలి. పదండి, కాకినాడ పోదాం! డోంట్ వరీ. మీ సామానంతా జాగ్రత్తగా అప్ప చెపుతాం. కొంత టైం తీసుకుంటుంది" అన్నాడు శ్రీనివాస్ తిరుగుప్రయాణంలో.

"థాంక్యూ సార్! చాలా కొద్ది వ్యవధిలోనే దొంగల్ని పట్టుకున్నారు" కృతజ్ఞతగా అన్నాడు రామకృష్ణ.

"మీ యిద్దరి సహకారంతో!" అని పూర్తి చేశాడు శ్రీనివాస్-కోదండరామయ్య, రామకృష్ణలవంక చూస్తూ. □

టికెట్ లేని పెద్దమనుషులు

వసుంధర

వాల్తేరులో ట్రయినెక్కారు శాస్త్రి, శర్మ. వారి ప్రయాణం విజయవాడదాకా.

వాళ్ళెక్కిన ట్రయిన్ కొత్తగా వచ్చింది. వాల్తేరు నుంచి విజయవాడ దాకా ఎక్కడా ఆగకుండా పోతుందది.

ప్రయాణ సమయం అయిదు గంటలు. ఆ ట్రయిన్‌కి మొత్తం ఎనిమిది కంపార్టుమెంట్సు. ప్రతి కంపార్టు మెంట్‌కీ ఓ కండక్టరుంటాడు. ఎక్కడా ఆగని ట్రయిన్ కాబట్టి టికెట్ లేకుండా ఎక్కేవాళ్ళకి ఆ ట్రయిన్ గొప్పదే. అయితే అందులో పట్టుబడిన వాళ్ళకి ఏడాది ఖైదు వుంటుంది.

ట్రయిన్ కదిలి వేగం పుంజుకుంది. శర్మ సామాన్లుంచు కునే బెర్త్ ఎక్కి పడుకుని పుస్తకం చదువుకుంటున్నాడు. శాస్త్రి కాసేపు ట్రయిన్లో వున్నవాళ్ళనీ, కాసేపు ప్రకృతి సౌందర్యాన్నీ చూస్తున్నాడు. అదృష్టమో, దురదృష్టమో అతడికి దగ్గర్లో అందమైన ఆడపిల్లలు లేరు.

ట్రయిన్లోకి చూస్తున్నపుడు శాస్త్రికి దూరంగా ఉన్నా తమవైపే చూస్తూ వస్తున్న కండక్టర్ కనబడ్డాడు.

"డోయ్ డోయ్ డోయ్ డోయ్ వస్తున్నాడోయ్...." అంటూ పాడాడు శాస్త్రి.

ఆ పాట వింటూనే శర్మ బెర్తు దిగి ఏదో పనివున్న వాడిలా చటుక్కున్న చకచకా లెట్రిన్ వైపు దూసుకు పోయాడు.

కండక్టర్ సమీపించి టికెట్సు అడిగాడు.

"వస్తూనే నన్నడుగుతా రేమిటి సార్ - ఇంతమందిలో నే నొక్కడినే కనబడ్డానా?" అన్నాడు శాస్త్రి. అతడి వేషం డాబుగా ఉండడంవల్ల అతడి జోక్‌కు అక్కడున్నవారంతా నవ్వారు.

కండక్టరుకి మాత్రం ఆ జోక్ నచ్చలేదు. "నా యిష్టం వచ్చిన వారిని నే నడుగుతాను. టికెట్ చూపించండి" అన్నాడు కోపంగా. శాస్త్రి జోక్ వేయకపోతే అతడి కంత కోపం వచ్చి ఉండేది కాదు.

"లేదు సార్!" అన్నాడు శాస్త్రి.

"టికెట్ లేకుండా ట్రయినెక్కావా?" అన్నాడు టికెట్ కండక్టర్.

"ఏమిటి సార్ వింతగా అడుగుతారు. టికెట్ లేకుండా ఇన్ని సార్లు రైలెక్కాను" అంటూ జుట్టు చూపించి "కానీ ఎవ్వరూ నన్ను మీరులా అడగలేదు. అయినా మీ కీ ఉద్యోగం కొత్తాండీ" అన్నాడు శాస్త్రి.

కండక్టర్ కి ఉద్యోగం నిజంగా కొత్త ఏమో - అతను కాస్త తడబడ్డాడు. "కొత్తో పాతో మీ కెందుకు? టికెట్లయినా చూపించండి. లేదా ఫైన్ కట్టండి."

"ఫైన్ కట్టడ మెందుకూ?" అన్నాడు శాస్త్రి.

"టికెట్ దగ్గర లేకుండా ప్రయాణం చేయడం నేరం" అన్నాడు కండక్టర్.

"ఒక్క చిన్న సందేహం సార్ - మొగుడూ పెళ్లాం ప్రయాణం చేస్తున్నారనుకోండి. ఇద్దరూ చెరో టికెట్టూ దగ్గిరుంచుకుంటారా - లేక రెండూ ఎవరో ఒకరి దగ్గిర ఉంటాయా?" అన్నాడు శాస్త్రి.

"ఒకరి దగ్గరే వుంటాయి" అన్నాడు కండక్టర్ సీరియస్‌గా.

"మరి రెండోవాళ్ళ దగ్గర టికెట్ లేనట్లేగా - అది నేరమేనా?" అన్నాడు శాస్త్రి.

"ఏడిసినట్లుంది. టికెట్ కొనడం ముఖ్యం. దగ్గరుంచుకోవడం ముఖ్యం కాదు."

"చూశారా సార్ - మరి నేనూ టికెట్ కొన్నాను. కానీ దగ్గరుంచుకోలేదు" అన్నాడు శాస్త్రి.

చుట్టూ వున్న వారి కిది వినోదంగా ఉంది. శాస్త్రి మాటలు వింటూనే అంతా గొల్లుమన్నారు.

కండక్టర్ కోపం తారస్థాయి చేరుకుంది. "టికెట్ కొన్నట్లు సాక్ష్యం కావాలి" అన్నాడు.

"సాక్ష్యాని కేముంది సార్! కోర్టుకి పాతిక మందిని తీసుకొస్తాను" అన్నాడు శాస్త్రి. మళ్ళీ అంతా నవ్వారు.

"ఆ సాక్షుల కిచ్చే డబ్బులో పదో వంతిస్తే వాల్తేరు నించి విజయవాడకు నాలుగు టికెట్లు కొనచ్చు."

"భలేవారే సార్. ఇలా అని మీరు నన్నూ నా స్నేహితుల్నీ కూడా అవమానిస్తున్నారు. మీ మాటల అర్థం నేను టికెట్ కొనలేదని. నా స్నేహితులు సాక్ష్యానికి డబ్బుచ్చుకుంటారని........"

"ఆపవయ్యా నీ రొద. నువ్వు టికెట్ కొంటే సరిపోదు. నాకు చూపించాలి" అన్నాడు కండక్టర్.

"బాగుందండీ. మీరు పెళ్ళి చేసుకున్నానంటే సరిపోదూ, అది నా ముందు ఋజువు చెయ్యాలి అన్నట్లుంది. అలా అంటే ఏం జరుగుతుందో మీకు తెలుసా?" అన్నాడు శాస్త్రి.

"ముందు టికెట్ చూపించు" అన్నాడు కండక్టర్.

శాస్త్రి పక్కనున్నవాడికేసి తిరిగి, "సార్, నేనే టికెట్ చూపించాలని పట్టుబడుతున్నా డీయన. ఓసారి మీ టికెట్టివ్వండి, ఆయనకు చూపించి మళ్ళీ యిచ్చేస్తాను" అన్నాడు.

"వేళాకోళంగా వుందా?" అన్నాడు కండక్టర్.

"మీతో నాకు వేళాకోళాలేమిటి సార్! మీ ముఖం చూస్తేనే జోకులు చచ్చిపోతాయి."

"టికెట్ ప్లీజ్!" అరిచాడు కండక్టర్.

శాస్త్రి చటుక్కున జేబులోంచి ఓ టికెట్ తీసి కండక్టర్ చేతిలో పెట్టాడు. కండక్టర్ దా న్నందుకుని చూసి "అరే,

యిది ఫ్లాట్‌ఫారం టికెట్" అన్నాడు.

"మీరు టికెట్ కావాలన్నారు, నే నిచ్చాను. అది ఫలానా అని నాకు చెప్పలేదు."

"సరే. అయితే యిప్పుడడుగుతున్నాను. వాల్తేర్ టూ విజయవాడ టికెట్ చూపించు."

"లేదు."

"అయితే డబ్బులు కట్టు."

"టికెట్ కొన్నానని ముందే చెప్పాను. కొన్నాక డబ్బులు కట్టడ మెందుకు?"

"టికెట్స్ ట్రయిన్లో లేవు కాబట్టి."

"లేకేం. నేను కొన్న టికెట్స్ ఈ ట్రయిన్‌లోనే వున్నాయి" అన్నాడు శాస్త్రి.

"అయితే ఏవీ?"

"నా స్నేహితుడిదగ్గ రున్నాయి."

కండక్టర్ ఉలిక్కిపడి, "ఈ ముక్క ముందే చెప్పొచ్చుగా" అని, "ఇంతకీ నీ స్నేహితుడేడీ?" అన్నాడు.

"లెట్రిన్‌కి వెళ్లాడు. అతను కాస్త బ్రహ్మదేవుడు" అన్నాడు శాస్త్రి.

"సరే" అంటూ కండక్టర్ విసుక్కుని, "నీలాంటి బేరం ఒక్కటి తగిలితే చాలు. చెకింగ్ అయినట్లే" అని పక్కవాళ్ళని చెక్ చేయసాగాడు.

వినోదం అప్పుడే ముగిసినందుకు అందరికీ అసంతృప్తిగా వుంది.

కండక్టర్ ఆ ప్రాంతాల్నుంచి బాగా ముందుకి వెళ్ళాక శర్మ తిరిగొచ్చి "వెళ్ళిపోయాడా?" అన్నాడు.

"వెళ్ళాడు. కానీ మళ్ళీ వస్తాడు" అన్నాడు శాస్త్రి.

"బండి చాలా కాళీగా వుంది. కనీసం ఇరవై సీట్లు

మిగిలిపోయాయి" అన్నాడు శర్మ.

"పక్కన కూర్చో కాసేపు కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు శాస్త్రి.

ఇద్దరూ కూర్చుని రైల్లో టికెట్టు లేకుండా ప్రయాణం చేసేవాళ్ళ గురించీ, అందువల్ల ప్రభుత్వానికి కలిగే నష్టం గురించీ సంభాషణ మొదలు పెట్టారు.

శాస్త్రికి ఎదురుగా కూర్చున్నతను కుతూహలంగా, "ఏమండీ, ఇంతకీ మీ దగ్గర నిజంగా టికెట్లున్నాయా, లేవా?" అనడిగాడు.

శాస్త్రి అతడివంక అదోలా చూసి, "మీ రేమీ అనుకో నంటే ఓ మాటంటాను. టికెట్ కలెక్టరుకే ఈ ప్రశ్నకు జవాబివ్వలేదు. నేను మీ కెలా యిస్తాననుకున్నారు?" అన్నాడు.

అంతా నవ్వారు.

ఎదుటి మనిషి కాస్త నొచ్చుకున్నాడు. కానీ ఏమన డానికీ భయపడి ఊరుకున్నాడు.

కాసేపట్లోనే కండక్టరు అక్కడికి వచ్చి శాస్త్రి వంక చూసి "నీ మిత్రుడు వచ్చాడా?" అన్నాడు.

శాస్త్రి శర్మను చూపించి "మీట్ మై డియరెస్ట్ ఫ్రెండ్ శర్మ!" అన్నాడు.

శర్మ చేయి జాపి కండక్టరుతో కరచాలనం చేసి—"కూర్చోండి సార్" అంటూ మర్యాద చేశాడు!

కండక్టరు కూర్చుని—"టికెట్ ప్లీజ్!" అన్నాడు.

"అబ్బ—అదొక్కటి తప్ప యింకేదైనా అడక్కూడదూ!" అన్నాడు శాస్త్రి.

"టికెట్ ప్లీజ్—" అన్నాడు కండక్టర్.

"సరే—తీసోక్కండి—" అంటూ శర్మ జేబులోంచి

ఒక టికెట్ తీసి కండక్టర్ కిచ్చాడు.

"ఒకటే యిస్తున్నారేమిటి?" అన్నాడు కండక్టర్.

"ఒకటి కాకపోతే ఎన్నిస్తారేమిటి?"

"ఇద్దరు మనుషులకు రెండు టికెట్లు—" అన్నాడు కండక్టర్.

"అయితే ఇది కూడా ఉంచండి—" అంటూ ఇంకో టికెట్ ఇచ్చాడు శర్మ.

కండక్టర్ రెండు టికెట్లునీ పరీక్షించాడు—"అదే దీనిలో ఒకటి టికెట్—రెండోది సీటు—"

"బాగుందండీ—టికెట్ కొన్నవాడి కెలాగూ సీటుంది కదా—అందుకని ఒకటి టికెట్టూ ఇంకోటి సీటూ కొన్నాం. టికెట్ కొన్నవాడికి సీటుండదని మీరు చెప్పండి" అన్నాడు శర్మ.

"నేను చెబుతున్నాను—" అన్నాడు కండక్టర్.

"టికెట్ ఖరీదేమో ఇరవైకి పైన. సీటు ఖరీదేమో రూపాయి చిల్లర. టికెట్ కొన్నవాడికి సీటు లేదనడం చాలా అన్యాయం. పోనీలెండి. ఈ దేశంలో ఎన్నో అన్యాయాలు భరించాం. భరిస్తున్నాం.ఇదీ భరిస్తాం—" అని శాస్త్రివంక చూసి "డియర్ ఫ్రెండ్ నీకు టికెట్ కావాలా, సీటుకావాలా" అన్నాడు శర్మ.

"నాకు టికెట్టే కావాలి. సీటు నువ్వే ఉంచుకో. అసలే నీకు వంట్లో బాగోలేదు—" అన్నాడు శాస్త్రి.

"వద్దు డియర్ ఫ్రెండ్. అప్పర్‌బెర్త్‌మీద పడుకోగలవాణ్ణి నేనొక్కణ్ణే. సీటు నువ్వే ఉంచుకుని టికెట్ నా కిచ్చేసేయ్—" అన్నాడు శర్మ.

"నీ యిష్టం. నీ మాట నే నెప్పుడు కాదన్నాను...." అన్నాడు శాస్త్రి.



కండక్టర్ చిరాగ్గా—“ఏమిటి మీరు మాట్లాడేది?” అన్నాడు.

“ఏమీలేదు సార్—సీటు నా స్నేహితుడి కిచ్చేస్తు న్నాను. టికెట్ నాది—నేను ఆ లగేజి బెర్తుమీదకు పోయి పడుకుంటాను—” అన్నాడు శర్మ.

“మిస్టర్! వేళాకోళంగా ఉందా? మీ యిద్దర్లో ఒక్క రికే టిక్కెట్టున్నాయి. రెండోవాళ్ళు డబ్బు కట్టాలి—” అన్నాడు కండక్టర్ కోపంగా.

“ఇద్దరున్నాం. రెండు టికెట్టున్నాయి. ఇరవై పెట్టి టికెట్ కొనుక్కుని కూడా సీటు లేకుండాపోయినా సహిం చాము. రూపాయ్ టికెట్‌కి సీటిచ్చినా సరిపెట్టుకున్నాను. ఇంకా యెందుకు బాధిస్తారు నన్ను!” అన్నాడు శర్మ.

“ఏమిటి—వేళాకోళంగా ఉందా—ఈ ట్రయిన్‌లో టికెట్ లేకపోతే ఏడాది జైలు—” అన్నాడు కండక్టర్.

"జైలంటే నాకేమైనా భయమా——రః కండల్ని నేను జైల్లోనే పెంచాను——" అంటూ శర్మ లేచి నిలబడి కండలు ఉబ్బించాడు. అతడి అవయవ సౌష్టవం చక్కగా ఉంది.

"అయితే నువ్వు జైలు పక్షివన్న మాట——" అన్నాడు కండక్టర్.

"అవును. కానీ నేను మొదటిసారి జైలుకెందుకెళ్లానో తెలుసా? ఒక అపరిచితుడు నన్ను నువ్వని పిలిచాడు. ఆ తర్వాత నాకు వళ్ళు తెలియదు. ఆ తర్వాత కాస్సేపటికి జైల్లో ఉన్నాను——" అన్నాడు శర్మ.

"బెదిరిస్తున్నావా?" అన్నాడు కండక్టర్.

శాస్త్రి కలగజేసుకుని——"ఎందుకు సార్? అనవసరంగా గొడవపెట్టుకుంటారు. నేను నువ్వంటే ఊరుకుంటాను కానీ మావాడు ఊరుకోడు. జైలు వాడికి అలవాటే——మరి దెబ్బలు మీకు అలవాటో కాదో చూస్కోండి——" అన్నాడు.

"అక్కడికి నేనేదో తప్పు చేసినట్లు మాట్లాడుతావేమిటి?" అన్నాడు కండక్టర్.

"నన్నే కాదు. నా స్నేహితుణ్ణి కూడా నువ్వంటే ఊరుకోను. టికెట్ లేదనుకుంటే జైలుకి పంపించు. కానీ నువ్వని మాత్రం అనకు. అందమైన పదహారేళ్ళ ఆడపిల్ల వచ్చి నువ్వన్నా నేను సహించను. నువ్వంటే సహిస్తానా?" అన్నాడు శర్మ.

"మీతో నాకేంటి? మీ దగ్గర టికెట్సు లేవు. అనుభవిస్తారు" అన్నాడు కండక్టర్.

"అనుభవించేదేదో మేమే అనుభవిస్తాం గదా——మీరు వెళ్ళండి సార్——బెజవాడ చేరడం మాకు ముఖ్యం.

అక్కడ సమ్మళ్ళాసడం మీకు సుఖ్యం. మీ ఏర్పాట్లు మీరు చేసుకోండి. మా ఏర్పాట్లు మేం చేసుకుంటాం—" అన్నాడు శాస్త్రి.

"తప్పించుకుపోగలమని అనుకోకండి. బెజవాడలో మీ పని పడతాను. ఇక్కణ్ణించి స్టేషనుకు మాట్లాడే సదుపాయముంది. ట్రయిన్ ఆగగానే ఈ కంపార్ట్‌మెంటును రైల్వేపోలీస్ చుట్టుముడతారు—" అన్నాడు కండక్టర్.

"అమ్మో—ట్రయిన్ అప్పుడే సామర్లకోట దాటుతోంది. మధ్యలో గొలుసు లాగి దిగిపోతే ఏం చేస్తారు?"

"ఈ ట్రయిన్‌కి గొలుసు సదుపాయం లేదు. ఎవరైనా మధ్యలో ట్రయిన్ ఆపాలంటే నాకు చెప్పాలి. నేను డ్రైవర్‌కి సమాచారం అందజేయగలను—" అంటూ నవ్వాడు కండక్టర్.

"అంటే మాలో ఒకరికి ఏడాది జైలు తప్పదన్న మాట—" అన్నాడు శాస్త్రి నీరసంగా.

కండక్టరు వికటంగా నవ్వేసి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

"లాభంలేదు. మధ్యలో రైల్లోంచి దూకేయాలి—" అన్నాడు శర్మ.

"అలా చేస్తే ఏ కాళ్ళో చేతులో విరుగుతాయి. అప్పుడు నెలల తరబడి హాస్పిటల్ బెడ్ మీద ఉండాలి. అంతకంటే ఏడాది జైలే నయం—" అన్నాడు శాస్త్రి.

అతడి పక్కనున్నతను "బాబూ, నాకు తెలియక అడుగుతాను. ఇంత స్పీడుగా వెడుతున్న రైల్లోంచి దూకాడంటే మనిషి చచ్చిపోతాడా, కాలూ చెయ్యీ మాత్రమే విరుగుతుందా?" అనడిగాడు.

శాస్త్రి అతడి వంక క్షణం పరిశీలనగా చూసి, "ఏదీ

మీ చెయ్యోసారిలా పారేయండి'' అన్నాడు. అతని చేతినే కాక కాలు కూడా పరీక్షించాడు. అతడు పంచె ధరించి ఉండడంవల్ల ఇంచు మించు తొడల వరకూ పరీక్షచేశాడు. తర్వాత ఓ క్షణం పెదవి విరిచాడు.

"ఏమిటండీ!'' అన్నాడు ఆ వ్యక్తి ఆత్రుతగా.

"మీరు ఆడపిల్లగా పుట్టవలసింది'' అన్నాడు శాస్త్రి.

"అంత అందంగా ఉన్నానా నేను'' అన్నా డా వ్యక్తి సిగ్గుపడుతూ.

"అడగ్గానే ఇంతలా పరీక్షించనిస్తున్నారని అలా అన్నాను'' అన్నాడు శాస్త్రి.

"అది సరే. నన్నింతకూ ఎందుకు పరీక్ష చేసినట్లు?''

"మనిషి మనిషికీ తేడా లుంటాయి. కొందరి వళ్ళు గట్టిగా వుంటుంది. కొందరి బుద్ధి గట్టిగా ఉంటుంది. నేను రైల్లోంచి దూకాననుకోండి - కాలో చెయ్యో విరుగుతుంది అంతే! మీరు బాత్రూంలో జారిపడ్డా సరే చచ్చిపోతారు'' అన్నాడు శాస్త్రి.

ఎదుటి సీట్లలో కూర్చున్న ముగ్గురూ నవ్వారు. వారిలో మధ్య వ్యక్తి "మీలాంటివాళ్ళుంటే—ఇలాంటి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో గంటలు సెకండ్లలా గడిచిపోతాయి'' అన్నాడు.

"మీమీద జోక్ వేయనంతసేపే మీ రా మాట అంటారు సార్!'' అన్నాడు శాస్త్రి నీరసంగా.

ఎదుటి వ్యక్తి మరి మాట్లాడలేదు. ఆ పక్క వ్యక్తి మాత్రం—"ఇందాకా ఓసారి అడిగి చీవాట్లు తిన్నాను. ఒకే ప్రశ్నకు అస్తమానూ ఒకేలా సమాధానమిచ్చే రకంలా మీరు లేరు. అందుకని మళ్ళీ అడుగుతున్నాను. మీ దగ్గర నిజంగా టికెట్స్ లేవా?'' అన్నాడు.

"అంతా మీరే చూశారు. రామాయణమంతా విని రాముడికి సీతేమౌతుందిట—అనడిగినట్లుంది—మీ ప్రశ్న—" అన్నాడు శాస్త్రి.

ఇంతలో అక్కడికి కండక్టర్ మళ్ళీ వచ్చి—"మీ గురించి స్టేషన్‌కు ఫోన్ చేశాను. అక్కడ మీకు చక్కటి స్వాగతం పలకబడుతుంది—" అన్నాడు.

"ఫైన్ ఎంత కట్టాలి!" అన్నాడు శర్మ.

"అలా దారికి రండి—" అంటూ కండక్టర్ ఏవో లెక్కలు గణించి కొంత మొత్తం చెప్పాడు.

"దానికేముంది సార్—యిచ్చేస్తాం—" అన్నాడు శర్మ.

"శర్మా—నువ్వివ్వొద్దు—నేనిస్తాను—" అన్నాడు శాస్త్రి.

"వద్దు—నేనే యిస్తాను—" అన్నాడు శర్మ.

"సరే—అయితే పోనీ నువ్వే ఇవ్వు. నీ మాట నే నెప్పుడు కాదన్నాను గనుక—" అన్నాడు శాస్త్రి.

శర్మ చొక్కా జేబులో చేయిపెట్టి కొన్ని కాగితాలు బయటకు తీసి-"అన్నీ కాగితాలే—" అని మళ్ళీ జేబులో పెట్టేసుకున్నాడు. రెండో జేబులో చెయ్యిపెట్టి బైటకుతీస్తే టికెట్స్ వచ్చాయి—"సార్—ఇవి మీరు చూచేశారు కదూ, మళ్ళీ చూస్తారా?" అనడిగాడు. కండక్టర్ తన విసుగుదలను మాటల్లో కాక ముఖంలో చూపించాడు. తర్వాత పాంట్‌జేబులు రెండింట్లోనూ చేతులుపెట్టి—"ఏమిటి సార్—జేబులో బొత్తిగా డబ్బు లేదు—" అన్నాడు కండక్టరుతో.

కండక్టరు ముఖం మాడ్చుకుని శర్మవంకే చూస్తున్నాడు.

శర్మ ఉన్నట్లుండి హిప్‌పాకెట్‌లో చేయిపెట్టి—"హిప్ పాకెట్ — హిప్ హిప్ హుర్రే — దొరికింది—" అన్నాడు.

"ఏమిటి?" అన్నాడు శాస్త్రి.

"మనీపర్సు -" అంటూ జేబులోంచి త్వరగా ఓ పర్సు బైటకు తీసి—గబగబా వెతికి—"ఇందులోనూ డబ్బు లేదు. ఇదేమిటి సార్—మనీపర్సుని తీస్తే ఇది ఉత్త పర్సయి ఊరుకుంది—" అన్నాడు శర్మ.

"అయితే మీ దగ్గర డబ్బులు లేవా?" అన్నాడు కండక్టరు.

"మీ అదృష్టం బాగోలేదు. ఇందులో ఒక్క పైసా కూడా లేదు—" అన్నాడు శర్మ.

"మధ్య నా అదృష్టమేమిటి? డబ్బు లేకపోతే జైలు పాలయ్యేది మీరు!" అన్నాడు కండక్టరు.

"అవునవును. ఆ సంగతే మర్చిపోయాను. అవసరం మాది కదూ—" అని—"శాస్త్రీ! ఈ సారికి పోనీ నువ్వే డబ్బిచ్చేయకూడదూ—" అన్నాడు శర్మ.

"నేనే యిస్తాను—" అంటూ శాస్త్రి కండక్టరుతో—"సార్! పెద్ద నోటు తీసుకుంటారా—చిల్లర కూడా అడగను. ఇప్పుడే ఇచ్చేస్తాను—" అన్నాడు స్వరం కాస్త తగ్గించి.

కండక్టరు ముఖం కాస్త విప్పారింది — "పెద్ద నోటంటే?" అన్నాడు.

"వెయ్యి రూపాయల నోటు—" అన్నాడు.

"మీరు కానీ పిచ్చాసుపత్రినుంచి పారిపోయి వస్తున్నారా?" అన్నాడు కండక్టర్.

"ఏమో సార్—ట్రయిన్‌లోకి మీ వెనకే ఎక్కాం"



అన్నాడు శాస్త్రి.

"పాపం—డబ్బు లివ్వకపోతే జైలుకెడతారు—" అని వెళ్ళిపోబోయాడు కండక్టర్.

శాస్త్రి, శర్మ యిద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు. శర్మ గబుక్కున ఓ అడుగు ముందుకువేసి కండక్టరుని ఆపి—"పాపం—అన్నారంటే మీది తప్పక జాలిగుండే అయుండాలి. మాకు జైలుకు వెళ్ళాలని లేదుసార్. ముష్టి పాతికరూపాయలు సంపాదించడమెంతసేపు? ట్రయిన్‌లో తలో రూపాయీ అడుక్కునైనా డబ్బు సంపాదిస్తాను. జాలిగుండెగల మీరే ముందు మాకో రూపాయివ్వండి—" అంటూ చేతులు సాచాడు.

"ఇది చాలా బాగుంది—ఫైన్ అంటే టికెట్ ధర ఇవ్వడం కాదు. డబల్ ఛార్జి కట్టాలి—" అన్నాడు కండక్టర్.

"దానికేముంది సార్—రూపాయకు బదులు రెండ్రూపాయలడుక్కుంటే సరిపోతుంది. ఏమైనా బోణీ మీదే

కదా—రెండ్రూపాయ లివ్వండి—" అన్నాడు శర్మ.

"టికెట్ లేకుండా ప్రయాణం చేస్తూ ట్రైన్ కండక్టర్ని డబ్బులడగడం చూడ్డం నా జీవితంలో యిదే మొదటి సారి—"

"ఎంతమందికో ఎన్నో కొత్త అనుభవాలివ్వడం మా ప్రత్యేకత. ఇంకా మీ అనుభవంలోకి రాని విశేషాలేమైనా ఉంటే చెప్పండి—ఆ లోటు తీరుస్తాం—" అన్నాడు శాస్త్రి.

"మిమ్మల్ని జైలుకు పంపడం—" అన్నాడు కండక్టర్.

"వెయ్యిరూపాయల నోటు ఇస్తానన్నా తీసుకోకపోతే నేనేం చేసేది సార్!" అన్నాడు శాస్త్రి.

"నిజంగా నీ దగ్గర వెయ్యి రూపాయల నోటుందా?" అన్నాడు కండక్టర్ అనుమానంగా.

"డీమోనెటైజ్ చేసిన రోజుల్లో నేనో బ్లాక్‌మార్కెటీరు ఇంట్లో ఇల్లు చక్కబెడుతూండేవాణ్ని. స్వీపరు ఊడ్చేస్తూంటే సరదాగా నాలుగు తీసి దాచుకున్నాను. రెండు నోట్లు—మా పాకెట్ నోట్‌బుక్స్‌కి అట్టగా వేసుకున్నాం. ఓసారిలా రైలు ప్రయాణం చేస్తూ ఓ పాప ఏడుస్తూంటే గుండె కరిగిపోయి-కాగితంబుట్ట చేసిపెట్టాం. ఇంకొక్కటి మిగిలింది. మీ కివ్వాలని ముచ్చట పడుతున్నాను."

"చాలా థాంక్స్. ఆ నోటు ఇలా యివ్వు—" అన్నాడు కండక్టర్.

"నిజంగా తీసుకుంటారా సార్—" అన్నాడు శాస్త్రి.

"ఎస్—"

"మీరు చూస్తే కుర్రాళ్ళలా కనబడుతున్నారు. ఇంకా పాతకాలం వాళ్ళలా ఎస్సంటా రేమిటండీ—య్యాయ్యా—

అనాలి—అలా అంటేనే మీకు నవ్వుతుంది—" అన్నాడు శాస్త్రి.

"నేను ఎస్ అనే అంటాను. ముందా వెయ్యి రూపాయల నోటిలాగివ్వు—"

"మీరు య్యా అంటేనే యిస్తాను—" అన్నాడు శాస్త్రి.

కండక్టరు అదోలా శాస్త్రివంక చూసి—"య్యా—" అన్నాడు.

"అయ్యో శాస్త్రీ—ఎంత పని చేశావు—తల వెనుక నుంచీ చేయి పెట్టి ముక్కు జూపించమని అడగాల్సింది" అన్నాడు శర్మ.

"జరిగిందేదో జరిగిపోయింది—" అన్నాడు శాస్త్రి.

"థౌజండ్ రుపీస్ నోట్ ప్లీజ్!—" అన్నాడు కండక్టర్.

"ఏమిటి సార్—మీరు బొత్తిగా జోకులు రిసీవ్ చేసుకోవడం చేతకాదు. నేను థౌజండ్ రుపీస్‌నోట్ ఇస్తాననగానే జోక్ అర్థం చేసుకుని నవ్వాలి మీరు. మంచి జోకు పాడైపోయింది—" అన్నాడు శాస్త్రి.

కండక్టరు నవ్వుతూ—"బాబ్ హోప్ తెలుసా మీకు?" అనడిగాడు.

"తెలిసినా తెలియకపోయినా మీరు చెప్పదల్చుకుంది చెప్పండి సార్—" అన్నాడు శాస్త్రి.

"నార్త్ వియత్నాంలో అమెరికన్ సైనికుల వినోదం కోసం అతడి నక్కడకు పంపించారు. అతడొక చక్కని హాస్యనటుడే కాక—బయట కూడా అందర్నీ ఆనందింపజేయగలడు—" అన్నాడు కండక్టర్.

"మీరు నిజంగా ఎన్ని విశేషాలు తెలుసు సార్!" అన్నాడు శర్మ.

"ఇలాంటి విశేషాలన్నీ మీ కెక్కడ తెలుస్తాయి సార్!" అన్నాడు శాస్త్రి.

"ఆ సంగతి మరోసారి మాట్లాడుకుందాం—మీరు జైలుకి వెడితే అక్కడి ఖైదీలకు మీ కారణంగా మంచి వినోదం లభిస్తుంది. ఆ విధంగా మీరు మానవసేవ చేసినట్లవుతుంది—" అన్నాడు కండక్టర్.

"అయితే మీరు కూడా అక్కడకు వస్తారా సార్!" అన్నాడు శర్మ.

"మధ్య్య నే నెందుకు?"

"మా మానవసేవకు మీరే ఇన్స్పిరేషన్! మిమ్మల్ని చూడగానే జోకులు వేయాలనిపిస్తుంది. అసలు జైల్లో మిమ్మల్ని వదిలేస్తే—ఖైదీలు కూడా మీ మీద జోకులు వేస్తారని నాకు అనిపిస్తోంది—" అన్నాడు శాస్త్రి.

"అవన్నీ తర్వాత—మీ యిద్దరిలో ఎవరు జైలుకి వెడతాలో తేల్చుకోండి—ట్రయిన్ ఏలూరు సమీపిస్తోంది" అన్నాడు కండక్టరు.

"మేం విడిగా ఉండలేం—కలసే జైలుకి వెడతాం" అన్నాడు శర్మ.

"విడిగా ఉండలేకే—మేం పెళ్ళిళ్ళు కూడా చేసుకోలేదు—" అన్నాడు శాస్త్రి.

"కానీ జైలుశిక్ష మీలో ఒక్కరికే—" అన్నాడు కండక్టర్.

శాస్త్రి, శర్మ ముఖముఖాలు చూసుకున్నారు. శాస్త్రి ఆలోచించి—"ఓ పని చేద్దాం—మన దగ్గరున్న టికెట్ని

ఇంకెవరికైనా దానం చేసి—ఇద్దరం కలిసి జైలుకి పోదాం—" అని—"సార్! ఈ ట్రయిన్‌లో టికెట్ లేకుండా ఇంకెవరైనా ఉంటే చెప్పండి. మా టికెట్ వాళ్ళ కిచ్చేస్తాం—" అన్నాడు.

"ఈ ట్రయిన్‌లో అంతా పెద్ద మనుషులు—మీరు తప్ప! అందరికీ టికెట్లున్నాయి—" అన్నాడు కండక్టర్.

"టికెట్ లేనివాడు పెద్దమనిషి కాదంటారు. అయితే మాలో ఎవడు పెద్దమనిషి అంటారు—"

"అది మీరే తేల్చుకోండి—"

"అన్నట్లు మీ దగ్గర టికెట్ ఉందా?" అనడిగాడు శర్మ.

"కండక్టరుకి టికెట్ అవసరం లేదు—" అన్నాడు కండక్టర్.

"పెద్దమనుషులకి టికెట్ ఉండాలి. కండక్టరుకి టికెట్ ఉండక్కర్లేదు. సార్—మీరూ మేమూ ఒక్కటే—" అన్నాడు శాస్త్రి.

కండక్టర్ అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

ట్రయిన్ సరిగ్గా టైముకి బెజవాడలో ఆగింది. కంపార్ట్‌మెంట్ రెండు తలుపులవద్దా పోలీసులున్నారు. శాస్త్రి ఒక వైపూ, శర్మ ఒకవైపూ వెళ్లారు. కండక్టర్ శాస్త్రితోటే వెళ్ళి—పోలీసుల్ని చూస్తూ—"ఇతనూ—ఇతని మిత్రుడూ ట్రయిన్ పొడుగునా చేసిన అల్లరింతా అంతా కాదు. హి యీజే టికెట్‌లెస్ ట్రావెలర్" అన్నాడు.

"ఒక్క క్షణం ఆగండి సార్! నన్ను టికెట్ అడుగుతున్నారు మీరు. కానీ మీకు నేను టికెట్ లేకుండా బంగారు బిస్కట్లు చూపిస్తాను. నన్ను పట్టుకుంటారా, వాటిని చూస్తారా?" అన్నాడు శాస్త్రి.

పోలీసులు కంపార్ట్‌మెంట్ సెర్చి చేశారు. వాళ్ళకొట్టే శ్రమ లేకుండా శాస్త్రి, శర్మ సాయపడి సరైన చోటుకి తీసుకెళ్లారు. ఓ పెద్దమనిషీ—రెండు సూట్‌కేసుల బంగారమూ దొరికాయి.

అనుకోకుండా ఆ పెద్దమనిషిదగ్గర బంగారాన్ని చూసిన శాస్త్రి, శర్మ పనిగట్టుకుని అతడికి తెలియకుండా వెన్నాడారు. అతడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎక్కడం చూసి తామూ అందులో ఎక్కారు. ట్రయిన్‌లో ఉన్నంతసేపూ అతణ్ని ఏదో సమయంలో కనిపెడుతూనే ఉన్నారు. టికెట్ కలెక్టర్ని రెచ్చగొడితే కానీ అతడు పోలీసుల్ని పిలిపించడు. నిజం చెబితే ట్రయిన్‌లో ఎలాంటి గొడవలు జరుగుతాయో చెప్పడం కష్టం. అందుకని ఎవరికీ అనుమానం రాని విధంగా నాటకమాడారు శాస్త్రి, శర్మ!

"ఈయనవద్ద టికెట్ ఉంది. దొంగబంగారం ఉంది. మరీయన పెద్దమనిషి అవునో కాదో మీరే చెప్పాలి—" అన్నాడు శాస్త్రి కండక్టరుతో.

"ఆయన సంగతెలా ఉన్నా—టికెట్‌లేని పెద్దమనుషులు మీరు—" అన్నాడు కండక్టర్.

"అయ్యో—అలాగనకండి—" అంటూ శాస్త్రి, శర్మ కండక్టర్ చేతిలో రెండు జతల టికెట్లు పెట్టి—"ఇంక పోలీసు డిపార్టుమెంటు మాకేం బహుమతి నిస్తుందో చూడాలి—" అంటూ పోలీసుల వెనకే వెళ్లారు.

తన చేతిలోని రెండు జతల టికెట్ను వంకా ఆశ్చర్యంగా చూస్తున్నాడు కండక్టర్. అవి రెండూ కూడా వాల్తేర్‌నుంచి విజయవాడకు టికెట్టూ, సీటూ—రెండు జతలు! ☐

బ్యాంకు దొంగలు

ఎమ్. సత్యవతీదేవి

తల దువ్వుకుని అద్దం ముందు నుండి కదలబోయాను.

జ్యోతి నా పక్కకు వచ్చి నిలబడింది.

మా ఆవిడను ఏమిటన్నట్టు చూశాను.

"పిల్లలకు స్కూలుఫీజు కట్టలేదు. టీచర్‌గారు రెండో

సారి కబురు పంపారు" అంది జ్యోతి.

"బాంకుకు వెళ్ళివస్తాను కదా, ఎవరినయినా అడిగి తీసుకువస్తానులే!" అన్నాను కదలబోతూ.

జ్యోతి లోపలకు వెళ్ళింది.

నేను రోడ్డుమీదకు వచ్చాను. వాచీ చూసుకున్నాను. ఉదయం తొమ్మిదయింది. రోడ్డుకి అవతలివైపు ఇంటి అరుగుమీద గోపాలం కనిపించాడు. అరుగుమీద కూర్చొండి బ్రష్ చేసుకుంటున్నాడు.

అతడి ప్రక్కగా మా పెద్దపాప నిలబడి కబుర్లు చెబుతోంది. ఆమె కబుర్లకి గోపాలం తలూపుతున్నాడు.

గోపాలం నన్ను చూసి పలకరింపుగా నవ్వాడు.

"ఇంకా మొహం కడుగుతున్నావా?" అడిగాను.

గోపాలం నవ్వుతూ, "అరగంటలో నీకు ఫోన్ చేస్తాను చూడు!" అన్నాడు.

గోపాలానికి మా బ్యాంకు వున్న వీధికి పై వీధిలో బట్టలషాపు వుంది. గోపాలం ఒంటిగాడు. పెళ్ళి కాలేదు. తలిదండ్రులు ఎక్కడో పెల్లెటూళ్ళో వున్నారు. బట్టల షాపుకి మా బాంకు భవనం ప్రక్కగా వెళ్తాడు గోపాలం. అతడికి స్కూటరుంది.

అతడి మాటలకు తలూపి నేను చకచక నడవసాగాను. సిటీ బస్‌స్టాప్‌లోకి అప్పుడే నాకు కావలసిన సిటీబస్సు వచ్చింది. రద్దీతో బాటు బసెక్కి నిలబడ్డాను. బస్సు కదిలింది.

"మాష్టారూ! కాస్త ఈ పుస్తకం పట్టుకుంటారా?"

తల త్రిప్పి చూశాను. అతడికి నా వయసే వుంటుంది. చురుకయిన కళ్లు! గుబురు మీసాలు. గడ్డం మొనదేలి వుంది. ముక్కు చివర పుట్టుమచ్చ. పువ్వుల స్లాక్ వేసు

కున్నాడు. నల్ల పాంటులో టక్ చేశాడు.

అతడు నా వైపు చేయి చాపాడు.

అనాలోచితంగా పుస్తకం అందుకున్నాను. అపరాధ పరిశోధన పాత సంచిక. ఆ పత్రికవి ఎన్నో పాత సంచికలు చదవాలని మిస్ అయిన వాటిలో అదీ ఒకటి!

నా వెనక వున్న రాడ్‌కి ఆనుకుని నిలబడి సంచిక తిరగ వేశాను.

"మీరు బాంకులో పని చేస్తారు కదా, రెండుసార్లు మీ బాంకుకి వచ్చాను."

నేను అలాగా అన్నట్టు తలూపి జోక్స్ చూడసాగాను.

"చదవకపోతే వుంచండి మాష్టారూ! తరువాత కలెక్ట్ చేసుకుంటాను."

"అబ్బే.... బ్బే...." మొహమాటపడ్డాను.

కండక్టరును దొరకబుచ్చుకుని అతడు రెండు టిక్కట్లు కూడా తీశాడు.

"మీ పేరు?" అడగకపోతే మర్యాదగా వుండేలాగా లేదు.

"కేశవరావ్, ఇంజనీరింగ్ చదువుతున్నాను."

"ఎలక్ట్రికలా?"

అతడు తలూపాడు.

నేను దిగవలసిన స్టాపు వచ్చింది. కేశవరావు వద్ద సెలవు పుచ్చుకున్నాను. బస్సు దిగాను. నేనూ నాతోబాటు పుస్తకమూ రద్దీలో నలిగిపోయింది.

ప్రయివేట్ సిటీబస్సులు పోయి ఆర్. టి. సి. సిటీ బస్సులు వచ్చాక మా విశాఖనగర జీవితం దుర్భరమయింది. నేను దిగీదిగకుండానే బస్సు కదిలింది. ఇద్దరు ముగ్గురు ప్రయాణీకులు కాలు నిలదొక్కుకోలేకపోయారు.

ఇక్కడి జీవితంలో ఇది మామూలయిపోయింది.

నేను చకచక బాంకు భవనం సమీపించాను.

వాచ్‌మాన్ ఎప్పటిలాగానే లేడు. నేను అందరికంటె అరగంట ముందే వస్తానని అతడికి నమ్మకం. అవును మరి! ఉద్యోగంలో చేరిన అయిదేళ్ళలోనూ ఇదే అలవాటు నాకు! సెలవు పెడితే తప్ప.

షట్టర్స్ ఎత్తి తాళంచెవులు తీసి తలుపులు తెరిచాను. లోపలకు నడిచాను.

మా బాంకులో రాత్రి బిజినెస్ వుంది. బాంకు ప్రాంతాల వున్న వర్తకుల సౌలభ్యం కోసం మా బాంకు యాజమాన్యం ఈ ఏర్పాటు చేసిపెట్టింది.

ప్రతీరాత్రీ రెండుమూడు లక్షల రూపాయల బిజినెస్‌కి సంబంధించిన అక్కౌంట్లు తణిఖీ చేసుకుంటాను. బాంకును స్థాపించిన శేట్ జీ నాకు ఈ షరతుమీదే ఉద్యోగం ఇచ్చాడు.

నేను నా చేతిలోని పుస్తకాన్ని నా బల్లమీద పెట్టి ముందుకి వచ్చాను. భవనం ముందు భాగంలో ప్రక్కలకు గాజు అద్దాలు బిగించి వున్నాయి. గాజు అద్దాలకు షట్టర్స్‌కీ మధ్య వట్టివేళ్ళ చాపలు వ్రేలాడుతున్నాయి. వాటి తాళ్ళు లాగి చాపలను పైకి ముడిచాను.

వెలుగు అద్దాల మీద పడుతోంది.

రోడ్డు స్పష్టంగా కనిపిస్తోంది. ఎవరి పనిమీద వాళ్ళు రోడ్డుమీద తిరుగుతున్నారు.

దూరం నుండి స్కూటర్ హారన్ వినిపించింది.

ఆ హారన్ నాకు పరిచయమైనదే! గోపాలం స్కూటర్ వస్తోంది. వాచీ చూసుకున్నాను. తొమ్మిదీ ఇరవై. గోపాలం సరిగ్గా తొమ్మిదీ యిరవైకి మా బాంకు భవనం దాటుతూంటాడు.

స్కూటర్ మీద గోపాలం కనిపించాడు. అద్దాలవెనుక నన్ను చూచి మొహానికి చిరునవ్వు పులుముకున్నాడు.

నేను కూడా నవ్వి నా సీట్లోకి వెళ్ళి కూర్చున్నాను.

అకౌంట్లు వున్న రాక్ వైపు చేతులు చాపాను. హుషారుగా లెడ్జర్స్ అందుకున్నాను.

'బాంకు లెడ్జర్స్‌తో ఆడుకుంటే బుల్‌వర్కర్స్ అనవసరం!' అంటుంది జ్యోతి.

నవ్వుకున్నాను. జేబులో చిల్లర పైసలే వున్నప్పటికీ నాకు ఈ రోజు సరదాగా వుంది.

రాత్రి పూట చదువుకోవడానికి అపన పత్రిక వుంది.

కావలసినంత కాలక్షేపం. తృప్తిగా వుంది.

స్లిప్స్ తిరగవేశాను. లెడ్జర్స్‌లో ఎంట్రీలు చూడసాగాను.

టెలిఫోన్ మ్రోగింది.

ఫోన్‌వంక హుషారుగా చూశాను.

వాచీ తొమ్మిదిన్నర చూపుతుంది. తప్పదు. గోపాలం కంప్యూటర్‌లాంటి వాడు.

ముందుకు ఒంగి రిసీవర్ అందుకున్నాను.

2

సిటీ బస్సుస్టాపులో నిలబడ్డాను. జేబు తడుముకున్నాను. సిటీబస్సు టికట్టుకు సరిపడే చిల్లరపైసలు మాత్రం వున్నాయి. పిల్లల జీతాలు కట్టడానికి గోపాలం వద్ద బదులు పుచ్చుకోవలసి వచ్చింది.

ఒక సమస్య తీరింది. హుషారుగా రోడ్డుమీదకు చూశాను. బాంకుకు వెళ్ళాలి.

బస్‌స్టాప్‌లోకి బస్ రాలేదు కాని పాత ఫోర్డ్‌కారు వచ్చి

Please constable go away from hear

ఆగింది. డ్రయివింగ్ సీట్లోంచి మొహం ఒకటి నా వైపు తొంగి చూచింది.

ఆ మొహాన్నెక్కడో చూశాను.

అరె, కేశవరావు!

అతడి మొహం గుర్తుకురాగానే నాలిక్కరుచుకున్నాను.

'అపరాధ పరిశోధన'ను యింట్లో వదలి వచ్చాను. జ్యోతి చదువుతానంది. తాను చదవడానికి ఒక పుష్కర కాలం కావాలి.

"రండి!" అన్నాడు కేశవరావు.

నేను యాంత్రికంగా కారును సమీపించాను.

"బాంకుకేగదా, రండి. డ్రాప్ చేస్తాను!" అన్నాడతడు.

నేను మొహమాటం, ఆరాధనాభావం కలగలిపి ఫోర్డ్ కారును చూశాను. డ్రైవింగ్ సీటు తప్పించి వెనుక సీటుకి కారురంగులో తెరలున్నాయి.

"వూఁ!" అన్నాడతడు అధికారం చనువూ కలగలిపి.

నేను చేసేదిలేక వెనుకడోర్ తెరవబోయాను.

"నా ప్రక్కకి! ఇటురండి!" అన్నాడు కేశవరావు. అతడి చేతివేలు గాలిలో తిరిగి నాకు మార్గం చూపింది.

నేను ఆలస్యం చెయ్యకుండా కారులో కూర్చున్నాను.

ఫోర్డు పాతకాలంనాటి రథంలాగా కదిలింది.

వెనుక సీట్లో ఎవరో వున్నట్టయింది. తల త్రిప్పాను. నిజమే! ఇద్దరు వ్యక్తులు కూర్చున్నారు. వాళ్ళ కళ్ళలో వున్న భావం నన్ను క్షణకాలం వణికించింది.

ఇద్దరివి డేగ చూపులు!

"వారు ఎవ....రు?" నా మాట పూర్తిగాక ముందే నా మెడమీద గట్టివస్తువు గుచ్చుకున్నది. అది గుండ్రటిగొట్టం!

"పాయింట్ త్రీ నాట్ త్రీ రైఫిల్ గొట్టం!" గుసగుస

Please Constable go away The College Girls are Doubtful to Come this Way



లాడాడు కేశవరావు.

"ఎందుకు?" నాకు గొంతులో తడారిపోయింది. క్రైం సాహిత్యపరిజ్ఞానం నన్ను లోపలనుండి తన్నుతోంది.

ఎందుకు? బాంకును దోచుకుంటారా? నన్ను కారుదింపి లోపలకు నడిపించేటప్పుడు వాచ్ మాన్ వుండివుంటే....

నాకు క్షణకాలం హుషారు వచ్చి మాయమయింది.

కేశవరావు అండ్ కో వారు నన్ను కొంతకాలం నుండి గమనిస్తూ వుండివుండాలి. నా అలవాట్లూ, అభిరుచులూ, బాంకు పరిసరాలూ, వాచ్ మాన్ ప్రదర్శించే కొద్దిపాటి నిర్లక్ష్యమూ వాళ్ళకి తెలిసే వుండాలి.

'పట్టపగలు బాంకు దోపిడి!' రేపు పేపర్లో వస్తుందా?

చచ్చాం!

'దుండగుల చేతుల్లో ఉద్యోగి దుర్మరణం!' అని కూడా క్రింద వేస్తారా?

నాకు వెన్నులోంచి చలి పుడుతోంది.

అరిస్తేనో....

"అరవాలనుకుంటున్నావా? కాల్చిపారేస్తాడు సింగ్!" అన్నాడు కేశవరావు.

"నన్ను చంపుతారా?"

తుపాకీ పట్టుకున్న సింగ్ కాబోలు పకపక నవ్వాడు.

"జోస్యం చెప్పమంటావ్‌రా బచ్చా! చెబుతాను విను. మాకు సహకరించకపోతే మాత్రం బతకవ్! చాలునా?"

కళ్ళెత్తి రియర్‌వ్యూ మిర్రర్ వైపు చూశాను.

ఆ మూల కూర్చున్న వాడి భుజాలు కనిపిస్తున్నాయి.

కేశవరావు నవ్వి, "మూడోవాడా! వాడిపేరు అబ్దుల్! అవునా అబ్దుల్!" అన్నాడు.

వెనక సీట్లోంచి నవ్వుల కెరటాలు కారులో మ్రోగాయి.

ఫోర్డుకారు ఆగింది. కారులోంచి చూశాను. బాంకు భవనం ముందు నిర్జనంగా వుంది.

వాచ్‌మాన్ నా కొంప ముంచాడు.

"నువ్వు వాచ్‌మాన్ కోసం ఆశించనక్కరలేదు. వాడు రోజూ తొమ్మిది కాకుండానే యింటికి వెళ్ళిపోతాడు" అన్నాడు కేశవరావు.

"ఒరేయ్ బచ్చా! నువ్వు మామూలుగా వెళ్ళు. షట్టర్స్ ఎత్తి తాళం తెరువు. పిచ్చివేషాలకు పోయావో, కుందేలు పిల్లలాగా ఎగిరిపడతావు. నా గురి తప్పదు. వూఁ! ఎవడికీ అనుమానం రాకూడదు" అన్నాడు సింగ్.

అతడి గొంతులోని కర్కశత్వం అతడి మాటలకు నేపథ్యసంగీతం సమకూరుస్తోంది.

రోడ్డులో తల పెట్టకముందే నేను ఆలోచించి వుండవలసింది.

ఇప్పుడు చేసేదేముంది?

షట్టర్స్ ఎత్తి బాంకు భవనంలోకి మామూలుగా నడిచాను.

నా వెనుకనే కేశవరావూ, అబ్దుల్ వచ్చారు.

సింగ్ బయటికి ఎలా వచ్చాడో, రైఫిల్‌ను యెలా తెచ్చాడో గుమ్మంలోపలకు వచ్చి నిలబడ్డాడు. నాకు రైఫిలును గురిపెట్టి వుంచాడు.

కేశవరావు ఆదేశం ప్రకారంగా సేఫ్ వున్న గది తలుపులు తెరిచాను.

అబ్దుల్ లోపలకు వెళ్ళాడు. మెయిన్ స్విచ్ తీసేశాడు.

పీళ్ళు ఘటికులు! అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు. అలారం మ్రోగకుండా విద్యుత్ సరఫరా త్రెంచేశారు.

షట్టర్స్ ఎత్తిన చోటికి బయలుదేరాను.

నేను పట్టి వ్రేళ్ళచాపల మీద చేతులు వేశాను.

నా గడ్డం క్రింద ఫట్‌మని తగిలింది. తలత్రిప్పి బాధగా చూశాను.

"ఎందుకు ఆ చాపలను ఎత్తి వుంచాలని చూస్తావు? లోపల జరిగే వ్యవహారం రోడ్డుమీదకు కనిపించాలనే కదా?" అరిచాడు కేశవరావు.

నా ఆశలు కూలాయి.

సింగ్ నా వైపు భీకరంగా చూశాడు. తుపాకీ వున్న భుజం మార్చుకున్నాడు.

అబ్దుల్ సేఫ్‌మీద తన ప్రతాపం చూపిస్తున్నాడు.

"సేఫ్ తాళాలు కూడా నీ దగ్గర వుంటే ఎంత బాగుండును!" అన్నాడు కేశవరావు.

"నేనే ఏజంటునయివుంటే వుంచి వుండేవి!"

"పళక్ పళక్!"

అబ్దుల్ గదిలోంచి బయటకు వచ్చాడు.

అతడి మోచేతులూ నుదురూ చెమటబిందువులతో తడిసి

వున్నాయి.

"సక్సెస్!" అన్నాడు అబ్దుల్.

"వెల్‌డన్! సేఫ్టీలాకర్స్ పనిపట్టు. సేఫ్‌లో ఆస్తిని నేను మూటగడతాను" అన్నాడు కేశవరావు.

అబ్దుల్ వెకిలిగా నవ్వి, లోపలిగదుల్లోకి నడిచాడు.

కేశవరావు సింగ్‌కి సైగచేసి సేఫ్ వున్న గదిలోకి నడిచాడు. తలవొంచి సింగ్ రోడ్డుమీద పోయే జనాన్ని చూస్తు చటుక్కున లోపలికి తల త్రిప్పుతున్నాడు.

తెగించగలనా?

సింగ్ ఒక్కడే కదా!

నేను ఒక్కవూపున పరుగెత్తాలనుకున్నాను.

తొమ్మిదిన్నర కొట్టింది బాంకు గడియారం. సింగ్ ఎప్పుడు వచ్చాడో నా ప్రక్కకి వచ్చి నిలబడ్డాడు.

"ఏమిట్రా బచ్చా ఆలోచిస్తున్నావు?" సింగ్ నన్ను డొక్కలో పొడిచాడు. నేను మొజాయిక్ ఫ్లోరింగ్ మీద దబ్బున పడ్డాను. మోచేతులూ మోకాళ్ళూ కంగున మ్రోగాయి.

బాధగా మూలిగాను.

ఉన్నట్టుండి టెలిఫోన్ గణగణలాడింది.

సింగ్ నా మొహంలోకి గాభరాగా చూశాడు.

"లేరా బచ్చా! ఫోన్‌లో మాట్లాడు. సిగ్నల్ యివ్వాలని అనుకున్నావంటే పొడుస్తాను?" రైఫిలు నా డొక్కలో గుచ్చాడు సింగ్.

మూలుగు ఆపి లేచి నిలబడ్డాను. రిసీవర్ అందుకున్నాను.

"ఎవరు?" అన్నాను సింగ్ ఆదేశించినట్లుగా ప్రవర్తిస్తూ.

"ఈజిట్ చమన్‌లాల్ ఫైనాన్షియర్స్!" అవతల నుండి వినిపించింది.

"ఎస్. డిపాజిట్ చేస్తారా?" అన్నాను. నా గొంతు

వణుకుతోంది.

సింగ్ జాగ్రత్తగా వింటున్నాడు.

అవతల ఫోన్ పెట్టేశారు.

రిసీవర్‌ను క్రెడిల్ చేయమన్నట్టు చూశాడు సింగ్.

విసుగ్గా రిసీవర్‌ను క్రెడిల్ మీద పుంచాను.

"ఎవడా పిచ్చివెధవ?" అడిగాడు సింగ్.

నేను కళ్ళెగరేశాను.

ఒక గదిలోంచి అబ్దుల్ సేఫ్టీలాకర్స్‌లోంచి కాగితాలూ, బంగారునగలూ, ఇతర విలువైన వస్తువులూ రెండుచేతులతో పట్టుకొచ్చాడు. కేశవరావు నైలాన్ సంచిని బరువుగా మోసుకుంటూ వచ్చాడు. అబ్దుల్ తన చేతిలోని వస్తువులను అతడి సంచిలోకి జారవిడిచాడు.

పట్టపగలు బాంకి దోపిడి! ఇంతవరకూ విజయవంతమయింది.

"జెల్లర్స్‌లో చూడు అబ్దుల్!" అరిచాడు కేశవరావు.

అబ్దుల్ అటువెళ్ళాడు.

"వీడిని ఏం చేద్దాం?" అడిగాడు కేశవరావు.

"చంపిపారేస్తే?" అన్నాడు సింగ్.

నా గుండెల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు గుద్దుకుంటున్నాయి.

"పోనీ పాపం! స్పృహ తప్పించుదాం!"

"మన గుర్తులు చెబితేనో...."

"చెప్పనివ్వు. మనం దొరికితే కదా, గంటలో ఈ దేశాన్ని విడిచిపెడతాం."

"ఆల్‌రైట్, నీ యిష్టం!" సింగ్ నన్ను సమీపించాడు.

నేను అతడిని భయంగా చూశాను.

చటుక్కున రైఫిల్ తిరగేసి బట్‌తో నా నెత్తిమీద కొట్టాడు సింగ్.

ఫట్ మంది నా తల.

బయట పోలీస్ విజిల్స్ వినిపించాయి.

అంతే! నాకు స్పృహతప్పింది.

3

పేపర్ కుర్రాడు ఆంగ్ల దినపత్రికను నా బంగళాలోకి విసిరాడు. పేపర్ తీసుకొని వెళ్ళి పడక కుర్చీలో కూర్చున్నాను. పేపర్ విప్పి చూశాను.

మొదటి పేజీలో క్రింది భాగం మూలంలో బాన్ వాయేజ్ అని వుంది. ఎవరిదో ఫోటో ముద్రించారు అక్కడ.

ఫోటోని చూచి పులిక్కిపడ్డాను.

కేశవరావు. ఏడాది క్రితం మా బ్యాంకు దోపిడీలో జైలుకి వెళ్ళేటప్పుడు ఎలా వున్నాడో అలాగే వున్నాడు. అతడు అమెరికాకి పయనమై వెళ్ళే శుభ సందర్భంలో అతడి అభిమానులు (పగటి దొంగలు) ప్రచురించిన ప్రకటన అది!

జైలులో శిక్ష పూర్తి అయివుంటుంది. తాను ఎక్కడెక్కడో దోచుకున్న సొమ్ముతో ఫారిన్ వెళ్ళిపోతున్నాడన్న మాట. నల్ల డబ్బు ఈ పుణ్యభూమిలో తెల్లబడిపోయి వుండాలి. ఎన్ని బాంకులు కొల్లగొట్టాడో!

ప్రకటన వేయించినవారి చిరునామా చూశాను.

ప్లిమత్ కారెక్కి వెతుక్కుంటూ వెళ్ళకుండా ఉండలేకపోయాను. ఆ చిరునామాకి సంబంధించి చిన్న తాటాకుల యిల్లు వుంది. చుట్టూ కంచె వేసి వుంది. కంచెకు చెక్కగేటు వుంది. చీకటి పడుతోంది.

గేటు తెరచుకొని ఇంటిని సమీపించాను.

ఇంటిముందు మొక్కలున్నాయి. మొక్కలలో అలికిడయింది. నేను తేరుకునేలోగానే కేశవరావు నాకు పిస్తోలు

గురిపెట్టి బయటికి వచ్చాడు. అంతసేపూ అతడు మొక్కల చాటున దాగివుండాలి.

"వెల్! మరల బోనులో పడ్డావు!" వికటంగా నవ్వాడు అతడు.

తాటాకు యింటిచుట్టూ నిర్మానుష్యం. కటిక చీకటి!

ఎక్కడో తీతువు కూస్తోంది. తాటాకు యింట్లో దీపం వెలిగించారెవరో. నా బుద్ధితక్కువను నిందించుకోనకుండా వుండలేకపోయాను. శేట్ చమన్‌లాల్ తన బాంకిని కాపాడినందుకు నన్ను బాంక్ ఏజంటును చేసి ఏడాది కూడా పూర్తికాలేదు. నాకు చావు ముంచుకొచ్చింది.

"సింగ్!" పిలిచాడు కేశవరావు.

తాటాకు యింట్లోంచి సింగ్ బయటికి వచ్చాడు. నా వెనుక నిలబడ్డాడు.

"చెప్పు మైడియర్ ఏజంట్! ఆ రోజు పోలీసులు ఎలా రాగలిగారు?" కేశవరావు అరుస్తున్నాడు. అబ్దుల్ ఇంట్లోంచి వెలుపలికి వచ్చాడు.

"మా స్నేహితుడు రోజూ తొమ్మిదియిరవైకి బాంకును చూసుకుంటూ వెళ్తాడు. తొమ్మిదియిరవైకి వట్టివేళ్ళ చాపలు ఎత్తి పెట్టి వుంచకపోతే ప్రమాదాన్ని శంకిస్తాడు. చమన్‌లాల్ తన బాంకి భద్రతకోసం ఈ ఏర్పాటు చేశాడు. తొమ్మిదీ ముప్ఫయికి ఫోన్ చేస్తాడు. నా క్షేమం అడుగుతాడు. ఆ రోజు నేను వట్టివేళ్ళ చాపలు ఎత్తబోతే నన్ను నువ్వే గడ్డం క్రింద కొట్టావు. నేను ఆ ప్రయత్నం మానుకున్నాను. నా స్నేహితుడికి అనుమానం వచ్చింది. మామూలుగా తొమ్మిదిన్నరకి నాకు రింగ్ చేశాడు.

"ఈజిట్ చమన్‌లాల్ ఫైనాన్షియర్స్!" అంటాడతను.

"యస్. డిపాజిట్ చేస్తారా?" అంటాను నేను,

ప్రమాదకరమైన పరిస్థితిలో వుంటే.

లేకపోతే "యస్. మే ఐ హెల్ప్ యూ?" అంటాను.

డిపాజిట్ లో వున్న 'డి' అక్షరం డేంజర్ కి చిహ్నం! అంతే అతడు నా ఫోన్ కాల్ కి స్పందించి పోలీసులకు తెలిపాడు" అన్నాను.

సింగ్ నుదురు కొట్టుకున్నాడు.

కేశవరావు చటుక్కున నన్ను సమీపించాడు.

పిస్తోలు నా కణతకు గురిపెట్టాడు.

"బాంకిలో నీకు ఎదురులేదు. ఐదులక్షల రూపాయలకు చెక్కు యివ్వు. ఆ చెక్కు ఆనర్ కాగానే మాకు వైర్ లెస్ లో కబురు వస్తుంది. మా వాడిని బంధించే ప్రయత్నం చేస్తే నిన్ను నరికి ముక్కలు కొడతాం. ఓ. కే." అన్నాడు కేశవరావు నా పాంటు జేబులోకి రెండో చేతినిపోనిచ్చి.

నా చెక్ బుక్ బయటికి వచ్చింది.

"గుడ్, చూశావా? ఈ మధ్యకాలంలో నీ మారిన అలవాట్లు నాకు తెలిశాయి. డైలీ పేపర్ లో ప్రకటన చూచి పరుగెత్తుకు వస్తావని వూహించాను. అదీ నిజమయింది. నువ్వు నాకు ఐదు లక్షలూ వూరకనే యివ్వబోవడంలేదు. తెలుసా?"

నేను అయోమయంగా చూశాను.

"మా ముగ్గురినీ పట్టుకున్నందుకే నీకు బహుమతిగా ఏజెంటు హోదా కల్పించాడు శేట్. ఈ ఐదులక్షలూ నీ కృతజ్ఞతకి చిహ్నం!"

నేను అవాక్కయ్యాను. ఆ మాట నిజమే!

చెక్కుమీద 'ఐదులక్షలు' అంకెవేసి పే బేరర్ అనే చోట 'రూపీస్ ఫైవ్ లాక్స్' అని ఇంగ్లీషులో రాసి నా సంతకం చేశాను.

జీపులో చెక్కు తీసుకుని సింగ్ వెళ్ళిపోయాడు.

అబ్దుల్ యింట్లోకి వెళ్ళాడు.

నేనూ కేశవరావూ ప్లిమత్‌లో కూర్చున్నాం.

కేశవరావు ఒడిలో వైర్‌లెస్ సెట్ వుంది.

అరగంట నడిచింది.

వైర్‌లెస్ సెట్లోంచి బీప్ బీప్ మంటూ శబ్దం వస్తోంది.

కేశవరావు దాని స్విచ్ ఆన్‌చేసి, "ఎస్. ఆనర్‌డా?" అన్నాడు.

"అవును సార్! క్యాష్‌తో బయలుదేరబోతున్నాను. లెక్క పెడుతున్నారు మేనేజర్" అంటున్నాడు సింగ్.

"వెరీ గుడ్!" ఆఫ్ చేశాడు కేశవరావు.

పావు గంటలో జీపు హెడ్‌లైట్స్ కనిపించాయి.

కేశవరావు కారు దిగాడు.

ప్లిమత్‌ను కదపలేదు నేను. డోర్ బలంగా లాగి తాళం వేశాను. విండ్ స్క్రీన్స్ ఎత్తి వుంచాను. నిజాని కవి స్క్రీన్స్ కావు. స్టీలు తెరలు!

చుట్టూ పోలీస్ విజిల్స్ వినిపించాయి.

పోలీసులు మమ్మల్ని చుట్టుముట్టారు.

అబ్దుల్, కేశవరావు, సింగ్ పట్టుబడ్డారు. కారు దిగాను.

కేశవరావు చేతికి సంకెలతో లంకె వేసివున్న సింగ్‌ను నా వద్దకు తీసుకువచ్చాడు.

అతడి కళ్లు నన్ను ప్రశ్నార్థకంగా చూశాయి.

"ఫైవ్‌లాక్స్ అనే రాశాను చెక్కుమీద. 'ఓన్లీ' రాయకపోవడమే సిగ్నల్! ఈనాడు మేనేజరుగా వున్న గోపాలమే ఆ రోజు పోలీసులను రప్పించాడు. ఈ రోజు చెక్కును ఆనర్ చేసినట్టే చేసి పోలీసులను పంపాడు" అన్నాను.

కేశవరావు కళ్ళు ఎర్రబడ్డాయి. అబ్దుల్ కుప్పకూలాడు. □

శ్రీ భగవాన్

గంధంలో అగ్నిజ్వాల

"చెప్పండి" అన్నాడు సర్సన్.

రామశర్మ గొంతు సవరించుకున్నాడు. ఆవేశంతో అతని నరనరం పొంగిపోతుంది. అతి కష్టంమీద వుద్రే

కాన్ని అదుపులో పెట్టుకుంటూ మళ్ళా అన్నాడు—"లత ఎక్కడుందో మీరు తెల్సుకోవాలి!"

"ఇప్పటికి మూడుసార్లు అన్నారీ మాట! అసలు విషయం ఏమిటో చెప్పండి."

"చెప్తాను. లతని నేను గాఢంగా ప్రేమించాను. ఆమె లేనిదే బ్రతకలేనని నిర్ధారణ చేసుకున్నాను. ఆమె కూడా అలాగే అన్నది. వచ్చే నెలలో మేమిద్దరం పెళ్ళి చేసుకుందామని అనుకున్నాం. కానీ, యింతలో....ఇంతలో.... ఆ సీమరాలు భూషణంగాడితో లేచిపోయింది. లేచిపోయింది."

"మిష్టర్ శర్మ! మీరలా ఆవేశపడితే మాకు సంగతి తెలియపద్దా? కాసేపు ఆవేశాన్ని తగ్గించుకుని వివరాలన్నీ విపులంగా చెప్పండి."

"నర్సన్‌గారూ! నేను చెప్పే విషయాలన్నీ నా అనుమతి లేకుండా మీరు యెవరికీ చెప్పకూడదు. వినండి.

సంవత్సరం క్రితం లత వుద్యోగం కోసం నా దగ్గరకు వచ్చింది. ఏ కారణాలవల్ల నయితేనేం ఆమెకు నా ఫరంలో వుద్యోగం దొరికింది. నెల రోజుల్లోనే మేమిద్దరం గాఢంగా ప్రేమించుకున్నాం. ఒకరినొదలి ఒకరు వుండలేనంత స్థితికి వచ్చాం. ఆమెకు నా అనే వాళ్లు ఎవ్వరూ లేకపోవటంవల్ల, నాకూ పెద్దవాళ్లు లేకపోవడంవల్ల మా వివాహానికి అభ్యంతరం లేకపోయింది. మేం యిద్దరం సరదాగా,సంతోషంగా తిరుగుతుండేవాళ్ళం.

నెలరోజుల క్రితం నా పినతండ్రి కొడుకు మా జీవితాల్లో ప్రవేశించాడు. వాడికీ యెవ్వరూ లేకపోవటంవల్ల నా యింట్లోనే వుండనిచ్చాను. అదే నేను చేసిన పొరపాటు. వాడు యేం మత్తుమందు జల్లాడో కానీ, వారం తిరక్క

ముందే వాడిని గురించి నా ముందు పొగడసాగింది లత. నేను యింట్లో లేని సమయంలో షికార్లు కూడా ప్రారంభించింది. చివరకు మే మిద్దరం కీచులాడుకునే స్థితికి వచ్చాం.

విషయం చెయ్యి దాటిపోయిందని నాకు గట్టి నమ్మకం కలిగింది. భూషణాన్ని పిలిచి చివాట్లు పెట్టాను. మరో రెండు రోజుల్లో నా యింట్లోనుంచి వెళ్ళిపొమ్మన్నాను. వాడు యింట్లోంచి వెళ్ళిపోయాడు—లతని లేవదీసుకుని నర్సన్‌గారూ!

నేనెన్నో కలలు కన్నాను. వాటినన్నిటినీ నాశనం చేసి చెప్పకుండా పారిపోయిందా నీచురాలు. లత శరీరం లాగానే మనస్సుకూడా అందమైనదనీ నిర్మలమైనదనీ భావించాను. అది....అది....అందంలో అగ్నిజ్వాల రేపింది. నా జీవితంలో కల్లోలం లేవదీసింది. అది ఎక్కడున్నా మీరు తెలియపర్చాలి. దాన్ని మంచి మార్గంలో పెట్టగలిగితే పెట్టండి. లేదా దాని జాడ తెలియపర్చండి. ఎంత ఫీజు కోరినా యిచ్చుకుంటాను."

ఆవేశాన్ని అదుపులోకి తెచ్చుకునేందుకు టేబిల్ మీదున్న మంచినీళ్ళ గ్లాసు అందుకుని గడగడా త్రాగేశాడు శర్మ.

"లత ,భూషణాలు ఎప్పట్నించి కనిపించడం లేదు?" ప్రశ్నించాడు నర్సన్.

"మొన్న రాత్రినుంచి. నేను యింటికి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. లత, భూషణాలు కలిసి బయలుదేరి వెళ్ళినట్లు చెప్పాడు నౌఖరు. అంతే! వాళ్ళు మళ్ళీ యింటికి రాలేదు."

"వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుందామనుకుంటున్నారేమో!

లతను వెతకటంవల్ల మీకు ప్రయోజనం ఏమిటి? వాళ్ళు మైనర్లు కాదు! మీ యింట్లో ఏదైనా అపహరిస్తే చెప్పండి. పోలీసు రిపోర్టు యిద్దాం."

"అల్లాకాదు! లత ఎక్కడున్నా మీరు వెతికి పట్టుకోవాలి. పోలీసులకు రిపోర్టు యివ్వదల్చుకుంటే మీ దగ్గరకు రాను. ఇది చట్ట సమ్మతమైనదేనా అని కూడా మీరు ప్రశ్నించకూడదు. మీ బాధ్యత కేవలం లతను వెతకడం వరకే!"

"లతని వెతికి మీకు అప్పగిస్తే ఏం చేస్తారు?"

"ఆ సంగతి మీకు అవసరమా?"

"అవును. ఆ విషయం తెల్సుకోవటం మా ధర్మం. చెప్పండి."

"ఏం చేస్తానా!—దాన్ని కత్తికో కండగా నరికి ముక్కలు చేస్తాను. ఎవ్వరికీ కనబడకుండా తవ్వి పాతేస్తాను. అందంలో ఆవిర్భవించిన అగ్నిజ్వాలల్ని ఆర్పేస్తాను. న్యాయం, ధర్మం, అంటూ సంశయించను. లతను హత్య చేస్తాను! అయినా ఆ తరువాత విషయం మీకు అనవసరం. లతని వెతకండి. మీకు ఎంత ఫీజు కావాలో తీసుకోండి."

"మేం యీ కేసు టేకప్ చేస్తే ఫీజు లక్ష రూపాయలు!"

"ల....క్ష....రూ....పా....య....లా! సరే! అలాగే యిస్తాను. మీరు పరిశోధన ప్రారంభించండి."

"సారీ! ఈ కేసు నేను టేకప్ చెయ్యను" గంభీరంగా అన్నాడు నర్సన్.

"అదేం—మీరు కోరినంత ఫీజు యిస్తానన్నాగా! అందుకు ఒప్పుకుని మాట తప్పుతారా?"

"వెరీ సారీ! మేం యీ కేసు టేకప్ చేస్తే ఎంతవు తుందో చెప్పానుగానీ మీకు మాట యివ్వలేదుగా! ఆపదల్లో వున్నవాళ్ళని కాపాడ్డం కోసం నేను బోర్డు పెట్టాను. నిండు ప్రాణాలు తియ్యాలనుకునే కిరాతకులకి సహాయ పడడానికి కాదు. అలా చెయ్యదల్చుకుంటే నేనే హత్యలు చేసి కోట్లు సంపాదించేవాడిని. మీరు లతకి ఏ హాని కలిగించనని మాట యిచ్చి, వాళ్ళిద్దరూ మనస్ఫూర్తిగా పెళ్ళి చేసుకో డానికి అంగీకరిస్తే, మీ రందుకు వొప్పుకోవాలి. అలా అయితే...."

"నేనేం వెర్రి దద్దమ్మని కాను! వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోవాలనుకున్నప్పుడు వాళ్ళని వెతికించడం నాకేం సంతోషమా? అందుకు యింత డబ్బు ఫీజుగా యిస్తానా?"

"అయితే మీరు మా సహాయం పొందలేరు" నిష్కర్షగా చెప్పాడు నర్సన్.

"అంతేనా?" కోపంగా అడిగాడు రామశర్మ.

"మేం చెప్పిన మాటకు తిరుగుండదు. కానీ, ఒకటి మాత్రం గుర్తుంచుకోండి! ఎప్పుడైనా ఎక్కడయినా లత హత్య చెయ్యబడితే మొదటి అనుమానితులు మీరే! ఆమె ఆత్మశాంతి కోసం మేం పరిశోధించాల్సి వుంటుంది."

"అంటే స్వయంగా కలగజేసుకుంటారా?" తీవ్రంగా అడిగాడు రామశర్మ.

"అవును. మీరు న్యాయసమ్మతంగా ప్రవర్తించినంత వరకూ మేం కలుగచేసుకోం! మీరు అధర్మానికి పూనుకోక పోతే మా సహాయం ఎప్పుడూ వుంటుంది. వెళ్ళిరండి" అన్నాడు నర్సన్.

"మళ్ళీ రావడం జరగదు" రుసరుసలాడుతూ దూకు

డుగా వెళ్ళాడు రామశర్మ.

నర్సన్ చిన్నగా నవ్వుకున్నాడు. రామశర్మ చిన్న వయస్సులోనే వృద్ధిలోకి వచ్చిన వ్యాపారదక్షుడు. తండ్రి యిచ్చిన అయిదారు లక్షల ఆస్తినీ యింతవరకూ స్థిరంగా నిల్పుకొచ్చాడు. ఇప్పుడు కేవలం ఓ స్త్రీ జాడ తెల్సుకో డానికి లక్షరూపాయలు ఖర్చుపెడతా ననడం—ఆమెను హత్యజేస్తా ననడం చూస్తే అతనికి బాగా షాక్ తగిలి వుండాలి. అనుకున్నాడు. రామశర్మతో వో విందులో పరి చయం ఏర్పడింది నర్సన్‌కి.

"కృపాల్! యీ క్షణం నుంచి నువ్వు రామశర్మని నీడలా వెంటాడాలి. అతను గుర్తుపట్టకుండా అనుసరిస్తూ అతని హావభావాలు ఎప్పటికప్పుడు నాకు తెలియపర్చాలి. వీలయితే లత పుట్టుపూర్వోత్తరాలు తెల్సుకో! బయల్దేరు" అన్నాడు నర్సన్.

"ఓ. కె." అంటూ లేచి బయటకు వెళ్ళాడు కృపాల్.

కాస్సేపట్లో మారు వేషంలో బయటకు వెళ్ళిన కృపాల్‌ని చూస్తూ—అతను కనుమరుగైనా అటే చూస్తూ ఏదో ఆలోచించసాగాడు నర్సన్.

2

"యస్! నర్సన్ స్పీకింగ్."

"నేను, సార్! కృపాల్‌ని! రామశర్మ హత్య చెయ్య బడ్డాడు."

"వాట్! ఎక్కడ!"

"అతని యింట్లోనే డ్రాయింగ్ రూమ్‌లో హత్య చెయ్యబడ్డాడు. మీరు వెంటనే బయల్దేరి రండి. వివరాలు యిక్కడ చెబుతాను."

"వెంటనే బయల్దేరుతున్నాను" రిసీవర్ని రెస్టుమీద వుంచి చివాల్న లేచాడు నర్సన్. స్టాండుమీద కోటు అందు కుని పెద్ద పెద్ద అంగలతో బయటకు వెళ్ళాడు. 'గుడ్ లక్'లో కూర్చుని స్టార్టు చేశాడు. కారు తారాజువ్వలా ముందుకు దూసుకుపోయింది.

రాత్రి పదిగంటలు దాటింది. రామశర్మ తన దగ్గరకు వచ్చి యింకా పన్నెండు గంటలు కూడా కాలేదు. ఇంతలో అతను హత్య చెయ్యబడ్డాడా? లతని హత్య చేస్తానని కక్ష పెట్టుకున్న శర్మ తనే హత్య చెయ్యబడ్డాడా? విచిత్రం అను కున్నాడు నర్సన్.

'గుడ్ లక్' పది నిమిషాల తర్వాత రామశర్మ యింటి ముందు ఆగింది. కార్లోంచి పరీక్షగా చూశాడు నర్సన్.

అది రెండంతస్తుల బంగళా! ముందు చిన్న గార్డెన్ వుంది. మెయిన్ గేటు దగ్గరనుంచి బిల్డింగ్ మెట్లదాకా సిమెంటు ఫ్లోరింగ్, గేటుక్కట్టిన బోర్డు కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది—'బివేర్ ఆఫ్ డాగ్స్'

"బివేర్ ఆఫ్ మర్డర్స్" అనుకున్నాడు నర్సన్. అప్ప టికే రెండు పోలీసు జీపులువచ్చి పోర్టికోలో ఆగి వున్నాయి. మెయిన్ గేటు దగ్గర యిద్దరు కానిస్టేబుల్స్ వున్నారు.

ఎక్కడ్నుంచో కృపాల్ పరుగెత్తుకొచ్చాడు. వాళ్ళి ద్దర్నీ చూసిన కానిస్టేబుల్సు సెల్యూట్ చేశారు. కృపాల్ కార్లో కూర్చున్నాడు.

"ఏం జరిగింది?" అడిగాడు నర్సన్.

"మనల్ని కలుసుకున్న తర్వాత రామశర్మ సరాసరి యింటికే వచ్చాడు. తర్వాత ఎక్కడికీ కదలలేదు. హత్య జరగడానికి పది నిముషాలముందు ఓ యువతి లోపలికి వెళ్ళింది. సరిగ్గా పది నిముషాలు తర్వాత ఓ

యువతి కేక, ఎవరో లోపల్నుంచి "ఆఁ! మా అయ్య గార్ని హత్య చేశావా?" అని బిగ్గరగా అరవడం విన్పించింది. మరో రెండు నిమిషాల్లో నౌకరు బయటకు వచ్చి నిల్చుంటే 'ఏమటని?' అడిగాను. రామశర్మని లత హత్య చేసిందని తామ పోలీసురిపోర్టు చేశానని చెప్పాడు. నేను మీకు ఫోన్ చేశాను" చెప్పాడు కృపాల్.

"కేసు ఎవరు టేకప్ చేశారు?" అడిగాడు నర్సన్.

"క్రైంబ్రాంచి యినస్పెక్టర్ శ్రీకృష్ణ."

నర్సన్ తల పంకించాడు. కారు మెయిన్ గేటు దాటి లోపలికి వెళ్ళింది. పోర్టికోలో ఆపుచేసి యిద్దరూ లోపల హాల్లో ప్రవేశించారు.

కుడిచేతివైపు వుంది డ్రాయింగ్‌రూం. ఆ గదిలో ఇనస్పెక్టర్ శ్రీకృష్ణ ఏవో ఆదేశాలు యిస్తున్నాడు. బూట్ల చప్పుడు విని వెనక్కి తిరిగి చూశాడు.

"హల్లో! నర్సన్‌గారూ! నమస్కారం. రండి."

అంటూ ఆహ్వానించాడు శ్రీకృష్ణ.

నర్సన్ నవ్వుతూ గదిలో అడుగుపెట్టాడు. గదిలో దృశ్యం అతన్ని ఆశ్చర్యపరచింది.

"వాట్ ఈజ్ దిస్?" అన్నాడు అనుమానంగా.

"యస్ సార్! రామశర్మని యీవిడ హత్య చేసిందని మాకు ఫోన్ వచ్చింది. మేం బయలుదేరి యిక్కడకు చేరే లోగా యీమె కూడా మరణించింది. బహుశా, ఆత్మ హత్య చేసుకుందేమోనని అనుమానంగా వుంది" చెప్పాడు శ్రీకృష్ణ.

నర్సన్ మౌనంగా తల పంకించాడు. రామశర్మ శవం దగ్గరగా వెళ్ళాడు. అతని శవం సోఫాలో వుంది. రివా ల్వర్‌తో కాల్చడం వల్ల ప్రాణం పోయింది. ఛాతీకి ఎడమ వైపు కాల్చారు. ఎదురుగా గోడకు ఆనించి వున్న గాద్రెజ్ బీరువా దగ్గర్నుంచి సోఫాదాకా రక్తం చుక్కలు చుక్క లుగా కారింది.

రామశర్మ కాళ్ళదగ్గర, నేలమీద పడివుంది లత. ఆమె మెడలోంచి దూసుకుపోయింది గుండు. చేతిలో రివాల్వర్ వుంది. ఆమె మొహంలో ఆశ్చర్యం, భయం తాండ విస్తున్నాయి.

ఇంతలో పోలీసుడాక్టరు వచ్చాడు. శవాన్ని పరీక్షించ సాగాడు.

నర్సన్ గదిలోంచి బయటకు వచ్చాడు. అతని వెనక కృపాల్, ఇనస్పెక్టరు వచ్చారు. హాలు మధ్య నిలబడి బిక్కుబిక్కుమంటున్న నౌకరు నారాయణని చూడగానే నర్సన్ అతని ముందుకు వెళ్ళాడు.

"నారాయణా ఏం జరిగిందో వివరంగా చెప్పు" అన్నాడు నర్సన్.

"అయ్యగారు గదిలో వుండగా లతమ్మగారు వచ్చారండీ. రెండురోజుల క్రితం భూషణంగారితో ఆవిడ బయటకెళ్ళింది. మళ్ళీ ఎందుకొచ్చిందా అనుకుంటుండగా ఆవిడ గదిలోకెళ్ళారు. నేను వాకిట్లో కెళ్ళి నిలబడ్డానండి. కాసేపట్లో అయ్యగార్ని ఢాం మని పిస్తోలుతో కాల్చింది. నేను పరుగెత్తుకెళ్ళి చూసి పోలీసులకి ఫోన్ చేశానండి. ఈ గది తలుపులు మూసి పోలీసుల కోసం ఎదురు చూస్తూండగా ఆమెగారు మళ్ళీ తనను తాను కాల్చుకుందండి. ఇంతలో పోలీసులొచ్చారు. అంతే జరిగిందండి."

"ఉహూఁ! లత యెలాంటిది?"

"అది నాకు ఎట్లా తెలుస్తుందండీ! అయ్యగారూ ఆవిడా పెళ్ళి చేసుకుందామనుకున్నారు. ఇంతలో భూషణంగారితో ఆమె లేచిపోయిందని చెప్పారు అయ్యగారు. ఆవిడ వుండగా అసలు సరిగ్గా యింట్లో వుండేవారు కాదండీ! ఎప్పుడు షికార్లకెళుతుండేవారు" నారాయణ మాటలు పూర్తి కాక ముందే—

"వాట్ ఈజ్ దిస్! వాట్ హాపెన్డ్?" అంటూ లోపలికి వచ్చాడొక వ్యక్తి.

"ఈయన భూషణంగారండీ" చెప్పాడు నారాయణ.

"అవును. నేనే! మీరు డిటెక్టివ్ నర్సన్‌గారు కదూ! మీ ఫోటో చాలా సార్లు చూశాను పేపర్లో! ఏం జరిగింది సార్?" అడిగాడు భూషణం.

"రామశర్మ హత్య చెయ్యబడ్డాడు" అన్నాడు నర్సన్.

"ఆఁ....!! యీజిట్!" ఆశ్చర్యంగా అడిగాడు భూషణం.

"యస్! అతన్ని హత్యచేసి ఆత్మహత్య చేసుకుంది లత."

"వాట్....? నేను నమ్మను."

"మీ నమ్మకాలతో నాకు పనిలేదు మిష్టర్ భూషణం. ఈ రెండురోజులుగా మీ రెక్కడున్నారు?"

"ఈ వూళ్ళోనే! హోటల్ అజంతాలో వున్నాను."

"లత కూడా మీతోనే వున్నదా?"

"లత నాతో ఎందుకుంటుంది?" ఎదురుప్రశ్న వేశాడు.

"మిష్టర్ భూషణం! లతా, మీరు కల్సి యీ ఇంట్లోంచి బయటకు వెళ్ళారని మాకు తెల్సింది."

"లేదు. నేను ఒంటరిగా వెళ్ళాను. నేను ఫ్రీగా లతతో మాట్లాడడం మా వాడు అపార్థం చేసుకున్నాడు. నన్ను యింట్లోంచి బయటకు వెళ్ళమన్నాడు. వెళ్ళిపోయాను."

"మీరు లతని ప్రేమించలేదా?"

"నేనంత మూర్ఖుణ్ని కాను నర్సన్‌గారూ! మా అన్నయ్య నన్ను ఆదరించి నాకు అన్నంపెట్టాడు. అటువంటి వాడికి భాతృ ద్రోహం చేసేంత నీచానికి తలపడలేదు."

"అయితే మీరు ఒంటరిగానే హోటల్లో వున్నారా?"

"అవును, మీరు విచారించి తెలుసుకోవచ్చు."

"మరి యిప్పుడు—యిక్కడికెందుకొచ్చారు?"

"సింపుల్. ఈ రెండు రోజులుగా మా వాడిని ఆవహించిన అనుమానం పిశాచం వొదలగొట్టి నా మీద వేసిన అభాండాన్ని తొలగించుకోవడం ఎలాగా అని ఆలోచించాను. నాకు ఏమీ పాలుపోలేదు. చివరకు మా వాడితో వాడూహించినదంతా నిజం కాదనీ, నేను ఈ ఊరు వదలి వెళ్ళిపోతున్నాననీ చెప్పి వెళ్దామని వచ్చాను."

"మీ రీ రెండు రోజులూ ఏం చేశారు?"

"ఎక్కడికీ వెళ్ళకుండా హోటల్ గదిలోనే కూర్చున్నాను. నేనెంత బాధపడ్డానో భగవంతుడికే తెల్సు. బయటకు ఏ మొహంతో వెళ్ళగలను — ఇంత మచ్చ ఏర్పడ్డాక!"

భూషణం మాటలు విని తల పంకించాడు నర్సన్. కృపాల్‌ని పిలిచి ఏదో చెప్పాడు. కృపాల్ తలవూపి వెళ్ళి పోయాడు.

డాక్టరు గదిలోంచి బయటకు వచ్చాడు. నర్సన్ని, ఇనస్పెక్టర్ని దూరంగా తీసుకువెళ్ళాడు.

"వాట్ డాక్టర్! ఏమిటి విషయం?" అడిగాడు యినస్పెక్టరు.

"ఇద్దరూ ఒకే పిస్తోలు వల్ల మరణించారు. దాదాపు అయిదు నిముషాల తేడాలో మరణించారు. అది నిశ్చయం. అయితే హతురాలు హత్యకుముందు కొన్ని గంటలు తాళ్ళతో బంధించబడింది."

నర్సన్ కళ్ళు పెద్దవి చేశాడు.

"యస్. సార్! అంతేకాదు. ఆమె బలవంతంగా రేప్ చెయ్యబడిందేమోనని అనుమానం. ఎందుకంటే ఆమె ఒంటిమీద రక్కులు, చినిగిన ఆమె దుస్తులు అందుకు నిదర్శనాలు. అయితే పోస్టుమార్టం అయితేనే గాని ఆ విషయం నిర్ధారణ చెయ్యలేను." చెప్పాడు డాక్టర్.

నర్సన్ తలవూపాడు. ముందుకు వచ్చి భూషణాన్ని తీవ్రంగా చూశాడు.

"భూషణంగారు! మీరలా కూర్చోండి. మీ స్టేట్ మెంట్ తీసుకోవాలి. మీరింతకు పూర్వం చెప్పినదంతా వ్రాసి యివ్వండి" అని నారాయణవైపు తిరిగి—

"నారాయణా! నువ్వు యెక్కడ వుంటావు?" అని అడిగాడు.

"ఇంటి వెనకాల అవుట్ హావుస్ వుందండీ. దాన్లో నేనూ, నా భార్య మహాలక్ష్మి వుంటున్నాము."

"నేను చెప్పేంతవరకు నువ్వు ఎక్కడికి వెళ్ళకూడదు.

ఇనస్పెక్టర్! బయటకు వెళ్దాం రండి." అంటూ ముందుకు దారితీశాడు నర్సన్.

ఇద్దరూ బిల్డింగు చుట్టూ తిరిగి వెనక వున్న అవుట్ హావుస్ చేరుకున్నారు. ఇంటికి వందగజాల వెనుక వున్న చిన్న పెంకుటిల్లది. ముందు వసారా వుంది. ఇద్దరూ ఇంట్లో ప్రవేశించారు.

"నీ పేరేకదూ మహాలక్ష్మి!" అడిగాడు నర్సన్. ఎటో దిక్కులు చూస్తున్న ఓ యువతి వెనక్కి తిరిగి "అవునండీ" అంది.

"చూడు మహాలక్ష్మీ! నీ భర్త అంతా చెప్పేశాడు. నువ్వుకూడా దాచకుండా నిజం చెప్పటం మంచిది." అన్నాడు నర్సన్ గంభీరంగా!

"నే నేం చెయ్యలేదండి వారం రోజులనాడు ఆడే నన్ను తన్ని యింట్లోంచి బయటకు పొమ్మన్నాడు. నేను ఆవేశంతో మా వాళ్ళింటికి వెళ్ళిపోయాను. మళ్ళా ఆడి కోపం చల్లబడి వుంటుందని యిందాకే యిక్కడికి వచ్చాను. తీరా వచ్చి చూస్తే...."

"ఏం చూశావు? యింటి యజమానురాలు కన్పించిందా?"

"అవునండీ! పెద్దోళ్ళకి కూడా యిలాంటి పాడుబుద్ధి యింటాయనుకోలేదండి. తాగొచ్చి నన్ను తన్నివుంటాడనుకున్నాను గానీ, ఆ లతమ్మతో తందనాలాడడానికి ఎళ్ళగొట్టాడనుకోలేదు."

నర్సన్ కళ్ళల్లో ఆశ్చర్యం పొడసూపింది. ఆ తర్వాత మరికొన్ని వివరాలు తెల్సుకొని ఆమెను వెంటబెట్టుకుని మళ్ళీ ఆ భవనం ముందుకు వచ్చాడు.

అంతలో కృపాల్ ఎక్కణ్నించో వచ్చాడు.

"భూషణం చెప్పిందంతా నిజమే! అతను హోటలు గదిలోంచి ఈ రెండు రోజులు బయటకు కదలలేదని సాక్ష్యం వుంది" అన్నాడు కృపాల్.

నర్సన్ తల పంకించి కృపాల్‌కి ఏదో చెప్పాడు. కృపాల్ అవుట్ హవుస్ వైపు పరిగెత్తాడు. ఇనస్పెక్టర్ని, మహాలక్ష్మిని బయట హాల్లో వుంచి లోపలికి వెళ్ళాడు నర్సన్.

"నారాయణా! యిప్పటికైనా నిజం చెబుతావా?" గంభీరంగా అడిగాడు నర్సన్.

తల వంచుకుని ఏదో ఆలోచిస్తున్న నారాయణ వులిక్కిపడ్డాడు.

"ఇందాకనే చెప్పాను కదండీ!" అన్నాడు బెరుగ్గా.

"అబద్ధం! నువ్వు నిజం చెప్పలేదు. రామశర్మని, లతనీ నువ్వు హత్యచేశావు" పిడుగుల్లా బయటకొచ్చాయి నర్సన్ నోట్లోనించి.

"అన్యాయం! నేను హత్య చెయ్యలేదు. నాకేం తెలియదు" అరిచాడు నారాయణ.

"బుకాయించి ప్రయోజనంలేదు నారాయణా! నువ్వు దాచిన నిజం బయటపడింది. లతని మీ అయ్యగారింట్లో వున్నప్పటినుంచీ నువ్వు కామిస్తున్నావు. ఆమెను పొందడం ఎలాగో నీకు అర్థంకాలేదు. సహజంగా నీకు కనిపించిన ప్రతిస్త్రీని కామించాలనీ, అనుభవించాలనీ వుంటుంది. ఈ సందర్భంలో భూషణం మొన్న రాత్రి యింట్లోంచి వెళ్ళిపోయాడు.

సమయం కోసం ఎదురుచూస్తున్న నువ్వు లతని బలవంతంగా నీ యింట్లోకి లాకెళ్ళావు. అప్పటికి, నీ భార్యని తన్ని పుట్టింటికి వెళ్ళగొట్టావు. అందువల్ల నీకు అడ్డంకి

లేకపోయింది. రామశర్మతో లత భూషణాలు లేచిపోయా రని చెప్పి యీ రెండురోజులూ ఆమెను బలవంతంగా చెరచి అనుభవించావు. గుడ్డివాడయిన రామశర్మ యీ విషయం తెల్సుకోలేకపోయాడు.

ఈ విషయం ఎప్పటికైనా బయటకు వస్తుందనీ, నువ్వు పట్టుబడతావనీ అనుకున్నావు. ఎలాగైనా డబ్బు దొంగిలించి లతను తీసుకుని ఎక్కడికైనా పారిపోవాలనుకున్నావు. అందుకే తెగించి రాత్రివేళ యింట్లో జొరబడి డబ్బుకోసం వెతుకుతుంటే ఆ చప్పుడుకు రామశర్మ వచ్చాడు. నీ నేరం బయటపడుతుందని అతన్ని కాల్చి చంపావు.

ఇంతలో నీ భార్య కోపంతో లతను కట్టిన తాళ్ళు విప్పింది. లత రామశర్మతో యదార్థం చెప్పాలని పరిగెత్తు కొచ్చి అతని శవాన్ని చూసి ఓ వెర్రికేక వేసింది. నువ్వు ఏం చెయ్యాలో తోచక ఆమెని కూడా గొంతుదగ్గర కాల్చి పిస్తోలు శుభ్రంగా తుడిచి ఆమె చేతిలో వుంచి బయటకు వచ్చి పోలీసులకు ఫోన్ చేశావు-ఏమీ ఎరగనట్లు!

నారాయణా! నీ పాపం పండింది. కనిపించిన ప్రతి ఆడ దాన్ని అనుభవించాలనీ, అందాన్నంతా ఆస్వాదించాలనీ కలలుకన్నావు. 'అందంలో అగ్నిజ్వాల' వర్షిస్తుందని నువ్వు తెల్సుకోలేకపోయావు."

"నర్సన్‌గారూ...."

"నువ్వింక సమర్ధింపులు చెప్పకు. నా అసిస్టెంటుని యీ యింటికి కాపలా వుంచాను. నీచేత వెళ్ళగొట్టబడిన నీ భార్య మహాలక్ష్మి యిక్కడికి వస్తుంటే మొదట లత అనుకున్నాం. కానీ నీ భార్య అని తర్వాత తెల్సుకున్నాం. నీకు స్త్రీలోలత్వం వుందని కూడా చెప్పింది.

అంతేకాదు యీ రెండు రోజులు లతని నీ యింట్లో

తాళ్ళతో కట్టిపడేశావు. తప్పించుకుని నీ రహస్యం బయట పెడుతుందని భయపడ్డావు. నీ భార్య సహజమైన యీర్ష్యా ద్వేషాలతో ఆమె తాళ్ళు విప్పింది. ఆడవాళ్ళలో వున్న అందాన్ని ఆశించాలనుకున్నావ్ కానీ ఆ అందంలో ఎంత ప్రమాదం వుందో తెల్సుకోలేకపోయావు."

నర్సన్ చెపుతుండగా కృపాల్ కొన్ని నోట్లకట్టలతో ఆ గదిలో ప్రవేశించాడు. వాటిని చూస్తూ...."నారాయణా! యీ యింట్లోంచి నువ్వు దొంగిలించిన యీ నోట్లు నీకు మృత్యువును తెచ్చిపెట్టాయి. వాళ్ళిద్దర్ని హత్యచేసి నువ్వు యీ నోట్లు తీసుకెళ్ళావు. అప్పుడే మహాలక్ష్మిని చూశావు. అయితే ఆమె ఎప్పుడు వచ్చిందో నీకు తెలియదు. తర్వాత నెమ్మదిగా తెల్సుకోవచ్చని నోట్లకట్టలు దాచి యిక్కడికి పరుగెత్తుకొచ్చావు. నీ అంతట నువ్వే నీ నేరాన్ని బయటపెట్టుకున్నావు" అని "ఇనస్పెక్టర్" పిలిచాడు నర్సన్. ఇనస్పెక్టరు, మహాలక్ష్మి, లోపలికి వచ్చారు.

"మహాలక్ష్మి స్టేట్ మెంట్ తీసుకున్నాను సార్" చెప్పాడు ఇనస్పెక్టర్ శ్రీకృష్ణ.

"ఇనస్పెక్టర్! లతని రేప్ చేసినందుకూ, యీ ఇంట్లో దొంగతనం చేసినందుకూ, రామశర్మని, లతనీ హత్య చేసినందుకూ నారాయణని అరెస్టుచెయ్యండి. మరో విషయం వాళ్ళిద్దర్నీ కాల్చిన పిస్తోలు రామశర్మది. డబ్బు తీస్తుండగా అది నారాయణ కంటబడింది. ఆ సమయంలో వచ్చిన రామశర్మని తప్పనిసరిగా కాల్చి చంపాడు నారాయణ" అని చెప్పాడు నర్సన్. ఇనస్పెక్టరు నారాయణ చేతులకు సంకెళ్ళు తగిలించాడు. □

(పదహారేళ్ళనాటి 'అపన' కథ)

దొరకని దొంగ

మల్లిక్



విశ్వపతి యింట్లో ఆయన కూతురు పుట్టినరోజు బ్రహ్మాండంగా జరుగుతోంది. ఒక మధ్యతరగతి కుటుంబీకుడు కూతురు పెళ్ళికి ఎంత ఖర్చుపెడ్తాడో, తన కూతురు పుట్టిన రోజుకి అంతకన్నా ఎక్కువే ఖర్చుపెడ్తున్నాడు విశ్వపతి.

అవును మరి.. ఆయనకేం లోటు? ఆయనో పెద్ద పారిశ్రామికవేత్త. సంవత్సరానికి అతని ఆదాయం దాదాపు

రెండుకోట్ల రూపాయలుంటుంది.

పుట్టినరోజుకి నగరంలో పలుకుబడి వున్న కోటీశ్వరులూ, లక్షాధికార్లూ వచ్చారు. ముగ్గురు మినిస్టర్లు కూడా వచ్చారు.

విశ్వపతికి సంతానం ఒక్కతే కూతురు. ఆ అమ్మాయి పేరు లావణ్య....వయసు ఇరవై. ఎమ్మే మొదటి సంవత్సరం చదువుతుంది. పేరుకు తగినట్టు వుంటుంది లావణ్య.

వచ్చిన అతిథులంతా హాల్లో ఎదురుచూస్తుండగా దేవలోకం నుండి దిగివచ్చే గంధర్వకన్యలా తెల్లని జరీచీరతో లావణ్య మెట్లు దిగి హాల్లోకి వచ్చింది. ఆమెను చూస్తూనే జనంలో గుసగుసలు మొదలయ్యాయి.

"ఓహ్....ఏం అందం!...."

"చేసుకునే వాడెవడో అదృష్టవంతుడు. అందానికి అందం, కోట్లకొలదీ ఆస్తికి వారసత్వం—రెండూ దక్కుతాయ్...."

"ఆ అమ్మాయి మెడలోని వజ్రాలహారం చూశావా.... దాని ఖరీదు సులభంగా ఒక లక్ష వుంటుంది...."

"ఒక్కత్తే కూతురు....పైగా తల్లిలేని పిల్ల. అందుచేత, విశ్వపతికి ఆ అమ్మాయంటే ప్రాణం!"

ఇలా అక్కడి జనం తమకి తెలిసిన విషయాలు తగ్గుస్వరంలో మాట్లాడుకుంటున్నారు. లావణ్య కేక్ కట్ చేసింది.

"హాపీ బర్త్ డే టూ యూ...." అని అందరూ కోరస్‌గా అన్నారు.

విశ్వపతి లావణ్యకి అక్కడికి వచ్చిన పెద్దవాళ్ళందర్నీ పరిచయం చేశాడు. తరువాత పార్టీ మొదలయింది.

విశ్వపతి తనకు బాగా ఆప్తులయిన ఒక అయిదుమందికి, మనం విడిగా అందరూ వెళ్ళిన తరువాత, కలిసి భోజనం చేద్దాం, ఉండమని చెప్పాడు.

పార్టీలోని పదార్థాలన్నీ చాల రుచిగా చేయించాడు విశ్వపతి. అందుకే అక్కడికి వచ్చినవాళ్లు బాగా డబ్బు, సంఘంలో మంచి స్టేటస్ ఉన్నవాళ్ళయినా, అనాగరికంగా ఎగబడి ఆబగా తినడం మొదలుబెట్టారు.

పార్టీ అయ్యి జనం అంతా వెళ్ళిపోయేసరికి రాత్రి తొమ్మిదిగంటలు దాటింది.

విశ్వపతి తనకు బాగా ఆప్తులనుకున్న అయిదుమందితో కలిసి భోజనానికి కూర్చున్నాడు.

ఆ అయిదుగురూ ఎవరెవరంటే, మొదటి వ్యక్తి మోతీలాల్. అతనికి విశ్వపతికి ఉన్న ఆస్తికి రెట్టింపు ఆస్థి ఉంది. విశ్వపతి ఈనాడు ఇంతటి ఉన్నత స్థితిలో ఉన్నాడంటే అందుకు కారణం కొంతవరకు మోతీలాలే. ఇరవై సంవత్సరాల క్రితం అతను కొత్తగా వ్యాపారం ప్రారంభించినప్పుడు మోతీలాల్ అతనికి ఆర్థిక సహాయం చాలా చేశాడు.

రెండవ వ్యక్తి లక్ష్మీపతి—విశ్వపతికి కాబోయే వియ్యంకుడు. లక్ష్మీపతి కొడుకు విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నాడు. అతని చదువు పూర్తవగానే ఆ అబ్బాయికి లావణ్య నిచ్చి వివాహం చెయ్యాలని విశ్వపతి ఆలోచన.

మూడో వ్యక్తి విశ్వపతి బాల్యమిత్రుడు నరహరి. ఒరేయ్ అంటే ఒరేయ్ అని పిలుచుకునే స్నేహం వారిది. ఇప్పటికీ 'ఒరేయ్' అనే పిలుచుకుంటారు వాళ్లు. నరహరికి షుగర్ ఫాక్టరీ, టొబాకో కంపెనీలు ఉన్నాయి.

నాలుగో వ్యక్తి విశ్వపతి స్వంత తమ్ముడు గిరిధర్. గిరిధర్‌కి విశ్వపతి చేసే వ్యాపారాల్లో కొన్నింటికి పెట్టుబడిలో భాగం ఉంది.

చివరి వ్యక్తి శ్యామసుందర్. శ్యామసుందర్ ఆవేళ అక్కడ పార్టీకి వచ్చిన అందర్లోకీ బీదవాడు. అతను లావణ్యకి సితార్ నేర్పుతున్నాడు. చాల మంచి వ్యక్తి కూడా.

విశ్వపతికి సంగీత సాహిత్యాలలో ప్రవేశం ఉన్న వాళ్ళంటే చాల యిష్టం. శ్యామసుందర్ హిందుస్తానీ సంగీత విద్వాంసుడు. అతను సితార్ వాయిస్తే, సంగీతం గురించి తెలియని వాళ్ళు కూడా గంటలు తరబడి తన్మయత్వంతో వినాల్సిందే....అంత బాగా వాయిస్తాడు.

అతని శిక్షణలో లావణ్య కూడా మంచి సంగీతకారిణి అవుతుంది. లావణ్యకి ఆయనంటే ఇష్టం, గౌరవం, భక్తి. అందుకనే విశ్వపతికి శ్యామసుందర్ ఆప్తుడయ్యాడు.

లావణ్య కూడా వీరితోబాటు భోజనానికి కూర్చుంది. వారి మధ్యగా టేబులుమీద వంటవాడు కమ్మని వాసనగల రక రకాల రుచికరమైన వంటకాల్ని సర్దుతున్నాడు.

"నీ వేలికున్న ఉంగరం చాల బావుందిరా....కళ్ళు మిరుమిట్లు గొలుపుతున్నాయ్....ఎంతకు కొన్నావ్?...." అని అడిగాడు విశ్వపతి బాల్యమిత్రుడు నరహరి.

"ఇది మా ఆవిడ నాకు పుట్టినరోజు కానుకగా ఇచ్చింది...."

"చాల ఖరీదు కదూ?...."

"అవును....ఇందులో పొదగబడిన వజ్రం ఖరీదు ఇరవై వేలుపైన ఉంటుంది...."

అప్రయత్నంగా "అమ్మో!!...." అన్నాడు శ్యామ

సుందర్ కళ్ళు పెద్దవి చేస్తూ.

అక్కడున్న అయిదుగురు అతిథులకీ ఆ ఉంగరం చాల నచ్చింది.

"ఏదీ ఒకసారి యివ్వరా చూసిస్తాను...." అని అడిగాడు నరహరి. అలా అడిగే చనువు ఒక్క నరహరికే ఉంది.

విశ్వపతి తన వేలికున్న ఉంగరం తీసి నరహరికి ఇచ్చాడు. నరహరి దాన్ని పరిశీలించి చూశాడు. "మార్వలస్....చాల బావుంది....ఉంగరం డిజైన్ కూడా బావుంది .... యిలాంటిది నేను కూడా చేయించుకుంటాను...."

నరహరి చేతిలోంచి శ్యామసుందర్ తీసుకుని చూశాడు. "చాల బావుంది మీ ఉంగరం...."

ఒకళ్ళ చేతిలోంచి మరొకరు తీసుకుని చూస్తున్నారు ఉంగరాన్ని. వంటవాడు పదార్థాలు డైనింగ్ టేబులు మీద సర్దుతూనే ఉన్నాడు.

"అబ్బ....ఈ నెక్లెస్ గుచ్చుకుంటోంది నాన్నా....దీన్ని ఇంక తీసేసి అల్మారాలో పెట్టివస్తాను...." అంది లావణ్య విసుగ్గా ముఖంపెట్టి.

"అలాగే తల్లీ...." అన్నాడు విశ్వపతి లావణ్య తల నిమురుతూ.

లావణ్య లేచి మెట్లపైపు నడిచింది.

ఉంగరం అందరూ చూడటం అయ్యింది.

"అన్నయ్యా....ఉంగరం తీసుకో...." అంటూ విశ్వపతికి ఉంగరం అందించాడు గిరిధర్.

విశ్వపతి ఉంగం అందుకుని వేలికి తొడుక్కుందామని అనుకుంటుండగా "కెవ్వు" మని కేక వినిపించింది.



అందరూ కంగారుగా తల తిప్పి చూశారు. మెట్లమీద కాలు స్లిప్ అయి లావణ్య పడిపోయింది. పేకలు వదిలి ఆ ఆరుగురూ, వంటవాడూ, మరో యిద్దరు పనివాళ్ళూ లావణ్య దగ్గరికి పరుగెత్తారు. విశ్వపతి లావణ్యను లేవనెత్తాడు.

"ఏమైందమ్మా?...."

"నెక్లెసు గదిలో పెట్టి మెట్లు దిగుతుండగా కాలు స్లిప్పయింది నాన్నా...."

"దెబ్బలేమీ తగల్లేదు కదా?...." విశ్వపతి ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది.

"అబ్బే లేదు నాన్నా....పడేముందు చేతికి మెట్ల ఆసరా దొరికింది."

"మరేం పరవాలేదు కదా?"

"పరవాలేదు నాన్నా....చిన్న దెబ్బకూడ తగల్లేదు...."

నవ్వుతూ అంది లావణ్య.

విశ్వపతి తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు.

"పదండి భోజనం చేద్దాం...."

అందరూ టేబులు దగ్గరికి వచ్చి ఎవరి కుర్చీలలో వాళ్ళు కూర్చున్నారు. కానీ విశ్వపతి మాత్రం కూర్చోలేదు. అతని భృకుటి ముడిపడింది. ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు ఉంది అతని ముఖం.

"క్యాహై విశ్వపతి సాబ్....నిలబడి ఉన్నారేం? కూర్చోండి...." అన్నాడు మోతీలాల్.

"ఉ....ఉ...." అన్నాడు పరధ్యానంగా. కానీ కూర్చోలేదు.

"ఏమైంది బావగారూ?...." అని ప్రశ్నించాడు లక్ష్మీపతి.

"నా ఉంగరం....వజ్రపు టుంగరం...." గొణిగాడు విశ్వపతి.

"ఇందాక నీకు యిచ్చేశాగా?...." అన్నాడు గిరిధర్.

"అవుననుకో....లావణ్య గట్టిగా కేక పెట్టగానే ఆ కంగారులో దాన్ని ఈ టేబులు మీద పడేసి లావణ్య దగ్గరికి పరుగెత్తాను....అది యిప్పుడు ఇక్కడ లేదు...." విశ్వపతి మెల్లగా కూర్చుంటూ అన్నాడు.

"ఎక్కడికి పోతుందిరా....యిక్కడే యెక్కడో ఉంటుంది. సరిగ్గా చూడు...." అన్నాడు నరహరి.

టేబులు మీద గిన్నెలవీ అటూ యిటూ జరిపి ఉంగరం కోసం వెతికారు. కానీ ఉంగరం కనబడలేదు.

"ఒకవేళ క్రింద పడిందేమో?...." అన్నాడు శ్యాము సుందర్.

అతను ఈ మాట అనీ అనడంతోనే అందరూ క్రిందికి

వంగి కుర్చీలు జరుపుతూ వెతకడం మొదలుబెట్టారు. ఉంగరం కనబడలేదు. పనివాళ్లు ముఖం నిండా భయం పులుముకుని చూస్తున్నారు, ఈ దొంగతనం వాళ్ళ మీదకు ఎక్కడ వస్తుందోనని.

"ఉంగరం వెతకనవసరం లేదు. అది పోతేగా వెతకడానికి?....ఆ ఉంగరం దొంగిలించబడింది...." అన్నాడు శ్యామసుందర్.

అక్కడివాళ్ళ ముఖాలు నల్లబడ్డాయి. నరహరి ముఖం జేవురించింది.

"ఏమిటి మీరంటున్నది?....ఉంగరం దొంగతనం చేస్తే అది మనలో ఒకరై ఉండాలి...." అన్నాడు నరహరి తీవ్రంగా.

"నో నో మిస్టర్ శ్యామసుందర్....దొంగతనం లాంటి పదాలు ఉపయోగించకండి" అన్నాడు విశ్వపతి మెల్లిగా. అతని ముఖంలో బాధ గూడుకట్టుకుని ఉంది.

"ఆయన ఆ పదం ఉపయోగించినా ఉపయోగించకపోయినా యిప్పుడు జరిగింది అదే...." అన్నది లావణ్య పెదవి విరుస్తూ.

"అంటే మీ నాన్నగారి ఉంగరం మాలో ఒకరు దొంగిలించారనా నీ ఉద్దేశం?" గిరిధర్ కోపంగా అన్నాడు.

"నేను తలుచుకుంటే యిక్కడ ఉన్న ప్రతి ఒక్కరికీ అయిదువేళ్ళకీ అలాంటి ఉంగరాలు కొనిపెట్టి యివ్వగలను...." అన్నాడు మోతీలాల్ ముఖం ముడుచుకుంటూ.

"ప్లీజ్ .... ఫర్‌గెట్ అబౌట్ ఇట్ .... భోజనం కానిద్దాం .... ఒరేయ్ రంగన్నా .... అందరికీ భోజనం వడ్డించు...." అన్నాడు విశ్వపతి.

"నో నో....ఉంగరం విషయం తేలిన తరువాతే భోజనం...." అన్నాడు లక్ష్మీపతి మొండిగా.

"అసలు మనం యిలా వాదులాడుకోవడం ఏమీ బాగో లేదు....పనివాళ్ళలో ఎవరైనా అది తీసి ఉండవచ్చుగా?" అన్నాడు నరహరి.

పనివాళ్ళ పై ప్రాణాలు పైనే పోయాయి.

"లావణ్య కేకపెట్టగానే నేను ఉంగరం టేబులు మీద పడేశాను....అప్పుడు పనివాళ్లు ఇక్కడ లేరు. వాళ్ళు లావణ్య దగ్గర ఉన్నారు. టేబులు మీద పదార్థాలు సర్దుతున్న వంటవాడు మనకంటే ముందు లావణ్యవైపు పరుగెత్తాడు. లావణ్య దగ్గర మనం ఉన్నప్పుడు ఈ టేబులు దగ్గరికి ఎవరూ వచ్చినట్టు లేదు....ముందు మనమే మళ్ళీ యిక్కడికి వచ్చాము...."

"అంటే లావణ్యగారి దగ్గరకు వెళ్ళేటప్పుడు మనలోనే ఎవరో ఆ ఉంగరం తీశామన్న మాట!...." అన్నాడు శ్యామసుందర్.

"శ్యామసుందర్‌గారూ....మీ రిక ఉంగరం ప్రసక్తి ఎత్తవద్దు. ఇరవై వేలు నా కొక లెక్కలోనిది కాదు....నా బాధల్లా అది మా ఆవిడ నాకు యెంతో ప్రేమగా యిచ్చిన ప్రెజంటేషన్. ఆ ఉంగరం అంటే నా కెంతో ప్రాణం.... దాని బదులు అంతకు పదిరెట్లు విలువగల నగలు పోయినా నా కంత బాధ అనిపించి ఉండేది కాదు....అయిపోయిందేదో అయిపోయింది....ఆ విషయం అందరూ మర్చిపోండి...."

"విశ్వపతిగారూ....మీ రొక విషయం మర్చిపోతున్నారు....మోతీలాల్‌గారు మీ అభివృద్ధికి కారకులు, లక్ష్మీపతిగారేమో మీకు కాబోయే వియ్యంకులు, గిరిధర్ మీ

సొంత తమ్ముడు, నరహరి మీకు ఆప్తమిత్రుడు....వీళ్ళంద రికీ మీతో సన్నిహిత సంబంధం ఉంది. అంతే కాకుండా బాగా డబ్బున్నవాళ్లు. ఇక్కడున్నవారిలో డబ్బులేనివాడిని నేను....కాబట్టి నా పొజిషన్ చాల వీక్‌గా ఉంది. నేను ఉంగరం తీసి ఉంటా నన్న అనుమానం అందరికీ ఉండొచ్చు....'' అన్నాడు శ్యామసుందర్.

''నో నో....మిమ్మల్ని అనుమానించేంత నీచుడ్ని కాను శ్యామసుందర్‌గారూ....'' అన్నాడు విశ్వపతి నొచ్చు కుంటూ.

''నామీద మీకున్న నమ్మకానికి చాల థాంక్స్ విశ్వపతి గారూ .... కానీ నా నిర్దోషిత్వాన్ని నిరూపించు కోవాలిగా....''

''మీరు నిర్దోషని నేను నమ్ముతున్నాను....''

''కానీ యిక్కడున్న మిగతావారిక్కూడా ఆ నమ్మకం కలగాలి. అసలు ఉంగరం దొంగలింపబడడానికి ఆర్థిక సమస్య కారణం ఏమీ కాదు....కొందరికి దొంగిలించి ఏదైనా వస్తువును సంపాదించడం అంటే చాల యిష్టం. అలాంటి సరదా వారిలో చిన్నతనంనుండీ నిగూఢంగా ఉండి రానురాను పెరుగుతూ వస్తుంది. దీన్నే చేతివాటం అని చెప్పొచ్చు....

లక్షల ఆస్తి ఉన్నవాడు చిన్న గుండుసూదిని దొంగి లించి తృప్తిపడలేడు. దొంగిలించిన వస్తువు కాదు వారికి తృప్తిని యిచ్చేది. ఆ వస్తువే గనుక వారికి తృప్తిని ఇచ్చేది అయితే వారు దాన్ని కొనుక్కునే తమ స్వంతం చేసుకుంటారు. కానీ వారికి తృప్తిని యిచ్చేది పట్టుబడ కుండా దొంగతనం చెయ్యడం. అదొక రకం సైకాలజీ. అలాంటి సైకాలజీ ఉన్నవాళ్ళు మనలో ఒకరున్నారు....''

చెప్తున్నది ఆపి అందరివంకా చూశాడు శ్యామసుందర్.

విశ్వపతి ఇబ్బందిగా కుర్చీలో కదిలాడు. వాళ్ళందరితో సంబంధ బాంధవ్యాలు యెక్కడ దెబ్బ తింటాయోనని అతని భయం.

"ఆ ఉంగరం ఎవరు తీశారో నాకు తెలుసు...." హఠాత్తుగా అన్నాడు శ్యామసుందర్.

విశ్వపతి కుర్చీలో ఆరు అంగుళాల ఎత్తున ఎగిరి పడ్డాడు....అందరూ టేబులు మీదుగా ముందుకు వంగారు. వాళ్ళలో కలకలం బయలుదేరింది.

"ఎవరండీ మాస్టారూ?...." లావణ్య కుతూహలంగా అడిగింది.

"ఆ తీసినవాళ్ళెవరో సరదాకి నన్ను ఏడిపించడానికి తీసుంటారు...." అన్నాడు విశ్వపతి కంగారుపడుతూ. ఆ ఉంగరం తీసిన మనిషితో తన రిలేషన్ చెడకూడదని అతని తాపత్రయం. వాళ్ళు నలుగురూ తనకి కావలసిన వాళ్ళే.

ఒకసారి అందరి ముఖాలూ చూసి—

"కానీ ఇంతమందిలో ఆ వ్యక్తి పేరు చెప్పి పరువు తియ్యడం నాకు ఇష్టం లేదు...." అన్నాడు శ్యామసుందర్ మెల్లిగా.

"ఏమిటీ నాటకం?...." నరహరి అరిచాడు.

"ప్లీజ్ నరహరిగారూ....ఎక్సైటెట్ అవకుండా నేను చెప్పేది వినండి....పదేళ్ళ క్రితం నేను ఢిల్లీలో కరోల్ బాగ్‌లో ఉండేవాడిని. రోజూ నేను ఉదయం లేచి సితార్ ప్రాక్టీసు చేసేవాడిని. ఒకరోజు ఒక వ్యక్తి మా యింటికి వచ్చి తన పేరు రాబర్ట్ అనీ, ఆ పక్క పోర్షనులో ఉంటున్నాననీ చెప్పి తను రోజూ నా సితార్ వాద్యం

వింటున్నాననీ, తనకు చాల నచ్చుతుందనీ చెప్పాడు.... రాబర్ట్ తనకు సితార్ వాయించడం నేర్పించమని నన్ను కోరాడు. రాబర్ట్ ఒక మంత్రగాడు. అతని మంత్ర విద్య నాకు కాస్త నేర్పుతే నేను అతనికి సితార్ వాయించడం నేర్పుతానని అన్నాను....

"తమ విద్య నిగూఢంగా ఉంచాలనీ, అందరికీ నేర్పించకూడదనీ, అది తమ గురువుగారి ఆదేశం అనీ రాబర్ట్ అన్నాడు. కాని చిన్న చిన్న మంత్రాలూ, తంత్రాలూ నేర్పడానికి తనకేమీ అభ్యంతరం లేదని చెప్పాడు. నేను అందుకు అంగీకరించాను.

"నాలుగు సంవత్సరాలపాటు అతనికి సితార్ నేర్పించాను. అతనూ నాకు తన విద్య కాస్త నేర్పించాడు. ఈలోగా యిక్కడికి ట్రాన్స్ఫర్ అయి నేను వచ్చేశాను. ఇంతకీ నేను చెప్పేది ఏమిటంటే నా మాంత్రిక విద్య సహాయంతో ఎవరి జేబులో ఏముందో చెప్పగలను.... ప్రస్తుతం ఆ ఉంగరం ఎవరి జేబులో ఉందో నాకు తెల్సు...."

"మీరు చెప్పినదంతా నిజమేనని ఏమిటి నమ్మకం?" అని అడిగాడు గిరిధర్.

శ్యామసుందర్ చిరునవ్వు నవ్వాడు.

"మీరే చూడండి...." అని ఒక నిముషం పాటు కళ్లు మూసుకుని "లక్ష్మీపతిగారి జేబులో $\frac{AC}{83}$ 961344 నెంబరున్న వందరూపాయల నోటుంది....లక్ష్మీపతిగారూ.... మీ పర్సు తెరిచి చూడండి...." అన్నాడు.

"కాని...." లక్ష్మీపతి ఏమో అనబోయాడు.

"ప్లీజ్....మీకేమైనా సందేహాలుంటే ఈ తతంగం అంతా అయిన తరువాత తీర్చుకోవచ్చు....ప్రస్తుతం నేను చెప్పినట్టు చెయ్యండి" అన్నాడు శ్యామసుందర్.

లక్ష్మీపతి పర్సు తీసి వందరూపాయల నోటు తీసి నెంబరు చూసి "నిజమే....మీరు చెప్పిన నెంబరు గల వందరూపాయల నోటు నా దగ్గరుంది...." అన్నాడు.

అందరూ ఆ వందరూపాయల నోటుని తీసుకుని నెంబరు చూశారు....శ్యామసుందర్ చెప్పింది నిజమే.

"ఏమండి గిరిధర్‌గారూ....ఇప్పుడు నమ్మకం కుదిరింది కదా?" అన్నాడు నోటుని పరిశీలిస్తున్న గిరిధర్‌తో శ్యామసుందర్.

గిరిధర్ అంగీకారసూచకంగా తల ఊగించాడు.

"ఇప్పుడు ఆ ఉంగరం ఎవరి జేబులో వుందో నేను గనుక చెప్తే వారికి అవమానం జరుగుతుంది. అంతేకాక విశ్వపతిగారిని ఇబ్బందికర పరిస్థితిలో ఉంచినవాడిని అవుతాను....అందుచేత దీనికొక ఉపాయం ఆలోచించాను. నేను వెళ్ళి మెయిన్ ఆఫ్ చేస్తాను. కొద్దిక్షణాల తరువాత మళ్ళీ మెయిన్ ఆన్ చేస్తాను. ఆ చీకట్లో ఎవరైతే ఉంగరం తీశారో వాళ్ళు టేబులు మీద నిశ్శబ్దంగా పెట్టెయ్యవచ్చు. దీనివల్ల యెవరికీ ఎటువంటి యిబ్బందీ కలగదు. అంతే కాదు. అతని పేరుని నేను ఎక్కడా బయటపెట్టనని ప్రమాణం చేస్తున్నాను."

"మీ పథకం చాలా బావుంది మాష్టారూ...." అంది లావణ్య.

"విశ్వపతిగారూ మెయిన్ ఎక్కడ వుంది?"

"బయట హాల్లో కుడిప్రక్క వుంది."

శ్యామసుందర్ బయటికి వెళ్ళాడు. రెండు క్షణాల్లో లైట్లన్నీ ఆరిపోయాయి. చీకటి.... కటిక చీకటి.... కన్ను పొడుచుకున్నా కనబడని చీకటి—చాల నిశ్శబ్దంగా కూడా వుంది. ఎవరూ మాట్లాడటం లేదు.

నిమిషం తరువాత లైట్లు మళ్ళీ వెలిగాయి. అందరూ ముందుకు వంగి ఆత్రంగా చూశారు. ప్లేటులు మధ్యన వజ్రపుటుంగరం. విశ్వపతిగారి ముఖం వికసించింది. ఆయన దాన్ని ఆప్యాయంగా అందుకుని వేలుకి పెట్టుకున్నాడు.

"ఉంగరం దొరికింది కదూ?" నవ్వుతూ లోపలికి వచ్చాడు శ్యామసుందర్.

"థ్యాంక్స్ శ్యామసుందర్‌గారూ నాకు అత్యంత ప్రియమైన వస్తువు నాకు మళ్ళీ దొరికింది" అన్నాడు విశ్వపతి.

అందరూ కూర్చుని భోజనం చేశారు. కాస్సేపు మాట్లాడుకున్న తరువాత విశ్వపతి దగ్గర శలవు తీసుకుని అందరూ వెళ్ళిపోయారు.

రెండురోజుల తరువాత లావణ్యకి సంగీతం పాఠాలు చెప్పడానికి వచ్చాడు శ్యామసుందర్. లావణ్యకి క్లాస్ తీసుకున్న తరువాత ఇంటికి వెళ్ళబోతే విశ్వపతి అతన్ని పట్టుకున్నాడు.

"మిమ్మల్ని అడగకూడదని అనుకున్నానుగానీ సస్పెన్స్ భరించలేకుండా వున్నాను. ఆ ఉంగరం ఎవరు తీశారో చెప్పండి ప్లీజ్."

శ్యామసుందర్ నవ్వాడు. "నాకూ—డా తెలీదు."

"వ్వాట్!"

"అవునండీ.... రాబర్ట్ నాకు తెలుసనీ, మంత్రవిద్య

అతని దగ్గర నేర్చుకున్నాననీ చెప్పినదంతా ఒట్టి కట్టుకథ... ఆ ఉంగరం తీసిన వాళ్ళను హడలగొట్టడానికే అలా అబద్ధం ఆడాను."

"మరి లక్ష్మీపతి జేబులో వందరూపాయలున్నట్లూ, దాని నెంబరూ మీరు ఎలా చెప్పగలిగారు?"

"వెరీ సింపుల్. మీ అమ్మాయి పుట్టినరోజు ఒకటవ తారీఖు. ప్రతి ఒకటవ తారీఖూ ఆమె నాకు ఫీజు ఇస్తుంది. పార్టీ సమయంలో ఆ వందరూపాయల నోటు మీ అమ్మాయి నాకు ఇచ్చింది. నాకో వింత అలవాటుంది. అది, నా దగ్గరున్న వందరూపాయల నోట్ల నెంబర్లు గుర్తుపెట్టుకోవడం!"

"మరి అది లక్ష్మీపతి జేబులోకి ఎలా వెళ్ళింది?"

"నాలుగు రోజుల క్రితం బజార్లో నా స్నేహితుడు ఒకడు నన్ను కలిసి, తనకు అర్జంటుగా వందరూపాయలు కావాలని అడిగాడు. అప్పుడు నా జేబులో అంత డబ్బు లేదు.

ఆ సమయంలో లక్ష్మీపతిగారు అటువైపు వెళ్తుంటే ఆయనకు ప్రాబ్లెమ్ చెప్పి వందరూపాయలు యివ్వమనీ, ఒకటి రెండు రోజుల్లో ఆయన ఇంటికి వచ్చి ఇచ్చేస్తాననీ చెప్పాను. ఆయన వందరూపాయలు ఇచ్చారు.

ఆ వందరూపాయల అప్పు నేను పార్టీనాడు లావణ్య యిచ్చిన నోటు అప్పటికప్పుడే ఆయనకు ఇచ్చి తీర్చేశాను. మధ్యలో లక్ష్మీపతిగారు గొడవపెడ్తారేమో అనుకున్నాను గానీ, ఆయన నా ప్లాన్ అర్థం చేసుకున్నారు" అన్నాడు శ్యామసుందర్ నవ్వుతూ. □

పార్శిల్ బాంబు

కృష్ణవేణి

సీత ఆ వీధిలో రెండు సంవత్సరాల నుండి వుంటున్నది.

సీతకి ఎవ్వరూ లేరు. కారుప్రమాదంలో భర్త చనిపోయాడట. కంపెనీ యిచ్చిన డబ్బుతో ఇప్పుడు ఉంటున్న యింటిని కొనుక్కుంది.

క్రింద రెండు వాటాలు. పైన ఓ గది బాత్‌రూము, లేవట్రీ, పంపు వున్నది.

అసలు ఆ యిల్లు ఓ మాస్టరిది. కొడుకు కోడలు కోసం పై అన్ని వసతులతో గదిని కట్టించి యిచ్చాడు.

కూతురు పెండ్లికోసం ఆ యిల్లుని అమ్ముకొన్నాడు. ఆ యింటిని సీత కొనుక్కుంది.

క్రింద రెండు వాటాలకి నాలుగొందలు వస్తుంది. పైన గదిలో తాను వుంటున్నది. వంటి మీద నగలులేవు, యింటిలో సామానులు లేవు.

గదిదాటి బయటికి రాదు. ఎవ్వరితోనూ మాట్లాడదు. అందంగా వుంటుంది. వయస్సు ఎంతో చెప్పలేము. ముప్పై నుండి నలభై కి మధ్యన వుండవచ్చు.

సీత అందానికి చాలమంది గాలం వేశారుగానీ ఆమె ఎవ్వరికీ అవకాశం యివ్వలేదు.

తనకి ఎవ్వరూ లేరంది ఈ ప్రపంచంలో. పిల్లలు లేరు. సీత యింటికి ఒక నరపురుగు కూడా యీ రెండు సంవత్సరాలలో రాలేదు. కనీసం ఓ కార్డు ముక్క కూడా రాలేదు.

అటువంటి సీతకి యీ రోజు ఓ రిజిష్టరు పార్శిల్ వచ్చింది.

"సీత అంటే ఎవ్వరండీ?" పోస్టుమాన్ అద్దెకున్న వాళ్ళని అడిగాడు.

"మా యింటిగలావిడ" రమేష్ సమాధానం ఇచ్చాడు.

"ఆవిడ ఎక్కడ వుంటున్నారు?"

"మేడపైన" రమేష్ సమాధానం.

"ఆవిడకి ఓ రిజిష్టరు పార్శిల్ వచ్చింది, పిలవండి" పోస్టుమేన్ అన్నాడు.

ఆ మాట విన్నవాళ్ళంతా నిలువునా నిర్ఘాంతబోయారు.

ఈ వింత వార్త యింటిలోనే కాక ఆ ప్రక్క యీ ప్రక్క యిళ్ళల్లోకి వ్యాపించింది.

రెండు సంవత్సరాల నుండి ఆమె వివరాలు ఏమీ తెలియక కొట్టుమిట్టాడుతున్న జనానికి తప్పక ఓ "క్లూ" తెలుస్తుంది కదా అనే ఆశతో అంతా పోస్టుమేన్ చుట్టూ గుమిగూడారు.

మొగాళ్ళు ఎవ్వరూ లేరు.

రమేష్‌కి జ్వరంగా వుండటం వలన కాలేజీకి వెళ్ళక యింటిలోనే వున్నాడు.

సీత విభ్రాంతితో క్రిందికి దిగి వచ్చింది.

సీత వచ్చేలోగా ఆడవారు అందినంత సమాచారాన్ని పోస్టుమేన్ వద్ద నుండి రాబట్టారు.

"ఏ వూరు నుండి పార్శిల్."

"విజయవాడ."

"ఎవ్వరు పంపించారు?"

"ఎవ్వరో రామచంద్ర అట."

"ఓహో సీతకి రాముడేగా మరి...."

అందరూ కిసుక్కున నవ్వారు.

ఈలోగా సీత వణుకుతూ రానే వచ్చింది. రహస్యంగా గుట్టుగా తన మానాన్న తాను జీవిస్తోంది. తన అడ్రస్సు తెలుసుకొని ఎవ్వరు ఏం పంపించారు.

"మీకు పార్శిల్" పోస్టుమేన్ అన్నాడు.

"ఎవరో రామచంద్ర అట, నీకేం కావాలేమిటి?" అద్దెకున్నావిడ అంది.

సీత దేనికి సమాధానం యివ్వలేదు.

"ఇక్కడ సంతకం పెట్టండి" ఓ కాగితం అందించాడు.

ఇంగ్లీషులో సంతకం చేసింది.

"సాక్షి సంతకం ఎవ్వరైనా చేయండి" గుంపుని చూసి పోస్టుమేన్ అన్నాడు.

రమేష్ ముందుకొచ్చి సాక్షిసంతకం చేశాడు.

పోస్టుమేన్ పార్శిల్‌ని సీత చేతిలో పెట్టాడు.

సీత పార్శిల్‌ని తీసుకొని వెళ్ళిపోబోయింది. "విప్ప వమ్మా! ఏముందో మేమూ చూస్తాం" ఒకావిడ అంది.

సీత వాళ్ళ మాటకి పార్శిల్ కాగితాన్ని చింపింది. లక్కతో తాళ్ళతో గట్టిగా వున్నది.

పోస్టుమేన్‌కి కుతూహలంగానే వుంది.

రమేష్‌కి కూడా. ఇద్దరూ చేరి సీతకి సహాయం చేశారు.

లోపల వుండచుట్టి ఓ చీర వున్నది.

చీరని చూడగానే కళ్ళు ఎగురవేసుకుంటూ అమ్మలక్క లందరూ యింకా ముందుకి జరిగి వచ్చారు.

అంతే!

పెద్ద ప్రేలుడు!

రెండు మూడు వీధుల జనం ఆ శబ్దానికి పరిగెట్టి వీధుల లోకి వచ్చేశారు.

పెద్దగా పొగ, హాహాకారాలు మిన్నుముట్టాయి.

ఆ చీరలోపల గ్రేనేడ్ బాంబు వున్నది. చీర లాగగానే పిన్నువూడి బాంబు పేలింది.

సీత, పోస్టుమేన్, రమేష్ ముగ్గురూ ముక్కలు ముక్కలు అయి గాలిలో యెగిరాయి శరీరపు కండలు.

దగ్గరగా వున్న పదిమందికి గాయాలు తగిలాయి. అందులో యిద్దరు చావుబ్రతుకుల మధ్య వూగిసలాడు తున్నారు.

మద్రాసు నగరం అల్లకల్లోలం అయింది.

డెత్‌స్పాట్‌ని చూడడానికి నగరప్రజలు తీర్థప్రజల్లా రాసాగారు.

పోలీసు అధికారులే గాక స్పాటుకి తమిళనాడు మంత్రులు కూడా వచ్చారు.

న్యూస్ ఆఘమేఘాల మీద కేంద్రం వరకూ వెళ్ళింది.

కేసుని ఇన్‌స్పెక్టర్ పళనివేలుకి అప్పగించారు.

"మా ఆవిడ నాకు డైవర్సు యివ్వడం ఖాయం" సార్జంటు తంగం అన్నాడు.

"ఏం—ఎందుకని?" పళనివేలు ప్రశ్నించాడు.

"నేను స్పెషల్ వండమన్నప్పుడంతా ఏదో అర్జంటు కేసు వస్తోంది. వండినదంతా వేస్టని నాతో దెబ్బలాట. ఈ రోజు స్పెషల్ ఐటమ్సు చెప్పివచ్చాను. రాకపోతే పుట్టింటికి వెళ్ళిపోతానంది" అన్నాడు మనిషి మాంసపు ముక్కలని ఏరుతున్న కానిస్టేబుల్సుని చూస్తూ.

గాయపడ్డవారిని హాస్పటల్‌కి ఎమర్జన్సీ వార్డుకి తరలించారు.

ఓ పెట్టెడు ముక్కలు పోగుపడ్డాయి. అయితే అది యెవ్వరి దెవ్వరిదో చెప్పడం కష్టం.

మనుష్యులే కాక ఆ వీధిలో కుక్కలు కాకుల గుంపు కూడా అధికం అయింది.

2

సీత గదిని సోదా చేశారు.

నాలుగు తెల్లచీరలు జాకెట్టులు వున్నాయి పెట్టెలో. ఓ చిన్న నగగానీ, ఓ కాగితం ముక్కగానీ లేదు. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు పాస్ బుక్కు వున్నది. దానిలో రెండువేల ఐదొందులు క్యాష్ వున్నట్లు వున్నది.

ఒక స్టవ్, నాలుగు గిన్నెలు, ఓ కంచం, ఓ గ్లాసు, ఓ ప్లాస్టిక్ బక్కెట్టు, ప్లాస్టిక్ మగ్గు, నాలుగు హార్లిక్సుబాటిల్సు, ఓ చాప, దిండు, దుప్పటి, ఇవి ఆ గదిలోని సామానులు.

తెలుగు వారపత్రికలు మాత్రం వున్నాయి.

ఆ గదిని బట్టి ఆ గది యజమానురాలు చాల నిరాడంబరంగా, ఓ సన్యాసిమాదిరి జీవిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆమె ఫోటో లేదు. డైరీ వ్రాసే అలవాటు లేన్నట్లు వున్నది.

ప్రస్తుతం ఆమె రూపు కూడా మాసిపోయింది. పూచిక పుల్ల ఆధారం దొరకలేదు.

ఎంక్వయిరీలో కూడా ఏమీ తెలియలేదు.

అసలు ఆమె అవసరానికి మించి బయటికి రాదన్న విషయం తెలిసింది.

"సార్! ఇదేదో తెలుసుకోవలసిన విషయమే. మరీ యింత పకడ్బందీగా జీవించడానికి కారణం ఏమిటి? ఆమె

వెనుక ఓ పెద్దకథ వుండివుండాలి" తంగం అన్నాడు.

"అవును! తంగం, నీవు విజయవాడ వెళ్ళి రామ చంద్ర వివరాలు తెలుసుకొనిరా!"

3

పార్శిల్ మీద ఫ్రమ్ అడ్రస్సు ప్రకారం తంగం, రామ చంద్ర యింటి తలుపు తట్టాడు పూర్ణానంద వీధిలో.

ఓ యాభై సంవత్సరాల వ్యక్తి వచ్చి తలుపు తెరిచి "ఎవరు కావాలి" అని అడిగాడు.

తంగం తననుపరిచయం చేసుకొని, "పార్శిల్లో బాంబు గూర్చి మీరు పేపర్లో చదవ లేదా?" అని అడిగాడు.

"చదివాను, కానీ దానికి నాకు సంబంధం ఏమిటి? నేను తాలూకాఫీసు గుమాస్తాని" విభ్రాంతిగా అడిగాడు రామచంద్ర.

"ఆ పార్శిల్ మీద ఫ్రమ్ అడ్రస్సు మీది వున్నది. సీత మీకు ఏం కావాలి?"

"సీతలు అనుసూయలు ఎవ్వరూ నాకు తెలియదు. అసలు మాకు మద్రాసులో చుట్టాలు కాదు కదా, స్నేహితు లకి స్నేహితులు కూడా లేరు."

"స్నేహితులు లేకపోవచ్చును, శత్రువులు ఎవరైనా వున్నారేమో గుర్తుకు తెచ్చుకోండి" తంగం అడిగాడు.

"అంత దూరంవరకూ శత్రువులని పెంచుకోగల గొప్ప వ్యక్తినికాను, చెప్పానుగా నేను ఓ మామూలు తాలూకా గుమాస్తానని" విచారంగా అన్నాడు.

ఈలోగ లోననుండి కాఫీలు వచ్చాయి.

అతని మొఖంలో యీ బెడద ఏమిటా అనే చింత స్పష్టంగా తెలుస్తోంది.

"ఇక్కడ మీ శత్రువులు ఎవ్వరూ? మీ దగ్గర చుట్టాలలోగానీ, స్నేహితులలోగానీ సీత అనే అమ్మాయి ఎవ్వరైన వున్నారా?" తంగం ప్రశ్నించాడు.

"ఇండియాలో సీతలు పది మందికి నలుగురైనా వుంటారా. అలానే మాకు కావలసిన వాళ్ళల్లో వున్నారు గానీ, అందరూ పెళ్ళిళ్ళు చేసుకొని భర్తలతో కాపురాలు చేసుకుంటున్నారు యీ వూరిలోనే. మద్రాసులో యెవ్వరూ లేరు."

"ఏమండీ మాట" లోసనుండి స్త్రీ కంఠం పిలిచింది.

"ప్లీజ్....జస్ట వన్‌మినిట్...." ఆయన లేచి లోనికి వెళ్ళాడు.

"మీ అన్న కొడుకు అరుణకుమార్ లేవదీసుకొని వెళ్ళిన అమ్మాయి పేరు సీత అని, మద్రాసులో వదిలి వచ్చాడని అనుకున్నారుగా...."

"ఆ(....ఆ(...."

ఆయన మళ్ళీ బయటికి వచ్చాడు.

"చిన్నమాట, మీకు వుపయోగపడుతుందో లేదో నాకు తెలియదుగానీ....నాకూ మా అన్నకి ఓ పదేళ్ళుగా పొలాల తగువులు జరుగుతూ వున్నాయి. రెండు కుటుంబాల మధ్య విరోధం పదేళ్ళనుండి వున్నది.

మా అన్నకి ముగ్గురు కొడుకులు. మూడోవాడు అరుణ కుమార్ అని సరిగ్గా చదువుకోక జులాయిగా తిరుగుతూ, పదేళ్ళ క్రితం పక్కింటి అమ్మాయిని తీసుకుని మద్రాసు పారిపోయాడని, ఆ పిల్లని నట్టేట్లో ముంచి నక్సలైట్లలో చేరిపోయాడని చెప్పుకున్నారు...." అని చెప్పాను.

"అతను అంటే....అరుణకుమార్ ఎక్కడ వున్నది తెలియలేదా?" తంగం ప్రశ్నించాడు.

"ఎక్కడో వున్నాడని తిరిగి బాగా డబ్బుతో వచ్చాడని విన్నాను. ఏదైనా మధ్యలో వారు అందించే వార్తలేగానీ రాకపోకలు చావులకి పెళ్ళిళ్ళకి పేరంటాలకి కూడా లేవు మరి."

"విజయవాడ పోలీసుస్టేషనుకి ఆయనని రమ్మని చెప్పి, తంగం రామచంద్ర అన్న అడ్రస్సుని తీసుకొన్నాడు.

4

పోలీసు బలగంతో రామచంద్ర అన్న విశ్వనాథం యింటిమీదికి దాడి చేశాడు.

విశ్వనాథం రిటైర్డు స్కూలుమాస్టారు. అరవై సంవత్సరాల పైన వుంటుంది.

కళ్లు కనిపించవు, మాట వినిపించదు.

తండ్రితో బలవంతంగా పినతండ్రి మీద కేసు వేయించింది విశ్వనాథం కొడుకులే.

పోలీసుదాడి జరిపినప్పుడు టైము తెల్లవారుఝాము నాలుగు గంటలు.

విశ్వనాథం కొడుకులు ముగ్గురూ యింటిలోనే వున్నారు.

నక్సలైట్లకి సంబంధించిన కొన్ని పత్రాలు, చేతి బాంబులు గ్రేనేడులు వంటి ప్రమాదకర వస్తువులు యింటిలో దొరికాయి.

ఆంధ్రా గవర్నమెంటు సహకారంతో ముద్దాయిలు నలుగురు తమిళనాడుకి తీసుకొని రాబడ్డారు.

పార్శిల్లో బాంబు పెట్టిన హంతకులు తెల్లవారుఝామున వచ్చే హౌరా మెయిల్లో వస్తున్నారని ముందే న్యూస్ తెలుసుకొన్న మద్రాసు నగర ప్రజలు హంతకులకి స్వాగతం పలకడానికి అన్నట్లు నేల యీనినట్లు సెంట్రల్

స్టేషన్‌కి వచ్చి చేరారు.

కోడిగ్రుడ్లు విసిరినవాళ్ళు విసిరారు.

హిప్ హిప్ హుర్రే అని సంతోషంగా కేకలు వేసిన వారు వున్నారు.

అరుణకుమార్ స్టేట్‌మెంట్ ఇలా వుంది.

పదేళ్ళ క్రితం సీతతో మద్రాసు వచ్చి సీతమీద మోజు తీరిపోయిన తరువాత తమిళనాడులో పరిచయం అయిన వ్యక్తితో నక్సలైట్లతో కలిసి పదేళ్ళు గడిపాడు.

ప్రమాదకరమైన ఆ జీవితం మీద విసుగెత్తి యింటి కొచ్చేశాడు. ఇప్పుడు ఎలా బ్రతకాలో తెలియలేదు.

సీతకోసం వాకబు చేస్తే వాళ్ళు అమ్మకొని కొంత డబ్బు సంపాదించి యిల్లు కొనుక్కొని గుట్టుగా జీవిస్తున్నట్లు తెలుసుకున్నాడు.

ఒకసారి మార్కెట్టులో కలసి మాట్లాడి ఇల్లు అమ్మేసి డబ్బుతో రా! వ్యాపారం చేసుకొని బ్రతుకుదాం అంటే, "ఒకసారి నమ్మి చెడ్డాను. ఇక నిన్ను నమ్మను. నేను మర్యాదగా బ్రతుకుతున్నాను. నా జోలికి రావద్దు" అని తిట్టి వెళ్ళిపోయింది.

సీతా తాను మద్రాసులో రిజిష్టరు మేరేజి చేసుకున్నారు. సీత చనిపోతే ఆ యిల్లు తనకే వస్తుంది చట్టప్రకారం. ఇటు పినతండ్రి కేసు గెలిచేట్టున్నాడు.

అందుకే ప్లానువేసి ఒకే దెబ్బకి రెండు పిట్టలు అన్నట్లు సీతకి పార్శిల్లో బాంబు పెట్టి ఫ్రమ్ అడ్రసు పినతండ్రి అడ్రసు యిచ్చాడు.

తనని సరమానవుడు పట్టలేరని తలంచాడు. కానీ తంగం, ఇన్‌స్పెక్టర్ పళనివేలు సామాన్యులా? □

నేరం ఎవరిది?

వాణిశ్రీ

సికింద్రాబాద్ కింగ్స్‌వేలో ఆటో దిగింది సంధ్య.

మూడో అంతస్తులో వున్న తాతయ్యా ఫిలిమ్ డిస్ట్రిబ్యూటర్స్ ఆఫీసు ముందు ఆగింది.

ముందు గదిలో లేడీ టైపిస్ట్ కూర్చుని టైప్ చేస్తోంది.

సంధ్య రాక గమనించి ఆమె తలెత్తి చూసింది.

"ఏంటి....! ఏం కావాలి?" అంది.

"మేనేజర్‌గారు వున్నారా? కొంచెం మాట్లాడాలి"అంది సంధ్య.

"వున్నారు. కూర్చోండి. లోపల పార్టీలతో మాట్లాడుతున్నారు. కొంచెం ఆగండి." అంది.

సంధ్య టైపిస్ట్ ప్రక్కన కుర్చీలో కూర్చుంది.

కొంచెంసేపటికి మేనేజర్ గదిలోంచి ఇద్దరు వచ్చి వెళ్ళిపోయారు.

"వెళ్ళండి" అంది టైపిస్ట్ సంధ్యను వుద్దేశించి.

సంధ్య తలుపు నెట్టుకుని వెళ్ళింది.

మేనేజర్ వెంకట్ ఎవరితోనో మాట్లాడుతూ తలెత్తి సంధ్యవంక చూశాడు. సంధ్య నమస్కారం చేసింది. కూర్చోమన్నట్లు సంజ్ఞ చేశాడు. సంధ్య కుర్చీలో కూర్చుని గదిలో చుట్టూ వున్న రాబోయే చిత్రాలలోని స్టిల్స్ చూస్తూ వుంది.

"ఏం కావాలమ్మా!" అన్నాడు వెంకట్ రిసీవర్ క్రెడిల్ చేస్తూ.

"నేను నారాయణరావు మిసెస్‌ని" అంది సంధ్య.

"నారాయణరావు ఎవరు?"

"మీ కంపెనీలో రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు గదండీ!"

వెంకట్ గుర్తొచ్చినట్లు "ఆఁ....ఆఁ...." అన్నాడు.

"ఆయన క్యాంప్‌కెళ్ళి నెల దాటిపోయింది. డబ్బు ఏమీ పంపలేదు. ఇంట్లో చాలా యిబ్బందిగా వుందండీ" అంది సంధ్య.

"వెళ్ళేటప్పుడు అడ్రస్ యివ్వలేదా?"

"ఇచ్చారండీ. రాయచూర్ వెళ్తున్నాను. కనీసం ఆర్నెల్లు చార్టు వుంటుందన్నారు. నెల నెలా డబ్బు పంపు తానని చెప్పారు. నెల దాటిపోయింది. రెండు వుత్తరాలు రాశాను. జవాబు రాలేదు" అంది సంధ్య.

"రాయచూర్ చార్టు బ్రేక్ అయినట్లుందే...." తనలో అనుకుంటున్నట్లు అన్నాడు వెంకట్.

బజ్జర్ నొక్కాడు.

బాయ్ వచ్చి చేతులు కట్టుకుని నిల్చున్నాడు.

"మూర్తిని పిలువు."

బాయ్ వెళ్ళిన కాసేపటికి అసిస్టెంట్ మేనేజర్ మూర్తి వచ్చాడు.

"మూర్తీ! రాయచూర్ చార్టు ఆగిపోయింది కదూ!"

"అవును సార్!"

"నారాయణరావు కాంప్ వెళ్ళాడు కదూ! వెనక్కి రాలేదా! పార్టీ డ్యూస్ పెట్టిందా యేం?" అన్నాడు వెంకట్.

"లేదు సార్! పార్టీ సెకండ్ రన్ పిక్చర్స్ ఆడనని పేచీ పెట్టాక మనమే చార్టు బ్రేక్ చేశాం సార్! ఎకౌంట్ సెటిల్ చేసి మన రిప్రజెంటేటివ్‌ని పంపేశాడు" అన్నాడు మూర్తి.

"అరే!....మరి నారాయణరావు యింటికి రాలేదని భార్య వచ్చిందేమిటి? ఇంటికి వెళ్ళకుండా మళ్ళీ క్యాంప్‌కి వెళ్ళాడా ఏం?"

"లేదు సార్! మనం ఎక్కడికీ పంపలేదే?" అన్నాడు మూర్తి ఏదో ఆలోచిస్తూ.

"ఎవరికైనా లోన్ వెళ్ళాడా?"

"ఎవరికీ పంపలేదే?" అన్నాడు మూర్తి.

వెంకట్ ఆశ్చర్యంగా చూసి "మరి ఎక్కడికి వెళ్లాడు?" అన్నాడు మూర్తి వంక ప్రశ్నార్థకంగా.

మూర్తి మాట్లాడలేదు.

"ఆయన క్యాంప్ నుంచి తిరిగి ఆఫీసుకి వచ్చారా?" అంది సంధ్య ఆందోళన వ్యక్తపరుస్తూ.

"వచ్చాడండీ. సాయంకాలం అయిదు దాటాక వచ్చాడు. ఆటోలో బెడ్డింగ్, సూట్ కేస్ పెట్టి వచ్చాననీ, ఎక్కౌంట్ తాలూకు డబ్బు డిమాండ్ డ్రాఫ్ట్ ఇచ్చి వెళ్ళిపోయాడు. ఏ రోజు వచ్చిందీ చూసి చెప్తాను" అన్నాడు.

మూర్తి వెళ్ళి కాసేపటికి ఎక్కౌంట్ బుక్ తెచ్చి మేనేజర్ ముందు పెట్టాడు.

"ఫిబ్రవరీ 27 న వచ్చి డి. డి. ఇచ్చి వెళ్ళాడు సార్!" అన్నాడు మూర్తి.

"ఈ రోజు మార్చి 13 తారీఖు. అంటే పదిహేనురోజు లైంది. ఇన్నిరోజులు యింటికి వెళ్ళకుండా ఏం చేస్తు న్నాడు?" అన్నాడు వెంకట్.

మూర్తి ఆలోచిస్తూ వుండిపోయాడు.

సంధ్య మాట్లాడలేదు.

"ఏమ్మా! మీ మధ్య ఏవైనా గొడవలు వచ్చాయా? నిజం చెప్పు?" అన్నాడు వెంకట్ సంధ్యను వుద్దేశించి.

"గొడవలు ఏమీ లేవండి. ఈ వుద్యోగం మానేసి ఏదైనా స్థిరంగా వుండేది చూసుకోమని నేను అంటూ వుండేదానిని. ఆయన ఎప్పుడూ కాంప్‌లో వుంటారు. ఇంటి దగ్గర ఒంటరిగా వుండాల్సొస్తోంది."

"మీకు ఎంతమంది పిల్లలు?"

"ఇంకా పిల్లలు లేరండి."

"ఐ. సీ....మరి ఇంకేవమ్మా! క్యాంప్‌కి అతనితోపాటు



వెళ్ళొచ్చుగా!" అన్నాడు వెంకట్.

"వెళ్ళొచ్చునుగాని నేను కాన్వెంట్‌లో టీచర్‌గా పని చేస్తున్నానండి" అంది సంధ్య తల వంచుకుని.

"వూళ్ళోకి వచ్చినవాడు యింటికి వెళ్ళకుండా ఎక్కడికి వెళ్ళివుంటాడు? గమ్మత్తుగా వుందే. డబ్బు గూడా ఆఫీసులో యిచ్చి వెళ్ళాడు. అతనికి పేకాట గొడవ గూడా లేనట్లే వుంది. ఎందుకైనా మంచిది పోలీసు రిపోర్టు ఇవ్వు" అన్నాడు వెంకట్.

"ఏదైనా ప్రమాదం జరిగి వుంటుందంటారా?" భయపడుతూ అంది సంధ్య.

"భయపడకమ్మా! ఎందుకైనా మంచిదని అన్నాను" అన్నాడు వెంకట్.

2

ఇంటి ముందు రిక్షా ఆగినట్లు గమనించి వరండాలోకి వచ్చింది సుబ్బమ్మ.

సంధ్య రిక్షా దిగి అతనికి డబ్బులిచ్చి వస్తూ అత్తని

చూసి దుఃఖం ఆపుకోలేక "అత్తయ్యా!...." అంటూ ఏడుపు సాగించింది.

సుబ్బమ్మ గుండె గుభేలుమంది. 'ఏదైనా అశుభం జరగ లేదు గదా! తన కొడుకు ఏమైనాడు?' అనే ఆలోచన మనసులోకి వచ్చి ఆమెకు వళ్ళు చల్లబడిపోయినట్లయింది.

"ఏమ్మా!....ఏం జరిగింది?" అంది గొంతు పెగల్చు కుని.

సంధ్య కొంచెంసేపు ఏడ్చి ఏడ్చి తర్వాత వూరడిల్లింది. తర్వాత జరిగిందతతా అత్తకి చెప్పింది. తను వేరే వుద్యోగం చూసుకోమని గొడవ పెట్టినందుకు ఆయన తన మీద అలిగి వెళ్ళిపోయాడనీ, వేరే ఏదైనా దొరికేదాకా ఇంటికి తిరిగి రాడనీ తనకు భయంగా వుందనీ, వాపోయింది. కంపెనీకి వెళ్ళడం లేదనీ, వుద్యోగం మానేసి నట్టే అంది.

పోలీసులకు రిపోర్టు చేసి ఆయన ఫోటో గూడా ఇచ్చా ననీ ఎక్కడైనా కనిపిస్తే తెలియజేస్తామని చెప్పారని అంది. తను అక్కడ వుండలేక వెంటనే రైలుకు వచ్చా నని చెప్పింది.

సుబ్బమ్మ అంతా విన్నాక తేలికగా నిట్టూర్చింది. 'హమ్మయ్య ఏమీ జరగలేదు. ఏదో మొగుడూ పెళ్ళాల మధ్య చిన్న తగాదా' అనుకుంది తృప్తిగా.

నారాయణరావు తమ్ముడు రామకృష్ణ పోలీస్ డిపార్ట్ మెంట్‌లో టైపిస్టుగా పని చేస్తున్నాడు. అతను సంగతి అంతా విని అన్న మూర్ఖత్వానికి బాధపడ్డాడు.

"సరే వదినా! నేను హైదరాబాద్ వెళ్ళి అన్నయ్యా ఎక్కడున్నాడో వెతికి యింటికి తీసుకొస్తాను. నువ్వేం కంగారు పడకు" అన్నాడు రామకృష్ణ.

మర్నాడు కృష్ణ సెలవు గ్రాంట్ చేయించుకుని హైద్రా బాదు వెళ్ళాడు. అతనితోపాటు జార్జిగోపాల్ వచ్చాడు.

జార్జిగోపాల్ నారాయణరావుకి క్లోజ్ ఫ్రెండ్. అతను పూనాలో పని చేస్తున్నాడు. ఇంటికి వచ్చి పూనా వెళ్తూ బెజవాడ స్టేషన్‌లో రామకృష్ణకి కనిపించాడు. నారాయణ రావుని కలుసుకోవాలని జార్జిగోపాల్ అనుకున్నాడు. అతను ఎప్పుడూ కాంప్‌లలో వుంటాడని తెలుసు. అందుకే ఆఫీసుకి ఫోన్‌చేసి వూళ్ళో వున్నాడంటేనే దిగే వాడు.

రామకృష్ణ ద్వారా నారాయణరావు భార్య మీద అలిగి యింటికి రాకుండా ఎక్కడో వున్నాడని తెలిసి అతను ఆందోళన చెందాడు. అతన్ని కలిసి సర్ది చెప్తే బాగుంటుం దని అనుకున్నాడు. హైదరాబాద్‌లో దిగి రామకృష్ణ వెంట నారాయణరావు ఇంటికి వెళ్ళాడు. ఇంటికి తాళంవేసి వుంది. సంధ్య తాళంచెవి రామకృష్ణకు ఇచ్చింది.

ఇల్లు సనత్‌నగర్‌లో వుంది.

రాత్రి విశ్రాంతి తీసుకుని మర్నాడు పెందలాడే లేచాడు జార్జి గోపాల్.

అంతకు ముందే లేచి పళ్ళు తోముకుంటున్నాడు రామ కృష్ణ.

"ఈ ఇంటిమీద బాకీ తీరిపోయినట్లేనా?" అన్నాడు జార్జి గోపాల్.

"ఏమో! ఆయనగారు యిటువంటి విషయాలు మనతో చెప్తాడు గనుకనా? మనకి తెలియడానికి?" నిష్ఠూరంగా అన్నాడు రామకృష్ణ.

"వాడి తత్వమే అంత, రిజర్వ్‌డ్ టైప్" నవ్వాడు జార్జి.

"పోనీలే! సిటీలో ఒక కొంప కట్టుకున్నాడు చేసేది ప్రైవేట్ వుద్యోగమైనా! నేను గవర్నమెంట్ జాబ్ చేస్తున్నా వున్న యింటికి రిపేర్సు చేయించలేకపోతున్నాను" అన్నాడు రామకృష్ణ.

ఇద్దరూ కాలకృత్యాలు తీర్చుకుని స్నానాలు చేశారు. సెంటర్‌కి వెళ్ళి టిఫిన్ చేశారు.

"నేను పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళొస్తాను. మా డిపార్టుమెంట్ వాళ్ళతో కన్సల్ట్ చేసివస్తా! ఇంత సిటీలో మనవాడు ఎక్కడున్నాడో కనుక్కోవడం కష్టం" అన్నాడు రామకృష్ణ.

"సరే వెళ్ళిరా! నేనీ లోపల చుట్టుప్రక్కల ఇళ్ళవాళ్ళని ఎంక్వయిరీ చేస్తాను. ఏదైనా క్లూ దొరకొచ్చు మన పరిశోధనలో" నవ్వాడు జార్జి.

రామకృష్ణ సిటీబస్ ఎక్కాడు 'కీ' జార్జికి ఇచ్చి.

3

మధ్యాహ్నం రెండుగంటలకు వచ్చాడు రామకృష్ణ.

జార్జి పడకకుర్చీలో పడుకుని వున్నాడు.

"ఏమిటి అలా వున్నావు? వంట్లో బాగాలేదా?" అన్నాడు రామకృష్ణ.

"బాగానే వున్నాను" అన్నాడు జార్జి.

"భోజనం చేశావా?"

"లేదు" అన్నాడు జార్జి.

"అదేం? రెండు దాటింది పద" అన్నాడు రామకృష్ణ.

"ఆకలి లేదు. పర్వాలేదులే" అన్నాడు జార్జి.

"మా డిపార్టుమెంట్ వాళ్ళతో మాట్లాడి వచ్చాను. గట్టిగా ప్రయత్నిస్తామని అన్నారు. పోతే, మనవాడు పని చేసే తాతయ్యా ఫిలిం కంపెనికిగూడా వెళ్ళాను. మనవాడితో పాటు పనిచేసే రిప్రజెంటివ్‌లు ఎవరూ గూడా నెలనుండి

చూశ్కేదని చెప్పారు. అసలు సిటీలో వున్నాడా? లేదా? అని అనుమానం వస్తోంది.

నిజామాబాద్‌లో ఏదో ఒక హోలు అద్దెకు తీసుకోవాలని అనుకుంటున్నట్లు కొందరితో అన్నాడట. బహుశా అక్కడికి వెళ్ళివుండొచ్చని అనుకుంటున్నాను. ఈవెనింగ్ నిజామాబాద్ వెళ్దామా?'' అన్నాడు రామకృష్ణ.

"లాభం లేదు'' అన్నాడు జార్జి సీరసంగా.

"ఏమిటి?'' ఆశ్చర్యంతో ప్రశ్నించాడు రామకృష్ణ.

జార్జి గంభీరంగా అన్నాడు. "అక్కడ మీ అన్న వుంటే కదా?''

"ఏమిటి నువ్వనేది?''

"అవును మీ అన్న ఎక్కడున్నాడో నాకు తెలుసు. పోలీస్ ఇనస్పెక్టర్ని పిల్చుకుని రా!'' అన్నాడు జార్జి.

రామకృష్ణ నివ్వెరపోయాడు.

"ఇనస్పెక్టర్ ఎందుకు?''

"పని వుంది? ముందు నేను చెప్పినట్లు చెయ్యి'' సీరియస్‌గా అన్నాడు జార్జి.

4

పోలీస్‌జీప్ ఇంటి ముందు ఆగింది. ఇనస్పెక్టర్, కానిస్టేబుల్స్ బండి దిగి వచ్చారు.

"ఇనస్పెక్టర్! అదిగో ఆ గాడ్రెజ్ బీరువా ప్రక్కకి తీయించి త్రవ్వించండి. దాని క్రిందే శవం వుంది'' అన్నాడు జార్జి. అతని కళ్ళలోంచి నీళ్ళు టపటప రాలాయి.

రామకృష్ణ దుఃఖంతో క్రుంగిపోయి కుర్చీలో కూలబడి

పోయాడు.

గాడ్రెజ్ బీరువా అడుగు ఎత్తున కట్టిన సిమెంట్ దిమ్మె మీద వుంది. దాన్ని ప్రక్కకి ఎత్తి పెట్టి దిమ్మ పగలగొట్టి త్రవ్వారు. జార్జి చెప్పినట్లే కుళ్ళిపోయిన శవం బైట పడింది.

రామకృష్ణ గొల్లుమని ఏడ్చాడు.

జార్జి దుఃఖం ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చాడు.

"మీకు ఎలా అనుమానం కలిగింది?" ప్రశ్నించాడు ఇనస్పెక్టర్ జార్జిని.

చెక్క బేబులు సొరుగులాగి అందులో నుంచి కళ్ళ జోడు తీశాడు జార్జి.

"ఇది నారాయణరావు కళ్ళజోడు. దీన్ని చూశారా ఎంత లావుగా వుందో. ఫోర్ పాయింట్ ఫైవ్. వాడు కళ్ళ జోడు లేకుండా బైటకు వెళ్ళడు. నాకు బాగా తెలుసు. దీన్ని చూడగానే నాకు అనుమానం కలిగింది.

రోడ్డుప్రక్క చెత్తకుప్పలు వెదికాను. వాడి చెప్పులు దొరికాయి. ఇవిగో చూడండి. శిథిలావస్థలో వున్నాయి. వాడి కాళ్ళు చాలా పొడుగు. పన్నెండో నెంబరు చెప్పులు. సామాన్యంగా పన్నెండో నెంబరు చెప్పులు వాడేవాళ్ళు వుండరు.

చుట్టుప్రక్కల వాళ్ళని ఎంక్వయిరీ చేశాను. సంధ్య శీలం మంచిది కాదనే నా అనుమానం బలపడింది. ఆమె పని చేసే కాన్వెంట్ లోనే పనిచేస్తున్న తెలుగు పండిట్ సూర్యనారాయణ అనే అతను తరచుగా వస్తూ వుంటాడని తెలిసింది.

వాడు క్యాంప్ నుంచి వచ్చి వుంటాడు అనుకోకుండా. వీళ్ళిద్దరూ రెడ్‌హేండెడ్‌గా పట్టుబడి వుండొచ్చు. నారాయణరావు వుద్రేకి. సంధ్యను కొట్టివుండొచ్చు. అప్పుడు వాళ్ళిద్దరూ కలిసి వీడిని పట్టుపెట్టి పాతిపెట్టి వుండొచ్చు.

నిజానికి అటు చూడండి. బీరువాలు చెక్కల మీద నిలబెడుతూ వుంటారు సర్వసామాన్యంగా. తర్వాత బీరువా నిలబెట్టడానికి ఇంత వెడల్పు దిమ్మె అవసరం లేదు. ఆ దిమ్మె గూడా పనివాడు కట్టినట్లుగా లేదు. అవకతవకలతో ఎలా వుందో చూశారుగా!" అన్నాడు జార్జి.

5

హత్యా నేరం మీద సంధ్యని, సూర్యనారాయణనీ అరెస్ట్ చేసి కేసుపెట్టారు.

సంధ్య నిజం ఒప్పుకుంది. సూర్యనారాయణకి గూడా నేరం ఒప్పుకోక తప్పలేదు.

"ఆయన నెలల తరబడి కాంపులలో వుంటారు. స్థిరమైన వుద్యోగం చూసుకోమని పోరుపెట్టినా వినలేదు. నేనూ వుప్పూ కారం తింటున్న మనిషినే. నాకూ కోరికలు వుంటాయి. ఆయన కాంపులలో ఎందరు ఆడవాళ్ళతో తన కోరికలు తీర్చుకుంటారో నాకు తెలుసు.

నా మనసూ మారిపోయింది. సూర్యనారాయణతో సంబంధం పెట్టుకున్నాను. కాని ఆయన కాంపు నుంచి వచ్చి చూశాడు. సూర్యనారాయణని చంపుతానని యెగిరి గొంతు పట్టుకున్నాడు. నేనెంత బ్రతిమాలినా వినలేదు. ఇక గత్యంతరం లేక ఇద్దరం కలిసే అతన్ని చంపేశాం" అంది సంధ్య. □

దెయ్యం కారు

ప్రతాప రవిశంకర్

గార్డెన్‌లో దీపాలు వెలుగుతున్నాయి. నిశ్శబ్దంగా వుంది.

మెల్లగా వీస్తున్న గాలికి తోటలో చెట్లు తలలు వూపుతున్నాయి.

రాత్రి తొమ్మిది గంటలు దాటింది.

ఆ భవనం ముందు ఓ కారు వచ్చి కీచుమంటూ ఆగిపోయింది. అందులోనించి కిందికి దిగిన మనిషి సన్నగా, పొడుగ్గా వున్నాడు. నల్లని శరీరం రంగు—ఫుల్‌షర్టు వేసుకున్నాడు. టైటుప్యాంటు—అతని కళ్ళు చురుగ్గా వున్నాయి.

చేతిలో వెలుగుతున్న సిగరెట్టును కిందవేసి బూటు కాలితో నొక్కాడు.

ముందుకు నడిచి గేటు తెరిచాడు.

చిన్న చప్పుడయింది.

పువ్వుల చెట్లమధ్య నించి నడుస్తూ వరండాలోకి వచ్చాడు. తలుపులు మూసివున్నాయి.

లోపల ఎక్కడో దీపం వెలుగుతున్నది.

కాల్‌బెల్ నొక్కాడు.

ఎక్కడో మ్రోగింది.

రెండు నిముషాలు గడిచాయి. ఆ తర్వాత ఎవరో మెట్లు దిగి వస్తున్న చప్పుడు వినిపించింది.

తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా నిలబడిన మనిషిని నవ్వుతూ విష్ చేశాడతను "నమస్తే సార్"

"ఎవరు మీరు?" అడిగాడాయన.

"ఐయామ్ జాన్సన్....మీరు విశ్వపతిగారే ఐతే మీతో మాట్లాడటానికి వచ్చాను."

"అవును. ఏ విషయం గురించి."

"ఓ కారు గురించి."

"ఐసీ. రండి. మాట్లాడుకుందాం" అని విశ్వపతి

జాన్సన్‌ని మేడమీదకు తీసుకువెళ్ళాడు.

ఇద్దరూ ఓ గదిలోకి నడిచారు.

జాన్సన్ తెలుసుకోగలిగాడు విశ్వపతి తను కాలింగ్ బెల్ నొక్కినప్పుడు ఏం చేస్తున్నాడో.

ఆ గదిలో టేబిల్‌మీద ఓ పెద్ద విస్కీబాటిలు వుంది. సోడాలు, చిప్స్ సిగరెట్టుపెట్టె, లైటరూ వున్నాయి.

ఎదురెదురుగా కూర్చున్నారు.

"చెప్పండి" అన్నాడు విశ్వపతి రెండుగ్లాసుల్లో విస్కీ పోసి సోడా కలుపుతూ.

"మీరు ఓ కారు కావాలంటూ పేపర్లో వేసిన ప్రకటన చూసి వచ్చాను" అన్నాడు జాన్సన్.

"అవును. నాకు ఓ కారు అవసరం" అన్నాడు విశ్వపతి విస్కీగ్లాసును జాన్సన్‌కి అందించి.

"థాంక్స్." అన్నాడు జాన్సన్ గ్లాసు అందుకుంటూ.

సగం తాగారిద్దరూ.

చిప్స్ నవులుతున్నాడు విశ్వపతి.

జాన్సన్ సిగరెట్టు వెలిగించాడు.

"నా దగ్గర ఓ ఎంబాసిడర్ కారు వుంది. దాన్ని అమ్మదల్చుకున్నాను. ఇంతలోనే మీ ప్రకటన చూశాను."

"ఐసీ" అన్నాడు విశ్వపతి.

"మీకు ఇష్టమయితే మీరు ఆ కారును కొనవచ్చు"

"ఆల్‌రైట్. మీరు ఆ కారును ఎందుకు అమ్మదల్చుకున్నారో తెలుసుకోవచ్చా?" అడిగాడు విశ్వపతి సిగరెట్టు వెలిగిస్తూ.

"నాకు ప్రస్తుతానికి డబ్బు అవసరం. అప్పుల్లో మునిగివున్నాను. అవి అర్జంటుగా తీర్చెయ్యాలి."

"అర్థమయింది."

"కారును చూస్తారా?"

"ఎక్కడుంది?"

బయట! రోడ్డుమీద వుంది.

"చూద్దాం. ముందు ఈ బాటిలు ఖాళీ చెయ్యండి" అంటూ సీసాలో వున్న విస్కీని గ్లాసుల్లోకి వొంచి సోడా కలిపాడు.

మళ్ళీ ఇద్దరూ గ్లాసులు అందుకున్నారు.

విశ్వపతి బాగా తాగుతాడని సులభంగానే గ్రహించాడు జాన్సన్.

అతని చూపులు విశ్వపతి మీద వున్నాయి.

విశ్వపతి లావుగా వున్నాడు. పొట్టిగా వున్నాడు. బట్ట తల. ఎర్రగా వున్న కళ్ళు.

అరగంట తర్వాత తాగటం పూర్తయ్యింది.

"బయటకి వస్తారా?" అడిగాడు జాన్సన్.

"పదండి" లేచి నిల్చున్నాడు విశ్వపతి. అతను తూలుతున్నాడు.

ఎక్కువగానే తాగాడని తెలుసుకున్నాడు జాన్సన్.

"ఇంట్లో మీ వాళ్ళు లేరా?" నడుస్తూనే అడిగాడు జాన్సన్.

"లేరు. బంధువుల ఇంట్లో పెళ్ళికి వెళ్ళారు."

బయటకు వచ్చారు.

వీధిదీపం వెలుతురులో ఆగివున్న కారును చూశాడు విశ్వపతి.

కొత్తకారులా వుంది.

"కొని యెన్నాళ్ళయింది?"

"ఏడాది నిండలేదు."

"అప్పుడే యెందుకు అమ్ముతున్నారు?"

"చెప్పాను కదా. డబ్బు అవసరం."

"సారీ....మరచిపోయాను."

"కలర్ బావుంది. గ్రీన్ కలర్. నాకు ఇష్టం" అన్నాడు విశ్వపతి తృప్తిగా.

"థాంక్స్" అన్నాడు జాన్సన్.

"ఒకసారి డ్రయివ్ చేస్తాను."

"సర్టన్లీ" అన్నాడు జాన్సన్.

డోర్ తెరిచాడు.

స్టీరింగ్ వీల్ ముందు కూర్చున్నాడు విశ్వపతి. పక్కనే కూర్చున్నాడు జాన్సన్.

స్టార్టు చేశాడు విశ్వపతి.

ఎంబాసిడర్ చిన్నగా ముందుకు కదిలింది.

విశ్వపతి చేతులు వణుకుతున్నాయి. కారు రోడ్డుపక్కకు వెళుతోంది అప్పుడప్పుడు.

"దయచేసి కారు ఆపండి. మీరు డ్రయివ్ చెయ్యడం ప్రమాదం. మీ మీద విస్కీ తన ప్రభావాన్ని చూపిస్తోంది" జాన్సన్ అన్నాడు.

"అవును. మీరు డ్రయివ్ చెయ్యండి" అన్నాడు విశ్వపతి పక్కకు తప్పుకుని.

జాన్సన్ కారును సందు చివరకు తీసుకువెళ్ళి రివర్స్ చేసి మళ్ళీ విశ్వపతి ఇంటి ముందుకు తీసుకువచ్చాడు.

"వెల్....మనం లోపలకు వెళ్ళి మాట్లాడుకుందాం."

మళ్ళీ ఇద్దరూ లోపలకు వెళ్ళారు.

"మీ కారు నాకు నచ్చింది. ఇప్పుడు మనం బేరానికి వద్దాం. చెప్పండి. ఎంతకు ఇస్తారు?"

"నలభై వేలు."

"నలభై వేలా?"

"అవును."

"సారీ....నేను ముప్పయ్ వేలకంటే యెక్కువ ఖర్చు పెట్టదల్చుకోలేదు."

"ఆల్ రైట్. ముప్పయ్ వేలుకే తీసుకోండి. పదివేలు తక్కువయినా సరే నాకు డబ్బు అవసరం. నా అవసరం మీకు లాభించింది" అన్నాడు జాన్సన్ నవ్వుతూ.

"రేపు ఉదయం రండి. క్యాష్ ఇస్తాను."

"అలాగే. రేపు వుదయం పదిగంటలకు వస్తాను. కారు ఇక్కడే వుంచుతాను. నేను వచ్చేలోపల మీరు కొంత దూరం డ్రయివ్ చేసి చూడండి."

"థాంక్స్" అన్నాడు విశ్వపతి.

ఎంబాసిడర్ కీస్ ఇచ్చాడు జాన్సన్ అతనికి.

"ఇంతకు ముందు మీకు వున్న కారును ఎందుకు అమ్మేశారో తెలుసుకోవచ్చా?" అడిగాడు జాన్సన్.

"ఆ కారు నాకు కలిసిరాలేదు" చెప్పాడు విశ్వపతి.

"గుడ్ నైట్" అని వెళ్ళిపోయాడు జాన్సన్.

2

బెడ్ మీద పడుకున్నాడు విశ్వపతి.

అతనికి నిద్ర రావటంలేదు. నెలరోజుల క్రితం తన

కారు కింద పడిన మనిషి రూపం గుర్తుకు వచ్చింది.

ఆ సంఘటన గిర్రున అతని కళ్ళ ముందు తిరిగింది.

ఆ రోజు విశ్వపతి బార్ లోనించి బయటకు వచ్చేసరికి రాత్రి పది గంటలు దాటింది.

పీకల వరకూ తాగాడేమో అతను బాగా తూలుతున్నాడు.

కారులో కూర్చుని స్టార్టు చేశాడు. పది గంటలు దాటటంవల్ల రోడ్లు నిర్మానుష్యంగా వున్నాయి.

కారు రోడ్డుమీద మెలికలు తిరుగుతూ వెళుతోంది. వేగంగా వెళుతోంది కారు.

కారు మలుపు తిరిగింది.

విశ్వపతికి రోడ్డు చివర నడిచి వెళుతున్న మనిషి అస్పష్టంగా కనిపించాడు.

స్టీరింగ్ వీల్ మీద అతని చేతులు కదులుతున్నాయి. అతను కారు వేగం తగ్గించలేదు.

కారు ముందు నడుస్తున్న మనిషి దగ్గరకు వచ్చింది.

విశ్వపతికి శరీరమంతా గాలిలో తేలిపోతున్నట్టు అనిపించింది. స్టీరింగ్ కంట్రోలు తప్పింది.

ముందు నడుస్తున్న మనిషిమీదకు దూసుకుపోయింది. అతను ఎగిరి దూరంగా పడ్డాడు.

గట్టిగా బ్రేకులు నొక్కాడు విశ్వపతి. కారు ఎదురుగా వున్న గోడకు డాష్ ఇవ్వబోయి ఆగిపోయింది.

వెనక్కి చూశాడు విశ్వపతి కారు దిగకుండానే....ఆ మనిషి నెత్తురు మడుగులో గిల గిలా కొట్టుకుంటున్నాడు....

ఒక్క క్షణం అతన్ని చూసి కారును వేగంగా ముందుకు

దూకించాడు విశ్వపతి.

అతని మత్తు పూర్తిగా వదిలిపోయింది.

గబ గబా ఇంటికి వచ్చి కారు టైర్లకు అంటుకున్న రక్తాన్ని కడిగేశాడు. ఆ తర్వాత ఆ కారును తన దగ్గర వుంచుకోలేదు. అందుకే దాన్ని వారం రోజుల లోపలే వచ్చిన ధరకే అమ్మేశాడు.

3

ఉదయం ఎనిమిది గంటలకు డ్రస్ చేసుకుని ఇంట్లో నించి బయటకు వచ్చాడు విశ్వపతి.

ఇంటికి తాళం వేశాడు.

కార్లో కూర్చుని స్టార్టు చేశాడు.

బలంగా యాక్సిలేటర్ నొక్కాడు. చిన్న జర్కుతో ముందుకు దూకింది ఎంబాసిడర్.

ఆ రోడ్డు మలుపు తిరిగింది.

మెయిన్ రోడ్డుమీదకు మళ్ళింది.

అప్పటివరకు ఆ సందు మొదట్లో నిలబడి వున్న జాన్సన్ మోటార్సైకిల్ను స్టార్టు చేసి విశ్వపతి కారు వెనకే పోనిచ్చాడు.

ఒకవేళ విశ్వపతి వెనక్కు తిరిగి చూసినా జాన్సన్ని గుర్తుపట్టలేడు. జాన్సన్ వేషం మార్చుకున్నాడు.

విశ్వపతి కారును ఊరిబయటకు తీసుకువచ్చాడు. కారు స్మూత్గా దూసుకు వెళుతోంది.

వెనుకనే జాన్సన్ వెళుతున్నాడు.

విశ్వపతి సిగరెట్టు వెలిగించాడు.

ఉన్నట్టుండి అతనికి యెవరివో మాటలు వినిపించాయి కార్లోనించి.

"ఆశ్చర్యపడకు విశ్వపతీ....నా పేరు సుదర్శన్."

భయంగా కారంతా చూశాడు అతను. ఎవ్వరూ కనిపించ లేదు.

"నేను నీకు కనపడను. నాకు ఇప్పుడు రూపం లేదు. నే నెవరో కాదు. నీ కారుకింద పడి ఘోరంగా చచ్చి పోయిన మనిషిని...."

విశ్వపతికి చెమటలు పట్టాయి. మతిపోయినట్లని పించింది.

కారు వెళుతూనే వుంది.

"అమానుషంగా నన్ను చంపి ఏమీ తెలియనివాడిలా వెళ్ళిపోయావు. నిన్ను కూడా అలాగే చంపాలని అను కున్నాను. అందుకే జాన్సన్‌ని నీ దగ్గరకు పంపాను. జాన్సన్ నా ప్రాణస్నేహితుడు. అతనికి నా ప్లాను చెప్పాను. అతను తన కారును అమ్మదల్చుకున్నట్టు చెప్పాడు. అదంతా నిజం కాదు. నా పగ తీర్చుకోవటానికి వేసిన ప్లాను....ఇప్పుడు నువ్వూ నాలాగే చావబోతు న్నావ్."

"వద్దు....వద్దు....నిన్ను చంపాలని చంపలేదు...." అరిచాడు విశ్వపతి భయంగా.

కారు ఆగిపోయింది.

డోర్ తెరుచుకుంది. విసురుగా రోడ్డుమీదకు పడి పోయాడు విశ్వపతి.

వెనుకనే వస్తున్న జాన్సన్ ఆగిపోయాడు. తృప్తిగా నవ్వుకున్నాడు.

కారులోని టేప్‌రికార్డర్లని, విశ్వపతిని తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు బయలుదేరాడు. □

ఎమ్.వి.వి.సత్యనారాయణ

నల్లపిల్లి

అద్దం ముందు నిలబడింది జమున.

జమున శరీరం మీద టర్కిష్ టవలు తప్ప ఏమీలేదు. అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంది. టర్కిష్‌టవల్ కప్పని శరీర భాగాలు తడిసిన దంతంలాగా మిలమిలలాడు

టున్నాయి. వాటిమీద స్నానం చేసిన గుర్తుగా నీటి బిందువులు పాదరసంలాగా మెరుస్తున్నాయి.

గుండ్రటి మొహం, తీర్చిదిద్దినట్టున్న కనుముక్కు తీరు, నల్లని ఒత్తయిన జుత్తూ, కేశాలతో గుబురుగా కనిపించే అందమైన చెంపలూ, కలుసుకోబోతున్న దట్టమైన కనుబొమలూ, బింకమైన అవయవాలూ, చేతులకు బంగారు గాజులూ, చెవులకు రవ్వల దుద్దులూ:...అద్దంలోకి మరల తనని తాను చూసుకుంది జమున.

ఎర్ర అంచు పసుపు పచ్చటి టర్కిష్‌టవల్ తన శరీరానికి వింత అందం తెస్తోంది.

తన భుజాల మీదుగా అవతలి గోడకి వున్న ఫోటో వైపు చూచింది. ఆమెలో పెల్లుబుకుతోన్న వుత్సాహం జావగారిపోయింది.

ఆ ఫోటోలో యాభై అయిదు అరవై మధ్య వున్న ముసలాయన వున్నాడు. అతడి ప్రక్కన అపరంజిబొమ్మలాగా ఒక అభాగ్యురాలు తళతళలాడుతోంది.

ఆ అభాగ్యురాలు లోకుల దృష్టిలో "పెట్టి పుట్టిన జమున."

జమున నిట్టూర్చింది.

తారాచంద్‌లాంటి గొప్ప పారిశ్రామికవేత్త తన భర్త. అంతే తృప్తి! సడలిపోయిన అతని శరీరం తన కోరికల సెగల మీద కుండెడు చన్నీళ్ళు దిమ్మరిస్తోంది.

తారాచంద్ కోటీశ్వరుడు. తను అతడి రెండో భార్య అయితేనేం?

దేశంలో వున్న ప్రముఖ పారిశ్రామికవేత్తలలో ఒకడు. తరచుగా ఏదో ఒక దేశం అతడిని ఆహ్వానిస్తూనే వుంటుంది. క్రితం సంవత్సరమే తాను అతడితో జర్మనీ

తిరిగివచ్చింది.

జమున వులిక్కిపడింది. గోడగడియారంవైపు చూచింది. సాయంత్రం అయిదూనలభై కావస్తోంది. ఆరు గంటలకల్లా తన భర్త యింటికి వస్తానన్నాడు. తామిద్దరూ కలసి చాల కాలం తర్వాత థియేటర్‌కి వెళ్ళబోతున్నారు.

తారాచంద్ భార్యగా తాను విమానంలాంటి కారులో దిగుతుంది. తన ఒంటినిండా బంగారం దిగేశాడు తారా చంద్. తన మెడలో వుండే రవ్వల నెక్లెసు ఒక్కటే మూడు లక్షలు చేస్తుంది.

ఒక పూట తింటే రెండోపూట పస్తుండవలసిన కుటుంబంలోంచి వచ్చింది తాను. తనలాంటి పూర్ లేడీకి యింతకంటే సౌభాగ్యం అబ్బుతుందంటే తాను చచ్చినా నమ్మదు.

జమున చక చక బట్టల బీరువాను సమీపించింది. పిడి పట్టుకుని తలుపు లాగింది. ఇది పూర్తిగా తన బట్టల బీరువా. తన భర్త తనకోసం యెన్ని చీరలు కొన్నాడో తనకే తెలియదు. జమున ఆకుపచ్చరంగుమీద ఎరుపూ పసుపూ కలగల్సిన లతలూ పూలూ వున్న చీరను ఎంచు కున్నది.

పది నిమిషాల్లో చకచక తయారయింది.

వాచీ అయిదూయాభై యేడు చూపిస్తోంది.

తారాచంద్ సమయానికి గొప్ప ప్రాధాన్యత ఇస్తాడు. తాను చెప్పిన వేళకి ఖచ్చితంగా ఎక్కడ కావాలంటే అక్కడ వాలతాడు. మరో మూడు నిమషాలలో తన ముందుంటాడు తన భర్త.

గదిలోంచి బయటకు వచ్చింది జమున. మెట్లు దిగి హాలులోకి ప్రవేశించింది. హాలులో నౌకరు కింద చతికిల

పడి క్షణాలు లెక్కపెడుతోన్నాడు. హాలుకి ప్రక్కగా బిజి నెస్ వ్యవహారాలు చూసుకునే ఆఫీస్ గది.

గదిలోకి తొంగిచూచింది.

మేనేజర్ శర్మగారు తల వొంచి లెక్కలు కూడు కుంటూ కనిపించారు. ఆయన బల్లమీద రెండు టెలిఫోన్లు ఉన్నాయి.

జమున ఆ గదిని దాటింది.

పోర్టికోలో హారన్ వినిపించింది.

మరో క్షణంలో బూట్లు చప్పుడు చేసుకుంటూ తారా చంద్ హాలులోకి వచ్చాడు. నౌఖరు లోపలకు పరుగెత్తాడు. తారాచంద్ కళ్ళు చికిలించాడు.

జమున మొహంలో జ్యోతులు వెలిగాయి. తారాచంద్ ఆమె భుజాలచుట్టూ చేతులు వేశాడు. ఆమెను నడిపించు కుంటూ ప్రక్క గదిలోకి తీసుకువెళ్లాడు. ఆ గదిలోంచి తోట, తోటచుట్టూ ప్రహరీగోడ కనిపిస్తున్నాయి.

జమున అతడి మెడ చుట్టూ తన బాహువులు బిగించింది.

"జమూ....అర్జంటుగా బోర్డ్ డైరెక్టర్లను సమావేశ పరచవలసి వచ్చింది. ఆరూ పదిహేనుకి మీటింగ్. మన హాలులోనే" అన్నాడు తారాచంద్.

జమున మూతి ముడుచుకుంది. బాహువులు దించింది.

ఆమె బుగ్గలను గోముగా ముద్దాడాడు తారాచంద్ కళ్ళ ద్దాలు తీసి.

"ప్లీజ్....తర్వాత వెళ్దాం. లక్షల రూపాయల బిజినెస్‌కి నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. ఇదంతా ఎవరికోసం? నీ కోసం...."

"మీ అమ్మాయి వకుళ కోసం కాదా?"

"వకుళ ఎంతో మంచిది జమూ...."

"నేను కాదన్నానా?"

"నువ్వూ వకుళా కలసి థియేటర్‌కి వెళ్ళండి!"

"అక్కరలేదు లెండి! వెళ్ళకపోతే ప్రాణాలు పోతాయా?"

"అది కాదు జమూ! పదిగంటలవరకూ మీటింగ్ వుంటుంది. బయటకు వెళ్ళాలని వుంటే కారు తీసుకు వెళ్ళు" అని తారాచంద్ బయటికి నడిచాడు.

జమున నిరుత్సాహంగా మెట్లు ఎక్కి తన గది చేరుకుంది.

ఆమె తన గదిలోకి అడుగుపెడుతూనే అద్దం వద్దకు నడిచింది.

తారాచంద్ జరిపిన శృంగారంతో తన మేకప్ చెరిగిపోయింది. ముందుకు వొంగి పౌడర్ డబ్బా అందుకోబోయింది.

గదిలోని టెలిఫోన్ గణగణ లాడింది.

జమున చటుక్కున బల్లను సమీపించి రిసీవర్ యెత్తింది.

"హలో....జమునా తారాచంద్‌ని మాట్లాడుతున్నాను!" అంది.

అవతల పక పక నవ్వు వినిపించింది. ఆ నవ్వు బొంగురుగా వుంది. మౌత్‌పీస్‌కి అడ్డంగా జేబురుమాలు వంటిదేదో అడ్డం పెట్టుకుని అవతల మగవాడు నవ్వుతున్న నవ్వు అది!

జమున నుదురు చిట్లించి రిసీవర్‌లోకి చూచింది.

"ఎవరు నువ్వు? ఎందుకు నవ్వుతావు?" అరచింది జమున.

"గ్రుడ్డి తారాచంద్‌కి తెలియని నీ వొంటి సొంపులు నాకు తెలుసు!"

"ఎవరు నువ్వు?"

"ఎవరినయితేనేం? నీ శరీరంతో పరిచయం వున్న వాడిని!"

"ఏమిటా పిచ్చి వాగుడు?"

"పిచ్చివాగుడు కాదు జమునా! నీ స్నానం ఫోటోలు చూస్తావా?"

జమున నోరు నొక్కుకుపోయింది. స్నానం ఫోటోలా! అంటే తన నగ్నచిత్రాలా? అతడు యెలా తీయగలిగాడు?

"జమునా! నాకు నీ శరీరం కావాలి! ఫోటోలు యెలా వచ్చాయని నువ్వు అనవసరంగా ఆలోచించక! బుర్ర పాడవుతుంది!"

"నా బాత్‌రూంలో కెమెరా అమర్చావా? ఎలా సాధ్యం?"

"కాలకూట విషానికి విరుగుడు వుంది. డబ్బుకి లొంగే మనుషులు వున్నారు. లాడ్జి సాగర్ రూం నెంబర్ అరవై. బయలుదేరు."

జమునకి చెమటలు పడుతున్నాయి.

తమ గదులన్నీ ఎయిర్ కండిషన్డ్ గదులు! అయితే యేం? వాటి చల్లదనం శరీరానికి తోచడంలేదు!

"ఎందుకు?" గొంతు బొంగురుపోయింది.

"పిచ్చిదానా! ముసలాడు చూపించలేని స్వర్గం నీకు చూపిస్తాను. తినబోతూ రుచి అడగడం యెందుకు?"

"రాకపోతే?"

"రాకుండా వుండలేవు!"

"ఏం?"

"నీ నగ్నచిత్రాలు తీసుకోవడానికయినా వస్తావు! రక రకాల భంగిమలలో ముద్దు వస్తున్నావు!"

జమునకి శరీరమంతా తేళ్ళు ప్రాకుతున్నాయి.

"నా భర్తకి చెబుతాను. ఆయన నీ మీదకు పోలీసులను తరుముతారు. సాగర్‌లో పట్టుబడతావ్!"

అతడు పక పక నవ్వాడు.

"ఆల్‌రైట్! ఫోటోలు నీ భర్తకే అమ్ముకుంటాను. యాభై లక్షలు చెల్లించి అయినా వాటిని కొనుక్కుంటాడు! అంత బాగా వచ్చాయి!"

జమునకి చెమటలు కారుతున్నాయి.

ఆమె చటుక్కున ఫోన్ పెట్టేసింది. మూసిన గది గుమ్మం ముందు ఎవరో తారట్లాడుతున్నారు. గుమ్మానికి పై భాగంలో వున్న అద్దంలో కనిపిస్తోంది.

ఆమె తలుపు తెరచింది.

జమున ఆమెను చూచి నిట్టూర్చింది. మసుళ లోపలికి వస్తోంది. ఆమె మెరుపు తీగలాగా కదులుతోంది.

"పిన్నీ! నా ఫోన్ పని చేయడంలేదు!" అన్నది క్రెడిల్‌ని సమీపించి.

జమున గుండెల నిండుగా గాలిని పీల్చుకుంది.

తల వూపి ప్రక్కకు తప్పుకుంది.

2

"సూరజ్!" మత్తుగా అంది మసుళ. దూరంగా బీచ్.

సముద్రపు గాలి మెల్లగా ఆమె కురులను రేపుతోంది. ఆమె ఒంటికి రాసుకున్న సుగంధ ద్రవ్యాలను మత్తుగా పీల్చాడు సూరజ్.

"ఏం?" అన్నాడు సూరజ్.

"ఎంత కాలం యిలా?"

"ఏం? సుఖంగా లేదా?"

"ఏం సుఖం! భయం! భయం!"

"..................."

"నీకేం మగవాడివి! నెల తప్పితే...."

"తప్పదు!"

"నీకు తెలుసా?"

"నేను వెసెక్టమీ చేయించుకున్నాను!"

వకుళ అతడి ఒడిలోంచి మెల్లగా లేచింది. అతడిని నిర్ఘాంతపోయి చూస్తోంది.

"నిజమా!"

"అవును. నీ శరీరం యిచ్చే సుఖం కంటేనా?"

"అంటే మనకి భవిష్యత్తులో కూడా పిల్లలు పుట్టరన్న మాట!"

"విషానికి కూడా విరుగుడు వుంది!"

"అంటే....మరల ఆపరేషన్ చేయించుకుంటావన్న మాట!"

సూరజ్ చటుక్కున లేచాడు. లాంజ్‌లోకి నడిచాడు. దూరంగా వస్తోన్న ఓడ దీపాలవైపు చూశాడు. చీకట్లో దీపాల భవంతిలాగా వుంది ఓడ!

వకుళ మంచం దిగింది. వెనుకపాటుగా వెళ్ళి అతడిని కౌగలించుకుంది. నగ్నంగా ఆమె ఒంటి ఎత్తుపల్లాలూ, నునుపూ అతడిని గిలిగింతలు పెట్టాయి.

"వకుళా!" అన్నాడు సూరజ్ వెనక్కి తిరిగి ఆమెను అందుకుంటూ.

ఆమె కిల కిల నవ్వుతూ అతడి ఒడిలో ఒదిగి పోయింది.

"మీ నాన్న మన పెళ్ళికి ఒప్పుకోడు. ఎలా?"

అన్నాడు సూరజ్.

"నువ్వు బిజినెస్‌ను వృద్ధిలోకి తీసుకురా? నేను మాట్లాడుతాను కదా!"

"అంటే నీ దయాదాక్షిణ్యాల మీదనే మన పెళ్ళి ఆధార పడింది. అంతే కదూ!" ఆమెను ముద్దు పెట్టుకున్నాడు సూరజ్.

నిముషాలు ఎలా గంటలయాయో వాళ్ళకి తెలిసేసరికి రాత్రి పదయింది. వకుళ దుస్తులు తొడుక్కుని లేచింది.

"పదయింది! డైరెక్టర్ల మీటింగ్ అయిపోయి వుంటుంది ఈ పాటికి!" అంది వకుళ.

"వద్దు వద్దు అంటోంటే మీ నాన్నకి కోట్ల రూపాయిలు వచ్చి పడుతున్నాయి. నాకు వేల సంఖ్యలో కూడా రావు! దురదృష్టం!" అన్నాడు సూరజ్.

"ఈ వకుళ నీదయినపుడు కోట్లు నీవి కావా?"

అయిదు నిమిషాలలో యిద్దరూ హోటలులోంచి బయట పడ్డారు.

సూరజ్‌ను జగదాంబా సెంటర్‌లో దింపి వకుళ కారును వాల్తేరు అప్‌లాండ్స్‌లోకి త్రిప్పింది.

బ్లూలైట్ భవనం ముందు కారు ఆపింది వకుళ. హారన్ కొట్టింది.

గూర్ఖా గేటు తెరిచాడు.

కారు లోపలికి వెళ్ళింది.

పోర్టికోలో మేనేజర్ శర్మగారు కనిపించాడు.

"నాన్నగారు మీ కోసం అడిగారమ్మా!" అన్నాడు శర్మ.

వకుళ తల వూపి కారు తాళం చెవులు తీసుకుని భవనం

లోపలకు అడుగుపెట్టింది. తన గదిలోకి పరుగెత్తింది. శరీరం తేలికగా వుంది!

తారాచంద్ ఆమెవంక చూశాడు. కళ్ళద్దాల వెనుక గాజు గుడ్లు!

"నువ్వు ఎప్పుడు విచ్చేస్తావా అని నీ గదిలో వెయిట్ చేస్తున్నాను వకుళా!" అన్నాడు తండ్రి.

"డాడీ! నాతో పని వుందా?"

"అవును."

"ఏమిటి డాడీ?"

"లాడ్జి సాగర్‌కి నువ్వు సూరజ్‌తో వెళ్ళవలసిన పని ఏమిటి?"

"డాడీ! మీకు ఎవరు చెప్పారు!"

"నెలరోజులుగా నువ్వు వెళ్తోన్నావు. నాకు ఎప్పటి కప్పుడు సమాచారం అందుతోంది. నువ్వే మేలకువ తెచ్చుకుంటావని ఎదురుచూశాను."

వకుళ తల వొంచుకుంది.

"అమ్మా, వకుళా! తల్లిలేని నువ్వే నాకు అన్నినూ. సూరజ్ గురించి చాల చెడ్డ మాటలు విన్నాను తల్లీ!"

"డాడీ! సూరజ్ చాల మంచివాడు! నువ్వంటే వినయం!"

"నిన్ను పెళ్ళి చేసుకోవడానికి అతడికి నా మీద వినయం వుండనక్కరలేదు. నిన్ను జీవితాంతం తన ప్రాణంలాగా చూసుకోగలగాలి!"

"సూరజ్‌మీద నాకు ఆ నమ్మకం వుంది డాడీ!"

"నమ్మకం ఒక్కటే చాలదు తల్లీ! ఆ నమ్మకానికి విచక్షణ కావాలి."

"డాడీ! నా కోరిక మన్నించు!"

కళ్ళద్దాల వెనుక తారాచంద్ కనుగ్రుడ్లు మిల మిల లాడాయి.

తన కూతురికి తానంటే భయభక్తులున్నాయి.

తారాచంద్ వకుళ తల నిమిరాడు. "అతన్ని నువ్వు మర్చిపోక తప్పదు తల్లీ!"

3

భోజనం చేసి వచ్చిందన్న మాటే కానీ జమునకి తృప్తిగా లేదు. భర్త తన గదిలో నిద్రపోతున్నాడు.

జమున తన గదికి లోపలనుండి తాళంవేసి మంచాన్ని సమీపించింది. పరుపు క్రింద చెయ్యిపెట్టి తడిమింది. కవర్ బయటికి వచ్చింది.

కవర్‌ను మంచంమీద బోర్లించింది. బిల బిల లాడుతూ కార్డుసైజు ఫోటోలు పరుపుమీద పడ్డాయి.

జమున తన అరచేతులతో మొహాన్ని కప్పుకుంది. ఆ ఫోటోలు తను నగ్నంగా స్నానం చేసేటప్పుడు తీసినవి. సూర్యుడు కూడా చూడని శరీరం లోయలు ఫోటోల్లో ప్రముఖంగా ఎక్స్‌పోజ్ అయ్యాయి. జమున తల విది

లించింది.

తాను అతడికేం అపకారం చేసింది?

తనకి ఫోన్ చేసిన వ్యక్తి ఎవరు? తన ఫోటోలను అతడు ఎలా తీయగలిగాడు? ఫోటోల వెనుక బాక్‌గ్రౌండు తన బాత్‌రూం. అంటే బాత్‌రూంలోనే రహస్యంగా ఆటోమాటిక్ కెమేరా అమర్చివుంటాడు.

అది చాల శక్తివంతమైన కెమేరా అయివుండాలి!

తనకి అతడినుండి టెలిఫోన్ రాగానే వకుళను గదిలో వదలిపెట్టి తాను క్రిందకు వెళ్ళింది. ఒక్కొక్కరుగా బోర్డు డైరెక్టర్లు వస్తున్నారు. తన భర్త వాళ్ళను రిసీవ్ చేసుకుంటున్నాడు. పదివంటల వరకూ తనకి తన భర్తతో పని లేదు. ఆయనకీ తానున్నట్టు గుర్తు రాదు.

కంపెనీ వ్యవహారాలపట్ల తన భర్తకున్న అవధానం అటువంటిది! జమున బయటికి నడిచి కారు బయలుదేర తీసింది.

లాడ్జి సాగర్ కోలాహలంగా వుంది. అతడు రూం నెంబర్ అరవైలో వుంటాడా? ఇపుడు తాను పోలీసులకు ఫోన్ చేస్తే ఏం చేయగలడు?

మెయిన్ హాలు దాటి పై అంతస్తుకి వెళ్ళబోయింది జమున.

"అమ్మగారూ!" అన్నాడు బట్లర్.

జమున అతడిని విడ్డూరంగా చూచింది.

"అమ్మగారూ! మీరు వస్తే రూం నెంబర్ అరవై తాళంచెవి మీకు యివ్వమని చెప్పారు!" అన్నాడు అతడు.

"ఎవరు?"

"తారాచంద్‌గారట!"

అతడిని సూటిగా చూచింది.

"తారాచంద్ ఎలా వుంటారు?"

బట్లర్ తల గోక్కున్నాడు.

"యాభై కీ అరవై కీ మధ్య వయసు వుంటుంది. కళ్ళద్దాలు, దంతపు ఫ్రేము, ముందు రెండు పళ్ళు బంగారంవి. కాఫీకలర్ సూట్ వేసుకున్నారు. కాళ్ళకి అంబాసిడర్ షూ."

"చత్వారం వుందా?"

"అవునమ్మగారూ!"

ఆగంతకుడు తాను పట్టుబడకుండా జాగ్రత్తపడుతున్నాడు. అచ్చంగా తన భర్త వేషంలో వచ్చి రూం బుక్ చేశాడు. తన భర్తే అలా చేయడం అసంభవం. ఏమో....తనకి మతి పోతుంది!

"నువ్వు తాళం యివ్వవలసింది నాకేనని నీకు ఎలా తెలుసు?"

"ఆయన మీ ఫోటో ఇచ్చారు. పది రూపాయలు బక్షీస్ కూడా!" అతను తన జేబులోంచి ఫోటో తీసి చూపించాడు.

అది తన స్టాండింగ్ స్టిల్! ఫోటోలో తాను బట్టలు కట్టుకుంది.

బట్లర్‌వద్ద తాళంచెవి అందుకుంది జమున. రూం నెంబర్ అరవై తాళం తీసి లోపలకు అడుగుపెట్టింది.

చుట్టూ చూచింది. గదిలో తను ఒక్కతే వుంది. తలుపు దగ్గరగా వేసింది.

గదిలో అప్పటికే జీరో బల్బు వెలుగుతోంది. జమున పెద్ద బల్బు వెలిగించబోయింది. జీరో బల్బు ఆరిపోయింది. చటుక్కున తలుపువద్దకు నడచింది. కీ హోల్ లోంచి చూచింది.

హోటలంతా అంధకారం! కరెంటు ఫెయిలయిన ట్టుంది.

సరిగ్గా అప్పుడే ఎవరో తలుపు తట్టారు.

జమున తెగించింది. చటుక్కున తలుపు తెరచింది. అతడు సుడిగాలిలా లోపలికి వచ్చాడు. ఆమె నోరు నొక్కి తలుపు మూశాడు. రెండు నిమిషాలపాటు ఆమెను గోడ వద్దకు తీసుకువెళ్ళి అణచి వుంచాడు.

జమున భయంతో తారెత్తిపోయింది. ఆమెను అతడు మంచంమీదకు తోసి మీద పడ్డాడు. జమున అతడిని ప్రతి ఘటించబోయింది. ఫలితం లేకపోయింది.

పది నిముషాలు కాలం స్థంబించింది.

అతడు మెల్లగా మంచం దిగాడు. ఆమె చేతిలో కవర్ పెట్టాడు. మౌనంగా తలుపు తెరిచాడు. చీకట్లో బయటకు నడిచాడు.

జమున అటే పిచ్చిగా చూస్తూండిపోయింది.

ఇతడు తన భర్త కాదు. ఇతడి శరీరం బిగువు లేదు.

జమున ఆలోచనలు కట్టిపెట్టి హోటలులోంచి బయటకు వచ్చింది.

తాను తప్పు చేసింది. తనకి తెలియకుండానే తనని తప్పులోకి ఈడ్చాడు. ముక్కూ మొహమూ తెలియని వాడెవడో తనని పూర్తిగా దోచుకున్నాడు.

కారులో యింటికి బయలుదేరింది.

జమున ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి నిట్టూర్చింది.

పరుపుమీది నగ్నచిత్రాలు ఆమెను వెక్కిరిస్తున్నాయి.

4

తారాచంద్ నిద్రలేచాడు. చేయి చాపి టీపాయ్‌మీద తడిమాడు. కళ్ళద్దాలు తగిలాయి. మొహానికి తగిలించుకుని

కళ్ళు చికిలించాడు. కొంతసేపటికి గది ఆకారం కనిపించ సాగింది. పరుపు దిగాడు. గదికి అటాచ్ చేసివున్న బాత్ రూంలోకి వెళ్ళబోయాడు.

టీపాయ్‌మీది ఫోన్ గణగణ లాడింది.

తారాచంద్ అటు నడిచాడు. రిసీవర్ అందుకున్నాడు.

"మిస్టర్ తారాచంద్!" గొంతు అస్పష్టంగా వుంది.

"ఎస్."

"నీ కూతురికీ, పెళ్ళానికీ లాడ్జిలవెంట తిరగవలసిన పని ఏమిటి?"

"నువ్వెవరు?"

"లాడ్జి సాగర్!" అవతల ఫోన్ క్లిక్‌మన్నది.

తారాచంద్ ఫోన్‌వైపు పిచ్చిగా చూశాడు.

తన కూతురు సాగర్‌లో సూరజ్‌ని కలుసుకుంది. అది తనకు తెలుసు. తన భార్య జమున లాడ్జికి ఎందుకువెళ్ళింది? ఆమెకూడా ఎవరినయినా పురుషుడ్ని మరిగిందా? తన కళ్ళు కప్పి ప్రణయం సాగిస్తోందా? నిన్నరాత్రి తాను డైరెక్టర్ల మీటింగ్‌లో ఇరుక్కుపోయాడు. అప్పుడే వకుళ సాగర్ లాడ్జికి వెళ్ళింది. జమున కూడా అప్పుడే వెళ్ళిందా?

వకుళ బయలుదేరిన కారువెంట మేనేజర్ శర్మగారు వెళ్ళి ఆమె విషయం తనకి చెప్పాడు.

జమునని ఎవరో ఫాలో అయారు.

తారాచంద్ మెల్లగా తన గదిలోంచి బయటకొచ్చాడు.

మెట్లు దిగి క్రిందికి వెళ్ళాడు.

వకుళ, జమున వంటయింట్లో వున్నారు. వంటవాడితో మాట్లాడుతున్నారు. వంటవాడు కాబేజి తరుగుతూ వూ కొడుతున్నాడు.

"నువు బయటికి వెళ్ళవోయ్!" అన్నాడు తారాచంద్.

వంటవాడు బయటికి నడిచాడు.

"మీ యిద్దరూ లాడ్జి సాగర్‌లో నిన్న ఆరున్నరనుండి రాత్రి పదిగంటలవరకూ గడిపారు. ఆ విషయం తెలిసిన ఆగంతకుడెవడో నాకు ఫోన్ చేశాడు."

తారాచంద్ మాటలు ఆ గదిలో పిడుగులు కురిశాయి.

జమున మొహంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు.

"జమునా! నువు ఎవడితో కులికావు?" అడిగాడు తారాచంద్.

జమున తన నోటిలో గుడ్డలు కుక్కుకుంది. మెల్లగా ఏడుస్తోంది. తారాచంద్ కళ్ళు చికిలించి యిద్దరినీ చూశాడు.

5

"అమ్మగారూ! అమ్మగారూ!"

జమున బద్ధకంగా ఆవులించి మంచంమీద నుండి లేచింది. వొళ్ళు విరచుకుంది. గుమ్మంవైపు నడిచి తలుపు తెరచింది.

బయట వంటవాడు! అతడి మొహంలో ఎక్కడలేని గాభరా.

"ఏం జరిగింది నాయర్?" అడిగింది జమున.

"వకుళమ్మగారు కనిపించడంలేదు" అన్నాడు వంటవాడు.

"ఒకగంట క్రితం నన్ను రూంకి భోజనం పట్రమ్మన్నారు. భోంచేశాక నాచేతికి ఒక కవర్ యిచ్చారు. అప్పుడు మధ్యాహ్నం పన్నెండయి వుంటుంది. మీచేతికి సాయంకాలం 6 గంటలకు యివ్వమన్నారు. ఒంటిగంట అవుతూనే నాకు భయం పట్టుకుంది. వకుళమ్మగారి గదికి వెళ్ళాను. ఆమె లేరు. అంతకుముందు నేను ఆమెకు భోజనం తీసుకువెళ్ళినప్పుడు పరుపుమీద సూట్‌కేస్

చూశాను. ఇప్పుడు గది అంతా వెతికినా సూట్‌కేస్‌లేదు.''

''కవర్ ఏది?'' అడిగింది జమున.

వంటవాడు ఆమెకు కవర్ అందించాడు.

జమున కవరు తెరిచి చూచింది. లోపల చిన్నకాగితం వుంది. కాగితంమీద వకుళ చేతిరాత!

జమున ఆత్రంగా చదివింది.

పిన్నీ! నేను సూరజ్‌తోకలసి వెళ్ళిపోతున్నాను. నాన్నగారి ఆస్తిపాస్తులకంటె నాకు ప్రేమే ముఖ్యంగా తోస్తోంది. ఏం జరిగినా అనుభవిస్తాను.

నీ ఆశీస్సులు కోరే

వకుళ.

జమున గాఢంగా నిట్టూర్చింది.

బూట్లు టకటక లాడించుకుంటూ తారాచంద్ లోపలికి వచ్చాడు.

''క్రింద ఆఫీసుగదిలో టాంగ్స్ పెట్టాను. ఎవరు తీశారు?'' అడిగాడు తారాచంద్.

''ఉదయం మేనేజర్‌గారు తీసి తనగదిలో పెట్టారు బాబూ!'' అన్నాడు వంటవాడు.

''ఏమండీ! వకుళ లేచిపోయింది?'' అంది జమున.

తారాచంద్ వులిక్కిపడ్డాడు.

''ఇదిగో-చీటీ రాసిపెట్టి మరీ పోయింది!''

''సూరజ్‌తోనా?'' తారాచంద్ గొంతు ఏడవడానికి సిద్ధంగా వుంది.

జమున తలూపింది. దగ్గరగా నిలబడింది.

తారాచంద్ చకచక టెలిఫోన్ వున్న బల్లవైపు నడిచాడు. నంబర్ డయల్ చేశాడు.

''అవును....లా అండ్ ఆర్డర్ టూటవున్ పోలీస్

స్టేషన్ రైటర్‌ని మాట్లాడుతున్నాను" అవతలినుండి విని పించింది.

* * *

నగరం నాలుగుమూలలా పోలీసులు వలపన్నారు. గడ్డి మేటులో సూది వెతికినట్టు వకుళను వెతకసాగారు. నగరంలో వున్న పోలీస్ సిబ్బంది కేవలం యిద్దరికోసం నాలు గ్గంటలపాటు లాడ్జిలనూ, ఆర్. టి. సి. బస్ స్టేషన్‌నూ గాలించి వదలిపెట్టారు. చివరకు వకుళ, ఆమె ప్రియుడు సూరజ్ నగరం దాటుతోండగా టాక్సీలో పట్టుపడ్డారు.

తారాచంద్ వాళ్ళిద్దరినీ పోలీస్ స్టేషన్‌లో కలుసు కున్నాడు. వకుళ తండ్రివంక పౌరుషంగా చూచింది.

తారాచంద్ ఆమెను సమీపించాడు. ఈడ్చి లెంపకాయ కొట్టాడు. వకుళ ఏడుస్తోంది.

"వీడిని ఒక దరువు వేయమంటారా?" అడిగాడు సబ్ ఇన్‌స్పెక్టర్. ప్రేమికులను పట్టుకున్నది అతడే! అతడి చేతిలోని లాఠీ గిరగిరా తిరుగుతోంది.

తారాచంద్ తలూపాడు. సూరజ్ గడగడలాడాడు.

ఇద్దరు కానిస్టేబుల్స్ అతడిని ఫుట్‌బాల్‌ను తన్నినట్టు తన్నుకుంటూ లోపలికి తీసుకువెళ్లారు.

సూరజ్ వెళ్ళిన దిశగా గుభీగుభీమని గుద్దులూ "అమ్మో చచ్చాను!" అన్న అరుపులూ మూలుగులూ వినిపిస్తున్నాయి.

వకుళ బయటకు పరుగెత్తి తారాచంద్ కారులో కూర్చుంది. తారాచంద్ పోలీసులకు కృతజ్ఞతలు చెప్పుకుని కారు ఎక్కాడు.

6

తారాచంద్ హాలులోంచి ఆఫీసురూంలో ప్రవేశించాడు. మేనేజర్ శర్మగారు ఫైళ్ళలో తల మునకలుగా వున్నాడు.

తారాచంద్‌ను చూసి లేచి నిలబడ్డాడు మేనేజర్ శర్మ గారు.

"శర్మా! నా ఆఫీసుగదిలోని టాంగ్స్ తీశారా?" అడిగాడు తారాచంద్, కళ్ళు చికిలించి గదిని పరిశీలనగా చూచి.

శర్మ తలూపి, ప్రక్కగదిలోకి నడిచాడు. ఆ ప్రక్కగది తారాచంద్ వ్యక్తిగతంగా వాడుకునే ఆఫీస్‌గది! ఆఫీస్‌గదికి వెనక నుండి కూడా మెట్లువున్నాయి. ఆ మెట్లు మీదుగా హాలులోకి రావచ్చును. అయితే ఆ దారి తారాచంద్ తప్ప ఎవరూ వాడరు.

ఆ గది మిగతా గదులకంటె నేలమట్టం తక్కువగా వుండేటట్టు కట్టించుకున్నాడు తారాచంద్. అందుకే హాలులోకి రావడానికి నాలుగు మెట్లు కట్టించవలసి వచ్చింది. అంటే మిగతా గదులకంటె ఆ గది నాలుగుమెట్లు లోతు అన్నమాట.

శర్మగారు ఆ మెట్లవరుసకి ప్రక్కగా గోడకి ఆనించిన టాంగ్స్‌తీసి తారాచంద్‌కి యిచ్చాడు.

"ఈ టాంగ్స్‌ని దేనికి తెచ్చారు?" అడిగాడు శర్మ గారు.

తారాచంద్ మెల్లగా నవ్వాడు.

"నా దృష్టిదోషాన్ని కనిపెట్టుకునేందుకు టాంగ్స్‌తో ఒక వస్తువును పట్టుకుంటాను. దాన్ని దూరంగా వుంచి ఏమాత్రం స్పష్టంగా కనిపిస్తుందో పరిశీలిస్తాను. స్పష్టంగా కనిపించే టంతవరకూ వస్తువును కంటికి దగ్గరగా జరుపు కొంటాను."

శర్మగారు నిట్టూర్చాడు.

"కళ్ళులేని జీవితం దుర్భరం! ఊహించుకోలేక పోతు

న్నాను'' అన్నాడు.

తారాచంద్ తన టేబులువద్ద కూర్చున్నాడు. టాంగ్స్‌ని టేబులుకు ఆనించాడు.

"చీకటి పడిపోతున్నట్టుంది, వెళ్ళిరా!"

శర్మగారు ఆయనకి తాళం చెవులు అప్పగించి వెళ్ళిపోబోయాడు.

"ప్రయివేట్ డిటెక్టివ్‌ని ఎవరినయినా పిలిపించమన్నాను."

"అవును, ఉత్తరం రాశాను. వస్తాడు."

"విశాఖపట్నంలో డిటెక్టివులే కరువా?"

"డిటెక్టివ్ శిరీష్ అని మన నగరంలోనే వుంటున్నాడు. ప్రస్తుతం నగరంలో లేడు. అతడి కేంప్ అడ్రసుకి వుత్తరం రాశాను. రేపు వుదయం తొమ్మిది గంటలకు సరిగ్గా మనని కలుసుకోమని రాశాను."

"వెరిగుడ్! నువు వెళ్ళిరా!"

మేనేజర్ శర్మగారు ఆయనకి గుడ్‌నైట్ చెప్పి బయటకు వెళ్ళిపోయాడు. తారాచంద్ లేచి బయటకువెళ్ళి నౌకరుని పిలిచాడు.

నౌకరు వచ్చాడు. ఆఫీసుగదులకు తాళంవేయించాడు. తాళం చెవులు తీసుకున్నాడు. జమున గదికి వెళ్ళాడు తారాచంద్.

"జమూ! నీకు కావలసినవన్నీ అమర్చిపెడుతున్నప్పుడు నువు లాడ్జిలవెంట తిరగడంలో అర్థంలేదు" అన్నాడు తారాచంద్.

"ప్లీజ్, ఆ విషయం మర్చిపోండి. నేను యేమీ చెప్పలేను. నాకయి నేనుమాత్రం ఏం తప్పు చేయలేదు. నన్ను నమ్మండి!" అన్నది జమున.

"ఆల్‌రైట్! ఎవరు తప్పుచేశా రన్నది తర్వాత తెలుస్తుంది!"

"ఏమండీ! లాడ్జి సాగర్‌లో రూం నెంబర్ అరవయి మీ పేరనే బుక్ అయింది. తెలుసా?"

"జమునా! కట్టుకథలు కూడా నేర్చుకున్నావన్నమాట!"

"లేదండి. బట్లర్‌కూడా మీవంటి...." జమున మాటలు ఆపింది. ఆమెకళ్ళు పెద్దవయాయి. నోరు తెరుచుకుంది.

పందిరి మంచం మీదనుండి కెమెరా వ్రేలాడుతోంది. క్లిక్ క్లిక్‌మన్న చప్పుళ్ళు చాల నెమ్మదిగా వినిపిస్తున్నాయి. దాని లెన్స్ పరుపుమీద కేంద్రీకరించి వుంది.

జమున చటుక్కున పందిరిమంచం ఎక్కింది. కెమెరాను లాగింది. దానికి కట్టిన తాడు పుటుక్కున తెగింది.

"ఏమిటి జమూ?" అడిగాడు తారాచంద్, కళ్ళు చికిలించి.

జమున కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి.

"మీకు తెలియదా? ఆటోమేటిక్ కెమెరా?"

తారాచంద్ నిర్ఘాంతపోయాడు. "ఎవరిదా కెమేరా?"

"మీరు నియోగించిన మనిషిది!"

"పిచ్చిదానా! ఏమిటి నువు మాట్లాడేది?"

"అవును, నా బాత్‌రూంలో ఈ కెమేరాను అమర్చారు. నా నగ్నచిత్రాలు సంపాయించారు. ఇప్పుడు మన కలయకకి సంబంధించిన చిత్రాలు తీయాలని చూశారు. మీకు కాకపోతే మన ఇంటిలో ఈ రకంగా దొంగఫోటోలు తీయగలిగే అవకాశం ఎవరికీ వుండదు!"

"జమూ! ఏం జరిగిందో వివరంగా చెప్పు!"

భర్తను ఎకసక్కెంగా చూచింది జమున.

"నా నగ్నచిత్రాలతో ఎవడో ఆగంతకుడు ఆటలాడు

కుంటున్నాడు. వాడు ఆ చిత్రాలను నాకు యివ్వడానికే లాడ్జి సాగర్‌కి రమ్మన్నాడు. మీరు స్వయంగా బుక్ చేసిన గదిలో వాడు నన్ను....” జమున గొంతు పెగలలేదు.

తారాచంద్ మంచం మీద కూలిపోయాడు.

జమున తల త్రిప్పింది. వకుళ తలుపులకి అమర్చిన గాజు పలకలోంచి లోపలకు చూస్తోంది.

జమున తలుపు తెరచింది.

వకుళ ఆమెను కౌగలించుకొని బావురుమంది.

తన చేతిలోని కవరును పిన్నికి అందించింది.

జమున కవర్ తెరిచింది. తళతళలాడే ఫోటోలు జారి క్రిందపడ్డాయి. జమున వాటిని పరిశీలనగా చూచింది.

ఆ ఫోటోల్లో వకుళ రకరకాల భంగిమల్లో వుంది. తనను తీసిన మాదిరిగానే వాటినికూడా స్నానాలగదిలో తీశారు!

7

డిటెక్టివ్ శిరీష్ డాట్సన్ కారు ఆపాడు.

విశాలమైన రోడ్డుకిప్రక్కగా పెద్దబంగళా ముందు గూర్ఖా వున్నాడు. చుట్టూ ఎత్తయిన ప్రహరీగోడ, గేటుకి బ్లూ లైట్ అన్నపేరూ దానిప్రక్క తారాచంద్, ఇండస్ట్రియలిస్ట్ అనే అక్షరాలూ కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నాయి. ప్రహరీ గోడ వెనకనుండి ఆవరణలోని అశోకవృక్షాలు కనిపిస్తున్నాయి.

డిటెక్టివ్ శిరీష్ వాచీ చూసుకున్నాడు. ఉ॥ 8-55.

శిరీష్ ఆలోచిస్తూనే హారన్ కొట్టాడు.

గూర్ఖా ఉలిక్కిపడి లేచి నిలుచున్నాడు. శిరీష్ కారుని స్టార్ట్‌చేసి అతడికి ప్రక్కగా ఆపాడు.

“ఎవరు కావాలి సాబ్?” అడిగాడు గూర్ఖా.

"తారాచంద్‌గారిని కలుసుకోవాలి."

"ఉత్తరం తీసుకువచ్చారా?"

డిటెక్టివ్ శిరీష్ నుదురు చిట్లించాడు.

"ఏ ఉత్తరం?"

"మేనేజర్ శర్మగారు మీకు పంపిన ఉత్తరం!"

శిరీష్ కోటుజేబులో చేయిపెట్టి ఉత్తరం తీసి చూపించాడు. గూర్ఖా తృప్తిగా తలాడించాడు. గేటు తెరిచాడు. డాట్సన్ కారు లోపలికి వెళ్ళింది.

పోర్టికోలో కారు ఆపాడు శిరీష్.

నౌకరు పరుగెత్తుకు వచ్చాడు.

"ఉత్తరం తెచ్చారా సార్!" అడిగాడు నౌకరు.

"మీ మేనేజర్‌గారు మనిషికంటె ఉత్తరానికే ఎక్కువ విలువ ఇస్తోన్నట్టున్నారు."

"అవును సార్! తారాచంద్‌గారి ఆజ్ఞ."

"అంటే, ఉత్తరం చూపించనిదే లోపలకు వెళ్ళనివ్వవన్నమాట!"

శిరీష్ ఉత్తరం చూపించాడు.

నౌకర్ కారు తలుపు తెరిచాడు.

డిటెక్టివ్ శిరీష్ హాలులో అడుగుపెట్టాడు. విశాలమైన హాలు. చీమ చిటుక్కుమన్నా వినిపించే నిశ్శబ్దం.

"ఆ ప్రక్కగదిలో వున్నారు అయ్యగారు" అన్నాడు నౌకర్.

శిరీష్ అటు నడిచాడు.

ఆఫీస్‌గది తలుపు దగ్గరగా వేసివుంది. గది గుమ్మానికి ఎస్. వి. శర్మ, మేనేజర్ అని రాసివుంది.

నౌకర్ గదితలుపు తట్టాడు.

"లోపలకు పంపించు!" అన్నమాటలు లీలగా వినిపిం

చాయి.

నౌకరు గుమ్మానికి ప్రక్కగా నిలబడ్డాడు. ఎయిర్ ఇండియావారి మహారాజులా తలుపునెట్టి శిరీష్‌కి దారి చూపించాడు.

డిటెక్టివ్ శిరీష్ లోపలకు అడుగుపెట్టాడు. గడియారం తొమ్మిది కొట్టింది.

గదిలో లైటింగ్ తక్కువగా వుంది. శిరీష్ కళ్ళు పెద్దవి చేసుకు చూశాడు. నీట్‌గా అమర్చిన ఆఫీస్ గది.

గదిలో రాక్స్, టేబులూ, దాని ముందు నాలుగు కుర్చీలూ, టేబిలు వెనుక వున్న కుర్చీలో ముసలాయన కూర్చుండి వున్నాడు.

"థాంక్యూ మిస్టర్ శిరీష్! ఉత్తరం అందగానే ఖచ్చితంగా వచ్చారు" అన్నాడు ముసలాయన శిరీష్ కూర్చున్న తర్వాత—

"నో మెన్షన్. నా డ్యూటీ అది! మీరు తారాచంద్ గారా!"

ముసలాయన నవ్వాడు.

"నన్ను మీరు యింతవరకూ చూచి వుండలేదంటే ఆశ్చర్యంగా వుంది!" అన్నాడు తారాచంద్, కళ్ళు చికిలించి.

"ఆశ్చర్యం ఏంలేదు. అవసరం కలగలేదు అంతే!" అన్నాడు డిటెక్టివ్ శిరీష్, అతడిని పరీక్షగా చూస్తూ.

తారాచంద్ వయసు యాభైకీ అరవైకీ మధ్య వుంటుంది. కాఫీ కలర్ సూట్ వేసుకున్నాడు. దంతం ఫ్రేము కళ్ళద్దాలు పెట్టుకున్నాడు. ముందు పళ్ళు రెండు బంగారంతో చేసినవి.

శిరీష్ తల వొంచి చూశాడు.

తారాచంద్ కాళ్ళు టేబులు క్రింద నుండి కనిపించడం లేదు.

"ఉత్తరం తీసుకు వచ్చారా?" అడిగాడు తారాచంద్ కళ్ళద్దాలు సవరించుకుంటూ లేచాడు. తడుముకుంటూ నడిచాడు.

గది తలుపులను లోపలనుండి తాళం వేశాడు.

"మిస్టర్ తారాచంద్! మీ ప్రవర్తన చాలా విడ్డూరంగా వుంది!"

"ఉత్తరం గురించి అంత పట్టింపు ఏమిటా? అనా?" పకపక నవ్వాడు తారాచంద్.

"మీరే డిటెక్టివ్ శిరీష్ అని నమ్మకం ఏమిటి?" అన్నాడు తారాచంద్ నవ్వడం ఆపి.

"అంటే మీరు గూర్ఖానూ, నౌకరునూ నమ్మరన్న మాట!"

"సమయం వస్తే డబ్బు యెంత పనయినా చేయిస్తుంది!"

శిరీష్ తన కోటు జేబులోంచి ఉత్తరం తీసి యిచ్చాడు.

తారాచంద్ ఆ ఉత్తరాన్ని కళ్ళకి దగ్గరగా పెట్టుకు చూశాడు.

"మీకు చత్వారం వుందా?"

"అవును" ఉత్తరం అందించాడు తారాచంద్.

"అయితే ఈ గదిలో డిమ్‌లైట్ ఏమిటి?"

"నా కళ్ళు ఈ రోజు నొప్పులుగా వున్నాయి.

శిరీష్ ఉత్తరాన్ని జేబులో పెట్టుకున్నాడు.

"మీకు ఎక్కడినుండి చెప్పాలో నాకు అర్థం కావడం

లేదు. నాకు మాత్రం జీవితం దుర్భరంగా వుంది! రోజూ ఆత్మహత్య చేసుకుంటున్నట్టుగా కల వస్తోంది."

"ఆత్మహత్యా! ఎందుకు?"

"చెబుతాను. రోజూ అదే కల! రెండు వారాల క్రితం కాబోలు స్టార్టయింది."

"కలలోని ఆత్మహత్యకి భయపడతారా?"

"రెండు వారాలుగా అదే కల రావడంలో అంతరార్థం ఏమిటి?"

"కల విషయమే నన్ను అడగదల్చితే నన్ను పిలిపించి తప్పు చేశారు."

"సైకియాట్రిస్ట్ కంటె మీరే నయం!"

"ఏం?"

"కలలో నేను పాయింట్ త్రీ టూ కాలిబర్ పిస్తోలుతో కాల్చుకు చచ్చిపోతున్నాను. చనిపోయాక టైము తెలుస్తోంది. ఆశ్చర్యం! సాయంకాలం నాలుగుగంటలకి— సరిగ్గా నాలుగు గంటలకే! ఒక్క నిముషం అటూ యిటూ లేదు. రెండు వారాలుగా ఇదే కల!"

"నిత్య జీవితంలో మీకు ఆత్మహత్య చేసుకోవాలనిపించే పరిస్థితులు ఎదురౌతున్నాయా?"

"నా భార్య స్నానంచేసే దృశ్యాలు ఎవడో ఆటోమాటిక్ కెమెరాతో ఫోటోగ్రాఫ్ చేశాడు. వాడే ఆమెను లాడ్జికి పిలిపించుకున్నాడు. నా పేర లాడ్జి సాగర్‌లో గదిని బుక్ చేశాడు."

"మీ భార్య పేరు?"

"జమున."

"మీ వయసునుబట్టి చూస్తే ఆమె ముసలావిడ అయి వుండాలి."

"సారీ చెప్పలేదు కదా! జమున నా రెండో భార్య."

"ఆమె వయసు?"

"పాతిక!"

"ఫోటోలు తీయగలిగిన వ్యక్తి మిమ్మల్నిగానీ ఆమెను గానీ బ్లాక్‌మెయిల్ చేశాడా?"

"లేదు."

"కేవలం ఆమెను శారీరకంగా పొందడానికే అతడు ఫోటోలు తీశాడా? చిత్రం!"

తారాచంద్ పిడికిలితో బల్లమీద కొట్టాడు.

"వాడిని మీరు పట్టుకోవాలి!"

"ఫోటోలు ఎలా తీయగలిగాడు?"

"ఆటోమాటిక్ కెమేరాతో—బాత్‌రూంలో ఏర్పాటు చేసివుంటాడు!"

"మీ యింట్లో మీకు తెలియకుండా ఫోటోలు తీయడమా?"

"అందుకే డబ్బుతో మా నౌకరునూ, గూర్ఖానూ వశం చేసుకున్నారేమోనని అనుమానం వస్తోంది."

"ఫోటోలు ఎలా అందించాడు?"

"లాడ్జి సాగర్‌లో జమున చేతికి యిచ్చాడు. అంతే కాదు జమున గదిలో పందిరి మంచానికి ఆటోమాటిక్ కెమెరాను ఫిక్స్ చేశాడు. అయితే జమున దాన్ని పసిగట్టింది."

"ఇలా అడుగుతున్నందుకు మరోలా భావించవద్దు. జమున వయసు పాతిక. మిమ్మల్ని డబ్బుకోసమే కదా పెళ్ళి చేసుకుని వుంటారు!"

"అవును."

"ఆమె యీ ఫోటోల నాటకం ఆడుతుండవచ్చు

నేమో!"

"ఎందుకు?"

"డబ్బుకోసం!"

తారాచంద్ నీరసంగా నవ్వి, "నా డబ్బు ఎవరు కట్టుకు పోతారు మిస్టర్ శిరీష్! కోట్ల రూపాయలున్నాయి. ఆమెకీ నా కూతురు వకుళకీ సగం సగం!" అన్నాడు.

"వకుళకీ జమునకి సత్సంబంధాలున్నాయా?"

"ఉన్నాయి."

"వకుళ ఎటువంటిది?"

"మంచిదే, కాని కుర్రతనం! సూరజ్ అనే కుర్ర వాడితో మొన్న లేచివెళ్ళిపోయింది!"

"సూరజ్‌కి యీ యింటికి వచ్చి పోయే అలవా టుందా?"

"లేదు. కనిపిస్తే గూర్ఖా అతడిని కాల్చి పారవేయ వచ్చు. నష్టపరిహారం నేను యిచ్చుకుంటాను!"

"జమునకి జరుగుతోన్న అఘాయిత్యం గురించేనా మీరు ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు కలగనడం?"

"అంతే అనుకుంటాను."

"పిస్తోలు మీదేనా?"

"అవును. .32 కాలిబర్."

"ఒకసారి మీ పిస్తోలు చూపిస్తారా?"

"తప్పకుండా!"

"మీ పిస్తోలు యెప్పుడూ బల్ల సొరుగులోనే వుంటుందా?"

"అవును."

"దాని స్థానం మార్చి చూడలేకపోయారా?"

"దానివలన ప్రయోజనం వుంటుందంటారా?"

"ఏమో!"

"మిస్టర్ శిరీష్! కథంతా విని నాతో జోక్ వేస్తున్నారా?"

"జోక్ చేయడమా?" తెల్లబోయాడు శిరీష్.

తారాచంద్ అతడిని విచిత్రంగా చూశాడు.

"నా భార్య శీలం కోల్పోయింది. ఆ విషయం జాగ్రదావస్థలో నన్ను బాధిస్తోంది. అంతే గాకుండా నిద్రలో సైతం నేను ఆత్మహత్య చేసుకునేలా నన్ను పురిగొల్పుతోంది. ఈ విషయంలో నేను .32 కాలిబర్ పిస్తోలును ఎంచుకున్నాను. మీరు ఈ విషయాన్ని సావధానంగా విన్నారు. విన్న తరువాత మీరు యిచ్చే సలహా ఏమిటి? కేవలం పిస్తోలును బల్లసొరుగులోంచి మార్చమని! మార్చినంత మాత్రాన నాలో ఆత్మహత్య చేసుకోవాలన్న కోరిక అణగారిపోతుందా? అది జోక్ గాక మరేమిటి?"

డిటెక్టివ్ శిరీష్ అతడిని చురుకుగా చూశాడు.

"నాకు టేబులు చూపిస్తారా?" అడిగాడు శిరీష్.

తారాచంద్ తల అడ్డంగా త్రిప్పాడు. చురుకుగా లేచి, గోడ వద్దకు నడిచాడు. గోడకి చెక్క బీరువా వుంది. దాని తలుపు తెరిచాడు. పై అరలోంచి టాంగ్స్ తీశాడు. శిరీష్ అతడిని పరీక్షగా చూశాడు.

రెండు పొడవుపాటి లోహపు కడ్డీలను మధ్యలో మెలిక వేసి, వెల్డింగ్ చేసి చివరలు తప్పటగా సాగగొట్టి ఆ టాంగ్స్‌ను చేశారు. పై అరలో మూలగా నల్లటి వస్తువు కనిపించింది శిరీష్‌కి.

తారాచంద్ చప్పున పై అర మూశాడు. టాంగ్స్‌ను బీరువాకి ఆన్చి నిలబెట్టాడు.

"మిస్టర్ శిరీష్! మీరు కేసును చేకప్ చేస్తున్నారా?"

అడిగాడు తారాచంద్.

"ఏ కేసు?"

"జమునని ఫోటోలు తీసి వేధించే వ్యక్తిని పట్టుకోవడం!"

"కేసు టేకప్ చేయను!"

"ఏం?"

డిటెక్టివ్ శిరీష్ లేచాడు.

"ఇందాక నేను జోక్ చేశానన్నారు. మీ కేసు టేకప్ చేస్తే అది మరీ పెద్ద జోకు అవుతుంది!"

"నాకు అర్థం గాలేదు!"

".32 పిస్తోలు ఎందుకు చూపించరు?"

"దానికీ మీరు కేసు టేకప్ చేయకపోవడానికీ సంబంధం ఏమిటి?"

డిటెక్టివ్ పళ్ళు బిగించాడు. వెనక్కి తిరిగాడు. గుమ్మాన్ని సమీపించాడు.

"తాళం తెరుస్తారా?"

"ఇటు చూడండి!"

శిరీష్ వెనక్కి తిరిగి చూశాడు.

తారాచంద్ చేతిలో పిస్తోలు నల్లగా నిగనిగలాడుతోంది. అది తనకి గురి పెట్టి వుంది.

"కాల్చుతారా?" అడిగాడు శిరీష్.

"అబ్బే! చూస్తానన్నారు కదా!"

"చూశాను కదా! తలుపు తెరవండి!"

తారాచంద్ మాట్లాడలేదు. పిస్తోలును బల్లమీద వుంచాడు. లేచి గుమ్మం దగ్గరకు వచ్చాడు జేబులోంచి తాళంచెవుల గుత్తి తీసి తాళం తెరిచాడు. శిరీష్ బయటకు అడుగుపెట్టబోయాడు.

"మిస్టర్ శిరీష్! మీరు మా శర్మ రాసిన పుత్తరం యిచ్చి వెళ్ళండి!"

శిరీష్ అతడికి పుత్తరం అందించి నిట్టూర్చాడు.

తారాచంద్ పిచ్చివాడయినా కావాలి, అతి జాగ్రత్తపరుడయినా కావాలి అనుకున్నాడు.

8

టెలిఫోన్ మ్రోగింది.

ఆలోచనలలో వున్నవాడల్లా శిరీష్ అనాలోచితంగా రిసీవర్ ఎత్తి "హలో...." అన్నాడు.

అవతల క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్ కంఠం వినిపించింది.

శిరీష్ ఆలోచనలు తెగిపోయాయి.

"బ్లూ లైట్ కా? తారాచంద్ కేమయింది?" అడిగాడు శిరీష్.

"అతడికి ఏమవుతుందో నీకు తెలుసా?" ఎదురు ప్రశ్న వేశాడు కుమార్.

శిరీష్ తనని తారాచంద్ కలుసుకోమని శర్మచేత ఉత్తరం రాయడం మొదలుపెట్టి విషయం టూకీగా చెప్పాడు.

"మై గుడ్‌నెస్! అయితే అతడు కలలో మాదిరిగానే పిస్తోలుతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు!"

శిరీష్ ఆశ్చర్యంగా తలవేశాడు.

"నేను బయలుదేరుతున్నాను" శిరీష్ రిసీవర్‌ను క్రెడిల్ మీద వుంచాడు. వాచీ చూసుకున్నాడు. సాయంకాలం 4 : 15.

వాక్సెస్ బయలుదేరింది. వాత్తేర్ అప్‌లాండ్స్‌వైపు పరుగులు తీస్తోంది.

బ్లూలైట్ ముందు చాల పోలీసు జీపులూ, ఎంతోమంది జనం, కారులూ, గందరగోళంగా వుంది.

ప్రముఖ పారిశ్రామికవేత్త తారాచంద్ అస్తమయం!

శిరీష్ తన కారును వాటికి కాస్త యివతలగా ఆపాడు.

జనాన్ని తప్పించుకుంటూ బ్లూలైట్‌లో అడుగుపెట్టాడు.

హాలులో కుమార్ నిలబడి ఎవరెవరినో ఇంటరాగేట్ చేస్తున్నాడు.

శిరీష్ నిట్టూర్చాడు. తాను ఉదయం తొమ్మిదిగంటలకు యిక్కడికి వచ్చేసరికి ప్రశాంతమైన వాతావరణం! ఇప్పుడో! మృత్యువు ఈ వాతావరణంలో తన మంచు చేతులతో ఆడుకుంటోంది. తారాచంద్ తనతో చాల విచిత్రంగా ప్రవర్తించాడు. తాను కేసు టేకప్‌చేసినా అతడు ఈపాటికి ఇంకా బతికివుండేవాడేమో....

అతడు తనతో అనవసరంగా ఘర్షణ సృష్టించుకున్నాడు.

ఎందుకు?

"దిసీజ్ డిటెక్టివ్ శిరీష్...." అంటున్నాడు కుమార్ తనని సమీపించి.

శిరీష్ ప్రక్కకి చూశాడు.

కుమార్ ప్రక్కగా ముగ్గురు నిలబడి వున్నారు.

"శిరీష్! వీరు తారాచంద్‌గారి మేనేజర్. శర్మగారు!"

శర్మ నమస్కారం చేశాడు.

శిరీష్ అతడిని పరిశీలనగా చూశాడు. శర్మగారికి యాభై సంవత్సరాలలోపు వుంటాయి. నెరిసిన చెంపలు, తెలివైన కళ్ళు, కొనదేలిన పెద్ద ముక్కు, ఖద్దరు పంచె, ఖద్దరు చొక్కామీద వెయిస్ట్ కోటు వేసుకున్నాడు. కాళ్ళకి పల్చటి అకు చెప్పులు.

"వీరు రాజ్, మోహన్ అని పత్రికా విలేఖరులు. తారాచంద్‌ను తమ ట్రేడ్ అండ్ కామర్స్ పత్రికలో పరిచయం చేయాలని వచ్చినవాళ్ళు!"

నమస్కార ప్రతినమస్కారాలు అయ్యాయి.

"మిస్టర్ శిరీష్! చాల దురదృష్టకరమైన సంగతి! ఆయనను పత్రికలో పరిచయం వేయించాలని మా పత్రికల గ్రూపు జనరల్ మేనేజర్ పట్టు పట్టి మమ్మల్ని పంపించారు. మేము యిక్కడుండగానే ఆయన మృత్యువును కౌగలించుకుంటారని యెలా వూహించగలం?" అన్నాడు రాజ్.

ఆయన ఆంగ్లం స్వచ్ఛంగా వుంది.

శిరీష్ తలూపాడు. కుమార్‌వైపు సాభిప్రాయంగా చూశాడు.

"పద! శవం వున్న గదిలోకి వెళ్దాం!" అన్నాడు కుమార్, ఆఫీసు గదివైపు దారితీస్తూ.

డిటెక్టివ్ శిరీష్ అతడివెనుక శర్మ గదిలో అడుగు పెట్టారు.

ఆ గది ఉదయం తాను చూసినట్టే వుంది.

వెనుక గది తారాచంద్ ఆఫీస్ గది. ఆ గదిలోకి వెళ్ళే గుమ్మం తెరచి వుంది. ఇద్దరూ ఆ గదిలోకి ప్రవేశించారు. రెండు గదులకూ మధ్యగుమ్మం తప్ప మరే మార్గమూ లేదు. తారాచంద్ గది నేలమట్టానికి నాలుగడుగుల దిగువగా వుంది.

తారాచంద్ గదిలో నేలమీద టాంగ్స్ పడివుంది. టాంగ్స్‌కి రెండడుగుల దూరంలో తారాచంద్ పప్పకూలి పోయి వున్నాడు. చాకలి బట్టలమూటలాగా ముందుకు వాలి పోయాడు. అతడి రెండుచేతులూ గుండెప్రాంతంలో

వున్నట్టు శరీరభంగిమ చెబుతోంది. శవం శరీరం మీద కాఫీకలర్ సూట్ వుంది. శవంక్రింద నేలమీది కార్పెట్ లోకి రక్తం యింకుతోంది.

శవానికి అటుప్రక్క టేబులు వుంది. టేబులుక్రింద పిస్తోలు నల్లగా నిగనిగలాడుతోంది.

".32 కాలిబర్ పిస్తోలు" అన్నాడు కుమార్.

శిరీష్ తల పంకించి, "ఉదయం ఆయన నాకు చూపించిన పిస్తోలు అదే. అయితే ఈ గదిలో కాదు. ముందు గదిలో" అన్నాడు.

"నువు ఈ గదిలోకి అసలు రాలేదా?"

"రానివ్వలేదు."

"శర్మగారి గదిలోనే మాట్లాడి పంపించేశాడా?"

"అవును."

"శవాన్ని ఫోటోలు తీయించుతాను."

"అలాగే వేలిముద్రలు కూడా."

"అలాగే."

శిరీష్ బయటికి నడిచాడు.

రాజ్, మోహన్ అతడి కోసం ఎదురుచూస్తున్నారు.

"మీరు ఇక్కడికి ఎన్నిగంటలకు వచ్చారు?" అడిగాడు డిటెక్టివ్ శిరీష్. ముగ్గురూ హాల్లో సోఫాలలో కూర్చున్నారు.

"మధ్యాహ్నం రెండుగంటలకు ఆయన మాకు ఎంగేజ్‌మెంట్ యిచ్చారు. అప్పటినుండీ యిక్కడే వున్నాం" అన్నాడు మోహన్ తన భుజానికి వున్న కుమేరాను సర్దుకుంటూ.

"మీతో తారాచంద్ మాట్లాడుతూ కూర్చున్నారన్న మాట!"

"ఆయన మాటలను మేము టేప్‌లోకి ఎక్కిస్తున్నాం. ఏవో రిఫరెన్సులు కావలసివచ్చి మధ్యమధ్య తనగదిలోకి వెళ్ళివస్తున్నారు. మేనేజర్ శర్మగారు సమయానికి లేకుండా పోయారని తారాచంద్ విసుక్కున్నారు."

"తారాచంద్ చివరిసారిగా తన గదికి యెన్నిగంటలకు వెళ్ళారు?"

మోహన్, రాజ్ మొహాలు చూసుకున్నారు.

"మూడున్నరకి!" అన్నారు యిద్దరూ ఒకేసారి.

శిరీష్ నుదురు చిట్లించాడు.

"ఆ తర్వాత ఆయన తిరిగి హాలులోకి రాలేదన్న మాట!"

"రాలేదు."

శిరీష్ ఆలోచనలో పడ్డాడు. తారాచంద్ అచ్చుగా తాను కలలో తన ఆత్మహత్యను చూచినట్టే ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అయితే అతడి ప్రాణం సరిగ్గా నాలుగుగంటలకు పోయివుండాలి.

అంటే ఈ అరగంటపాటు అతడు ఏం చేశాడు?

శిరీష్ చటుక్కున వారికి క్షమాపణలు చెప్పుకుని తారాచంద్ గదిలోకి వెళ్ళాడు.

శవాన్ని వెల్లకితలా పడుకోపెడుతున్నారు పోలీసులు.

"శవం కుడిచేతి వ్రేలిముద్రలు పిస్తోలుమీద వున్నాయి" అన్నాడు కుమార్.

శిరీష్ శవాన్ని పరీక్షగా చూశాడు.

కాఫీకలర్ కోటుకి గుండెప్రాంతంలో పెద్దరక్తం మరక వుంది. మరక మధ్యగా ఎర్రటి రక్తపుపిక్క అంటినట్టుగా రంధ్రం కనిపిస్తోంది.

శిరీష్ సాభిప్రాయంగా ఫోరెన్సిక్ ఛీఫ్‌వైపు చూశాడు.

"బులెట్ శరీరానికి లంబకోణంలో తగిలింది. గుండెకి సూటిగా తగిలి ప్రాణం వెంటనే పోయివుండాలి."

"లంబకోణంగానా?"

"పిస్తోలుమీద రెండో చేతి వ్రేలిముద్రలు వున్నాయా?"

శిరీష్‌ను ఛీఫ్ ఆశ్చర్యంగా చూశాడు.

"ఎందుకలా అడిగారు?"

"చెబుతాను. టాంగ్స్‌మీద వ్రేలిముద్రలు దొరికాయా?"

"లేవు. టాంగ్స్ క్లీన్‌గా వున్నాయి."

శిరీష్ నుదురు చిట్లించాడు. టాంగ్స్ అందుకున్నాడు. దాని చివరలో వస్తువును పట్టుకునే అంచుల్లో నల్లటి పోగులు కనిపించాయి. శిరీష్ వాటిని సేకరించాడు.

"అవి దూదిపోగులు!" అన్నాడు ఫోరెన్సిక్ ఛీఫ్.

"దూది నల్లగా వుండదు" అన్నాడు శిరీష్.

"అవును."

"శిరీష్! నీ ఉద్దేశ్యం ఏమిటో చెప్పు!"

"తారాచంద్‌కి ఈ టాంగ్స్‌ని పట్టుకుని వస్తువును కంటికి కొంతదూరంలో వుంచి తన దృష్టిశక్తిని పరీక్షించుకోవడం అలవాటు. తారాచంద్ పత్రికా విలేఖరులను హాల్లో సమావేశపరచాడు. మూడున్నరకి ఈ గదిలోకి వచ్చినట్టుగా తారాచంద్‌ను గురించి విలేఖరులు చెబుతూ వున్నారు. ఆ లెక్కన అతడు మరణించేవరకూ ఈగదిలో వుండిపోయాడు. బై దిబై! ప్రాణాలుపోయి ఎంతసేపయి వుంటుంది?"

"శరీరోష్ణం గది టెంపరేచర్‌కి సమానంగా వుంది. గంటలోపున అయివుండాలి ప్రాణాలుపోయి."

కుమార్ ఒంగి శవం మణికట్టుకి వున్న వాచీచూశాడు. అది పగిలిపోయివుంది. చిన్నముల్లు నాలుగుమీద వుంది.

పెద్దముల్లు వెనక్కి వంగిపోయింది.

"అంటే ప్రాణాలు సరిగ్గా నాలుగుగంటలకి పోయాయి. చిత్రం, అతడికి వచ్చిన కలలో కూడా అంతే!" అరిచాడు కుమార్.

"అరగంటపాటు తారాచంద్ ఒంటరిగా ఈ గదిలో ఏం చేశాడు. విలేఖరులను బయట కూర్చుండబెట్టి టాంగ్స్‌తో ప్రాక్టీస్ చేశాడా?"

"తారాచంద్ వింత మనిషి! సమయానికి యెక్కువ విలువ యిస్తాడని విన్నాను."

"అంటే ఖచ్చితంగా మూడున్నరకి టాంగ్స్‌తో ప్రాక్టీసు మొదలుపెట్టా డన్నమాట! కాని టాంగ్స్ దమీ వ్రేలిముద్రలు లేవు" శిరీష్ గది పరిశీలనగా చూశాడు.

"ఏమిటి వెతుకుతున్నావు?"

"టాంగ్స్‌మధ్య పట్టివుంచిన వస్తువు! నల్లటిదూదితో చేసిన వస్తువు."

శిరీష్ గదిలో కలియ తిరుగుతూ వెనక గుమ్మంవద్ద ఆగాడు. చటుక్కున తలుపులు తెరిచాడు. చిన్న నడవా వుంది. ఆ నడవా హాలులోకి దారితీస్తోంది. శిరీష్ నడవా లోకి వెళ్ళాడు. ఒకప్రక్కగా పైకి వెళ్ళడానికి మెట్లు, రెండోప్రక్కగా హాలులోకి దారి వున్నాయి. మెట్లక్రింద నల్లటి వస్తువు కనిపించింది.

శిరీష్ వొంగి దాన్ని అందుకున్నాడు.

అది నల్లపిల్లి. దూదితో తయారుచేసిన నల్లపిల్లి బొమ్మ!

శిరీష్ తిరిగి శవంవద్దకు వచ్చాడు.

అప్పుడే గదిలోకి హైహీల్సు చప్పుడు చేసుకుంటూ ఒక స్త్రీ వచ్చింది.

శవాన్ని చూచి బావురుమంది.

"మావారికి ఏమయింది?" అన్నదామె.

"మీరు జమునా?" అడిగాడు శిరీష్.

"అవును మావారు...."

"చనిపోయారు."

"ఈ ఉదయం బాగానే వున్నారు. ఇంతలో...." ఆమె చెంగు నోట్లో కుక్కుకుంది.

"ఉదయాన్నే మీరు ఎక్కడికి వెళ్ళారు?"

"నేనూ, వకుళా బయటికి వెళ్ళాం!"

"ఎన్ని గంటలకు?"

"ఎనిమిది గంటలకు?"

"వకుళ ఎక్కడుంది?"

"నా వెనుకనే తన కారులో వస్తోంది!" జమున మాట పూర్తికాలేదు. వకుళ ఆ గదిలోకి వచ్చింది.

"మీ నాన్నగారికి నల్లపిల్లులంటే యిష్టమా?"

"ఇష్టమా? నల్లపిల్లి అంటే ఆయనకి తగనిమంట!"

శిరీష్ చకచక హాలులోకి నడచాడు.

9

"శర్మ రెడ్‌హాండెడ్‌గా దొరికిపోయాడు. అతడి యింట్లో జమున నగ్నచిత్రాలతోబాటు నలభై లక్షల రూపాయల కాష్ దొరికింది. బాంకులకు వెళ్ళి నాలుగుసార్లుగా పదేసి లక్షల రూపాయలచొప్పున డ్రాచేశాడట! తారాచంద్ వేషంలో శర్మ బాగా యిమిడిపోయాడు!" అన్నాడు కుమార్.

శిరీష్ మెల్లగా నవ్వాడు.

"మెట్లక్రింద నల్లపిల్లి దొరికింది. సరిగ్గా అప్పుడే నాకు నేను ఉదయాన కలిసింది తారాచంద్‌ను కాదన్న

విషయం తోచింది. ఆ నల్లపిల్లిని నేను ఉదయాన శర్మ గదిలో చెక్కబీరువాలో పై అరలో చూశాను. అది మెట్ల కింద వుండవలసిన అవసరం ఏమిటి? తారాచంద్ దాన్ని టాంగ్స్‌కి పట్టించి ప్రాక్టీస్ చేసివుంటే అది మెట్లకిందికి ఎందుకువస్తుంది? పైగా టాంగ్స్‌మీద వేలిముద్రలు ఏవి" అన్నాడు శిరీష్.

"అంటే హత్యాక్రమం యిలా జరిగివుండాలి. మూడూ ముప్పయికి వెనుక నడవాలోంచి విలేఖర్లు చెప్పినట్టుగా తారాచంద్ తన గదిలోకి అడుగుపెట్టి వుంటాడు. లోపల తన గదిలో శర్మ దాక్కున్నట్టు ఆయనకి తెలియదు.

తన గదిలోంచి టాంగ్స్‌కి నల్లపిల్లిని తగిలించి గుమ్మంలో ఆడించి వుంటాడు శర్మ. తారాచంద్ పిల్లిని చూసి చిందులు తొక్కుతాడు. అతడికి పిల్లి అస్పష్టంగా కనిపిస్తోంది. పిల్లిలాగా చెలగాటమాడి నాలుగ్గంటలవుతూనే గురిచూచి పిస్తోలుతో పేల్చాడు శర్మ. అందుకే బులెట్ శరీరానికి లంబకోణంలో తగిలింది.

తరువాత కుడిచేతి వ్రేలిముద్రలు పిస్తోలు మీద అద్ది టేబులు క్రింద పడేశాడు. అటూయిటూ గదితలుపులుమూసి వుండటంతో పిస్తోలు పేల్చినశబ్దం బయటవున్న విలేఖరు లకు వినిపించలేదు. టాంగ్స్‌ను తుడిచి, నల్లపిల్లిని మెట్లకిందకు విసిరేశాడు. తిరిగి నడవాలోకి వున్న గుమ్మం తలుపులు లోపలినుండి మూస్తూ అటు రమ్మని విలేఖరులను పిలిచాడు.

తలుపు లోపలనుండి లాక్‌చేసి తనగదిలోంచి బయట పడి హాలువైపు తన గదికి లాక్‌చేశాడు. అప్పుడే బయట నుండి వచ్చినవాడిలాగా హాలు లోపలకు వచ్చాడు. విలేఖ రుల మాట మీద తన గదితలుపు తెరచి శవాన్ని వాళ్ళకు

చూపించాడు. వాళ్ళకు అతడి కల విషయం చెప్పి ఆత్మ హత్య చేసుకున్నట్టు నిర్ధారణ చేశాడు."

"గుడ్ లాజిక్. ఆత్మహత్య చేసుకున్నవాడికయితే పిస్తోలునుండి వెలువడే బులెట్ కుడిప్రక్కనుండి గుండెను తాకేది. బులెట్ ప్రయాణించే కోణం 60—80 డిగ్రీల మధ్య వుండేది. బొత్తిగా సూటిగా శరీరానికి గుచ్చుకునేది కాదు."

"తారాచంద్‌ను నువు చూసివుండలేదని తెలిసే శర్మ నిన్ను అతడికి కన్సల్టేషన్ ఏర్పాటుచేశాడు. ఏదో కారణం చెప్పి అతడిని ఫ్యాక్టరీకి పంపించి తాను తారాచంద్ వేషంలో నీతో మాట్లాడాడు. ఘర్షణ పెట్టుకుని నిన్ను పంపేశాడు."

"కరెక్ట్! అతడికి కావలసిందల్లా ఒకటే! తారాచంద్‌కి ఆత్మహత్య కలవస్తోన్నట్టు నేను నిర్ధారణ చేయాలి! అంతే!"

"ఆటోమాటిక్ కెమేరా ఫిక్స్ చేయడంలోనూ, గదిలోకి నిన్ను పంపడంలోనూ, నౌకర్ అతడికి సహకరించాడు.

"గుడ్, నౌకర్ అప్రూవర్‌గా మారాడన్నమాట!" నవ్వాడు డిటెక్టివ్ శిరీష్. □

పిసినారి-?

ఒక పిసినారి ఖైదీపై ఉరిశిక్ష కేసు నడుస్తుంది.

ఒక మంగలి వచ్చి, "గెడ్డం గీయించుకుంటారా?" అని అడిగాడు ఖైదులోవున్న ఆ పిసినారిని.

దానికతని జవాబు: "నా తల నాకు చెందుతుందో లేదో తేలేవరకూ దీనిమీద ఒక్కపైసా గూడా ఖర్చుపెట్టను."

—వి. శంకర్, పార్వతీపురం.

సీక్రెట్ గ్యాంగ్

'సికిందర్'

(గత సంచిక తరువాయి)

"నువ్వు పొరబడుతున్నావు!" మాస్టర్ కిల్లర్ మళ్ళీ అన్నాడు.

"వాటీజ్ దిస్ నాన్సెన్స్" భాటియా గాండ్రించాడు.

"కాదు! కాదు! ఇతను లాల్ కాదు!" తీవ్రంగా అంది గాయత్రి. ఆమె ముఖం అలసిపోయింది.

"అవును. కాదు!" జాన్ కూడా అర్చాడు హిస్టిరికల్‌గా.

"మరెవరు?" మాస్టర్ కిల్లర్ ముఖం ఎర్రబడింది.

జాన్, లాల్‌ని చూశాడు. అతని ముఖంలో ఇప్పుడు మార్పు కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

"చెప్పు జాన్—నేనెవర్నో చెప్పు."

జాన్ అందరివేపు తిరిగి అర్చాడు, "ఇతను నా పార్ట్‌నర్ కాంతిలాల్ కాదు. అతని తమ్ముడు శాంతిలాల్!"

"ఏమిటి రుజువు?"

"రుజువు?" పకపక నవ్వాడు శాంతిలాల్, "రుజువు కావాలా, యూ డర్టీ ఫూల్! అయితే చూడు!...."

శాంతిలాల్ తలమీది విగ్గుతీసి దూరంగా విసిరాడు. గుండ్రటి తల నున్నగా మెరుస్తోంది. వెంట్రుకలు లేవు.

అందరూ నిర్ఘాంతపోయారు.

"నేను డిటెక్టివ్ లాల్ కవల తమ్ముడు శాంతిలాల్‌ని. లాల్ కేసు సక్సెస్ కావాలని తిరుపతి కెళ్ళి మొక్కుకున్నాను. ఎలా వుంది గుండు?"

జాన్ వెన్నులో చలిపుట్టుకొచ్చింది. ఆ రోజు లాల్ తన తమ్ముడు తిరుపతి కెళ్ళాడని చెప్పాడు. ఇప్పుడతను తన పక్కన నిలబడి వున్నాడు!

గాయత్రి ఛటుక్కున ముందు కొచ్చి శాంతిలాల్ చెయ్యి లాక్కుంది. వణుకుతున్న పెదవులతో అస్పష్టంగా గొణిగింది: "డిటెక్టివ్ లాల్ కుడిచెయ్యి మణికట్టుమీద పుట్టుమచ్చ వుంటుంది. నా అనుమానం తీర్చుకోవాలి...."

"తీర్చుకో!"

ఆమె శాంతిలాల్ చెయ్యి చూసింది—కళ్ళు చీల్చి. నిస్పృహగా చెయ్యి వదిలేసి, "నువ్వు లాల్ తమ్ముడివి!" అంది.

జాన్ అనుమానం ఇప్పుడు పూర్తిగా బలపడింది!

ఇతను తన పార్ట్‌నర్ కాదు!

"ఆల్‌రైట్ ఫ్రెండ్స్" భాటియా అన్నాడు, ఆందోళన అణుచుకుంటూ, "మా స్థావరానికి రావడంలో మీ ఉద్దేశ్యం ఏమిటి?"

శాంతిలాల్ తేలిగ్గా నవ్వాడు: "లాల్ ఆజ్ఞమీద మేం ఇక్కడి కొచ్చాం. మీ స్థావరాన్ని నాశనం చేసి మిమ్మల్ని రెడ్‌హాండెడ్‌గా పట్టివ్వడానికి...."

అందరూ పగలబడి నవ్వారు.

శాంతిలాల్ ముఖం ఎర్రబడింది, "నవ్వండి! బాగా నవ్వండి! చివరిసారిగా తనివిదీరా నవ్వుకోండి! అవతల మీ అంతిమయాత్రకు సన్నాహాలు చేస్తున్నారు."

"ఎవరు?" భాటియా అన్నాడు వేళాకోళంగా.

"పోలీసులు—ఈ పాటికి లోయను ఆక్రమించుకుని వుంటారు. లాల్ ఆపరేషన్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఏ క్షణంలోనైనా ఈ సొరంగం పేలిపోవచ్చు. మీరూ మేమూ అందరమూ చచ్చిపోతాం!"

"లాల్ యిక్కడికి చేరుకున్నాడా!" నవ్వాడు మాస్టర్ కిల్లర్.

"అవును మిస్టర్! హోటల్‌లో నిన్ను చూశాక లాల్ నా దగ్గరికొచ్చి అతని స్థానంలో నన్ను పంపాడు. నువ్వు స్పృహ పోగొట్టింది నన్ను! బంధించి ఇక్కడికి తీసు కొచ్చింది నన్ను! మీ జీపును వెంటాడుతూ వచ్చి లాల్ పోలీసుతో మీ స్థావరాన్ని ఆక్రమించుకున్నాడు—"

"ఇంట్రెస్టింగ్" భాటియా అన్నాడు, "లాల్ ఈ స్థావ రాన్ని ఆక్రమించగలడు. అంతే. ఈ సొరంగానికి రహస్య మార్గముంది. అదెవరికీ తెలియదు. పోలీసులు స్థావరం మీద దాడి చేయడమే తరువాయి, మేమా మార్గంనుండి బయట

పడతాం—మీ ఇద్దర్నీ చంపేసి!"

"ఒకవేళ అతను బుకాయిస్తున్నాడేమో—" అంది నళిని.

"బుకాయించినా, నిజం చెప్పినా, తక్షణం ఇద్దర్నీ చంపెయ్యాలి!" అన్నాడు గౌతమ్ సక్సేనా.

నిర్లక్ష్యంగా వున్న శాంతిలాల్‌కేసి జాన్ భయం భయంగా చూశాడు.

శాంతిలాల్, జాన్ ఉనికిని మరిచిపోయినట్టు ప్రవర్తించడం అతని కాశ్చర్యంగా వుంది. ఏం జరగబోతోంది? శాంతిలాల్ ముఖంలో భయం గానీ, ఆందోళనగానీ ఏ మాత్రం లేవు! తన సోదరుడి ఆశయం కోసం ప్రాణా లర్పించడానికి సిద్ధంగా వున్నట్టు కన్పిస్తున్నాడు. మరి, తను?

అతనితోబాటే తనూ చావబోతున్నాడా?

శాంతిలాల్ అందర్నీ తీక్షణంగా గమనిస్తున్నాడు. క్షణాలు చకచక గడిచిపోతున్నాయి. ఒకసారి గడియారం చూసుకున్నాడు. పెదవులు చప్పరించాడు. ఆ తర్వాత భాటియాను చూసి కసిరాడు: "ఏమటి? మేం చావడానికి ఇంకా సమయం కాలేదా?"

అదే క్షణాన తలుపు తెరుచుకుని ఒక అస్సామీ పరుగెత్తి వచ్చాడు. అస్సామీలో ఏదో అర్చాడు.

భాటియా ముఖం కందిపోయింది. ఎలుగుబంటిలా విచిత్రంగా అరిచి, లేచి బయటికి పరిగెత్తాడు. నళిని ఒక్క క్షణం బిత్తరబోయి అతని వెనక వురికింది. గౌతమ్ సందేహించకుండా ఆమె వెనక వురికాడు. ఆ తర్వాత విచిత్రంగా అరుస్తూ విదేశీయులంతా పరుగుతీశారు—మాస్టర్ కిల్లర్‌తో సహా.

జాన్ కూడా పరుగెత్తబోయాడు కానీ, గాయత్రి చెయ్యి పట్టి వెనక్కి లాగింది. శాంతిలాల్ ఒక్క అడుగు ముందుకెయ్యకుండా చూస్తున్నాడు.

మళ్ళీ తలుపు తెరుచుకుంది. మాస్టర్ కిల్లర్ రివాల్వర్‌తో పరిగెత్తి వచ్చాడు. రివాల్వర్ గురిపెట్టి అరిచాడు:

"గాయత్రీ! బయటికెళ్ళిపో! టనెల్ నెంబర్ త్రీ దగ్గర బాస్ వున్నాడు. వాళ్ళంతా వ్యాన్ ఎక్కడానికి సిద్ధంగా వున్నారు. క్విక్!"

"ఎందుకు? ఏం జరిగింది?"

"పోలీసులు ఆక్రమించుకుంటున్నారు! వందలసంఖ్యలో వున్నారు. మన బలగం యెక్కువ లేదు! పారిపోవాలి!"

శాంతిలాల్ పక పక నవ్వాడు, "పూర్ ఫెలో! మమ్మల్ని ఎత్తుకొచ్చి ఎంత పొరపాటు చేశావు! మీ రెవరూ పారిపోలేరు!"

"షటప్! మిమ్మల్నిప్పుడు చంపుతున్నాను."

హఠాత్తుగా ట్రిగ్గర్ లాగాడు మాస్టర్ కిల్లర్. శాంతిలాల్ వేగంగా పక్కకి దూకి బుల్లెట్ దిశనుంచి తప్పించుకున్నాడు. మాస్టర్ కిల్లర్ మరోసారి ప్రేల్చాడు. జాన్ కూడా పక్కకి దూకి తప్పించుకున్నాడు. మాస్టర్ కిల్లర్‌కి మరో అవకాశం యివ్వకుండా చిరుతపులిలా దాడి చేసి రివాల్వర్ లాక్కున్నాడు. జాన్ విస్తుపోయాడు.

మాస్టర్ కిల్లర్ విచిత్రంగా అరిచి శాంతిలాల్ దవడ కింద గుద్దాడు. శాంతిలాల్ కింద పడ్డంతోనే అతని మీదికి దూకి కంఠం పుచ్చుకుని, మరో చేత్తో రివాల్వర్ లాక్కోడానికి ప్రయత్నించసాగాడు.

శాంతిలాల్ సంభాళించుకుని రివాల్వర్‌తో మాస్టర్ కిల్లర్ నుదుటిమీద కొట్టాడు. మాస్టర్ కిల్లర్ బాధగా

అరిచాడు. శాంతిలాల్ మరో దెబ్బ వేశాడు. మాస్టర్ కిల్లర్ తెచ్చిపోయి, ఆవేశంగా శాంతిలాల్ చెయ్యి కొరికాడు.

శాంతిలాల్ చేతిలో రివాల్వర్ పేలింది.

మాస్టర్ కిల్లర్ తల పట్టుకుని చావుకేక పెట్టి వెనక్కి పడిపోయాడు.

నేలమీద అతని తలచుట్టూ ఎర్రటి రక్తం మడుగు కట్ట సాగింది. గాయత్రి కెవ్వున అరిచింది.

జాన్ కొయ్యబారిపోయాడు. శాంతిలాల్ రివాల్వర్‌తో వగరుస్తూ లేచి, చెమట తుడుచుకున్నాడు.

ఇంతలో తలుపుమీద దబదబమని చప్పుడైంది. జాన్ ఉలికిపడి తేరుకున్నాడు. అంతకు ముందే శాంతిలాల్ తలుపు చేరుకున్నాడు. గడియ తీసి, తలుపు లాగి, సందే హించకుండా రెండుసార్లు ట్రిగ్గర్ లాగి అవతల గార్డ్‌ని నేలకూల్చేశాడు.

జాన్ విస్తుపోయాడు. శాంతిలాల్ వెనక్కి తిరిగి గాయత్రి దగ్గరికి వచ్చాడు.

"వెల్, బేబీ! చూశావుగా నా శక్తి సామర్థ్యాలు? ఇక నన్ను టనెల్ నెంబర్ త్రీ దగ్గరికి తీసికెళ్లు."

"నో!"

"కమాన్ బేబీ!" శాంతిలాల్ విగ్గు అందుకుని తలమీద పెట్టుకొని, గాయత్రి చెయ్యి పట్టుకుని లాగాడు. ఆమె ముందుకు తూలింది.

"చంపుతాను!" బెదిరించాడు శాంతిలాల్, "మాస్టర్ కిల్లర్ గతి కళ్ళారా చూశావుగా?"

ఆమె భయపడుతూ ముందుకు నడిచింది. శాంతిలాల్, జాన్‌లు ఆమెని అనుసరించారు. తలుపు తెరుచుకుని బయ

టికి వచ్చారు. పొడవాటి సొరంగ మార్గం మసక వెలుతురులో నిర్మానుష్యంగా కన్పిస్తోంది.

శాంతిలాల్ ఆమెని ముందుకి నెట్టాడు, "త్వరగా వెళ్ళాలి!"

ఆమె గాభరాగా, వేగంగా నడుస్తోంటే, హీల్ చెప్పుల ధ్వని ప్రతిధ్వనిస్తోంది.

ఎక్కడా చడీ చప్పుడు లేదు. గాయత్రి చెప్పుల శబ్దం విని సొరంగం మలుపులో నిలబడ్డ గార్డ్ అకస్మాత్తుగా ముందుకు వచ్చి స్టెన్ గన్ గురిపెట్టాడు.

గాయత్రి వూపిరి బిగబట్టి ఆగిపోయింది. వెనకనుంచి శాంతిలాల్ రివాల్వర్ ఆమె మెడకి ఆనించాడు.

"మమ్మల్ని బాస్ దగ్గరికి తీసికెళుతున్నట్టు చెప్పు!" గుసగుస లాడా డతను. ఈ మాటలు యాభై గజాల దూరాన వున్న గార్డ్‌కి వినిపించలేదు.

గాయత్రి గబ గబ పదడుగులు ముందుకేసి ఆగిపోయింది. గార్డ్‌తో, "బాస్ ఎక్కడ?" అంది.

"టనెల్ నెంబర్ త్రీ. ఎందుకు?" గార్డ్ స్వరంలో అనుమానం ఉట్టిపడింది.

"వీళ్ళని తీసికెళ్ళాలి."

శాంతిలాల్ తల తిప్పి జాన్‌ని చూశాడు.

"ఆ గార్డ్ బట్టలు నువ్వు తొడుక్కో గలవా?"

జాన్ కలవరంగా చూశాడు.

గాయత్రి ఉలిక్కిపడింది.

శాంతిలాల్ రివాల్వర్‌తో ఆమెని ముందుకు నెడుతూ జాన్‌తో గుసగుసలాడాడు, "కమాన్, బి ఎలర్ట్. మేం ముందు వెళతాం. నువ్వతని డ్రెస్ తొడుక్కుని వచ్చేయాలి."

జాన్ సమాధానం కోసం ఎదురుచూడకుండా గాయత్రితో ముందుకు నడిచాడు శాంతిలాల్. జాన్ కంగారుగా వెంబడించాడు.

ఇంతలో దూరంగా ఎక్కడో పోలీస్ సైరన్స్ విన్పించాయి.

"వాళ్లు సమీపిస్తున్నారు!" అన్నాడు గార్డ్.

శాంతిలాల్ గాయత్రితో గార్డ్ దగ్గరికి చేరుకోగానే విసురుగా రివాల్వర్‌తో తల వెనుక భాగం మీద కొట్టాడు.

గార్డ్ గట్టిగా మూల్గి, గన్ విడిచేసి ముందుకు పడ్డాడు.

"జాన్! త్వరగా!"

కిందపడ్డ గార్డ్‌ని చూసి జాన్ ఆలస్యం చెయ్యకుండా బట్టలు విప్పుకోసాగాడు. శాంతిలాల్ గాయత్రితో ముందుకు సాగిపోయాడు. జాన్ బట్టలు విప్పేసి గార్డ్ బట్టలు విప్పడానికి ముందుకు వంగాడు. అంతే—దూరంగా గబ గబ నడిచి వస్తోన్న గార్డ్స్‌ని చూసి, అండర్‌వియర్, బనియన్ మీదే వేగంగా పరిగెత్తాడు.

ఆ యిద్దరు గార్డ్స్ తెలివి తప్పిన గార్డ్‌ని చేరుకుని ఆశ్చర్యపడ్డారు.

"ఏం జరిగింది?"

"ఇతన్నెవరు కొట్టారు?"

పోలీస్ సైరన్స్ ఇంతా దగ్గరయ్యాయి.

"పోలీస్!" గార్డ్ అరిచాడు.

మరుక్షణం ఇద్దరూ వేగంగా పరిగెత్తారు. సొరంగం మలుపులో వున్న జాన్‌ని చూడలేదు. జాన్ ఇవతలికొచ్చి గబ గబ వేషం మార్చుకున్నాడు. ఆ తర్వాత స్టెన్‌గన్‌తో శాంతిలాల్ వెళ్ళిన దిశలో పరిగెడుతూ. బ్లూ డ్రెస్‌లో, ముఖం మీదికి లాగిన టోపీలో అతన్నెవరూ గుర్తింప

లేరు.

దూరంగా ఎక్కడో అరుపులు విన్పించాయి. బయట పోలీసులు అరుస్తున్నారు. కానీ—సొరంగంలో నిర్మాణుష్యంగా వుంది. అంతా ఒకేచోట చేరి పారిపోవడానికి సిద్ధంగా వున్నారు.

గాయత్రి గబ గబ నడుస్తూ గదులు దాటేస్తోంది. శాంతిలాల్ ఆమె వెనక అదే వేగంతో నడుస్తూ గదుల్ని పరిశీలిస్తున్నాడు—అమ్యూనిషన్ రూం—లాబరేటరీ—పవర్ రూం వగైరా....గాయత్రి చివరికి ఒక తలుపు దగ్గర ఆగింది. తలుపుపైన 'టనెల్ నెం. 3' అని బోర్డు వుంది. గదిలో ఎవరూ లేరు. అంటే అందరూ టనెల్‌లో వున్నారన్నమాట. గాయత్రి ఒక మీట నొక్కింది. షటర్ పైకి ముట్టుకుంది.

అవతల మరో గది వచ్చింది.

గదిలో ఎవరూ లేరు. గాయత్రి నిస్సహాయంగా చూసి నిట్టూర్చింది.

"ఏం జరిగింది?" శాంతిలాల్ అడిగాడు.

"బాగా ఆలోచించు శాంతిలాల్! నువ్వు టనెల్‌లో వెళ్ళకూడదు! వాళ్ళ దగ్గర గన్స్ వున్నాయి. నువ్వు చావడం నా కిష్టంలేదు!"

"వాళ్లు పారిపోవడం నీ కిష్టమా!"

"నేను నీ గురించి ఆలోచిస్తున్నాను!"

"నీ గురించి ఆలోచించుకో! నీ ప్రాణాలు నా చేతిలో వున్నాయి. నీకు చావడం ఇష్టమేనా?"

"లాల్!"

"కమాన్ బేబీ! మీట ఎక్కడ వుందో నొక్కు! క్విక్, సమయంలేదు!"

గది కవతల అకస్మాత్తుగా శబ్దం విన్పించింది. ఏదో వాహనం స్టార్ట్ అయిన శబ్దం.

శాంతిలాల్ ఉలిక్కిపడ్డాడు, "క్విక్! వాళ్ళు వెళ్ళిపోతున్నారు!"

జాన్ విసురుగా లోనికి వచ్చాడు. గాయత్రి కంగారుగా మీట నొక్కింది. తలుపు తెరుచుకుంది.

అదృష్టవశాత్తు గదిలో వెలుగు లేకపోవడంవలన అవతలి మనుషులకి యెవరూ కన్పించరు. అవతల పొడవాటి సొరంగ మార్గం వుంది. దాని అంతు కనుచూపు మేరలో లేదు. దీపాలు వెలుగుతున్నాయి. సుమారు రెండువందల గజాల దూరాన ఆగివున్న వ్యాన్ దగ్గర మనుషులు గుమిగూడి వున్నారు. కొందరు వ్యాన్ ఎక్కే ప్రయత్నంలో వున్నారు.

శాంతిలాల్ జాన్ భుజంమీద చెయ్యివేశాడు. జాన్ అతనికేసి చూశాడు.

శాంతిలాల్ అన్నాడు, "సమయం లేదు. వాళ్ళు బయలుదేరుతున్నారు. నువ్వు పరిగెత్తి వెళ్ళి చేరుకో!"

జాన్ స్టెన్‌గన్‌తో రేసు గుర్రంలా ముందు కురికాడు.

94

గజానంద్ భాటియా రెండు చేతులూ జాపి జాన్‌ని ఆపే ప్రయత్నం చేస్తూ అరిచాడు. "వాట్ హేపెండ్?"

అతనికి పదడుగుల దూరంలో ఆగిపోయాడు జాన్. భాటియా ప్రశ్నకి తక్కిన సమాధానం చెప్పాడు, "మాస్టర్ కిల్లర్‌ని చంపేశారు!"

"ఎవరు?"

"డిటెక్టివ్‌లు!"

"గాయత్రి ఎక్కడ!"

"ఆమె సహాయంతో వాళ్ళిక్కడికి వచ్చేస్తున్నారు!"

ఖాటియా అదిరిపడ్డాడు.

"లెటజ్ గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్!"

అతను ఎగిరి వ్యాన్‌లోనికి దూకాడు. జాన్ కూడా ఎక్కబోయాడు. కానీ ఖాటియా తోసేశాడు, "కేబిన్‌లో ఎక్కు!" అనర్చాడు. వ్యాను కదిలింది.

జాన్ పరిగెత్తి వెళ్ళి కేబిన్‌లో ఎక్కాడు. కేబిన్‌లో డ్రైవర్‌గాక మరో గార్డ్ వున్నాడు. జాన్ అతని పక్కన కూర్చొని గన్‌మీద చెయ్యి సిద్ధంగా వుంచాడు. అతని వొళ్ళు విపరీతంగా చెమట పట్టింది. తను పెద్ద గండాన్ని తప్పించుకున్నాడు—ఖాటియా తనని గుర్తించలేదు!

వ్యాను వేగం పుంజుకుని పురకసాగింది. దాని శబ్దం సొరంగంలో హోరెత్తిస్తోంది. జాన్ కళ్ళు మూసుకుని ఆలోచించాడు. పూర్తి ఆర్గనైజేషన్ ఇప్పుడు వ్యానులో వుంది. ఎక్కడికెళ్తున్నారు? తానేం చెయ్యాలి? బయట పోలీసులు దాడి చేస్తారా? కానీ యిది రహస్యమార్గం.

పది నిమిషాల తర్వాత జాన్‌కి తెలియకుండా వ్యాను సొరంగం దాటేసి సువిశాలమైన అడవిలోకొచ్చేసింది.

కారుచీకట్లో ఆకాశంలో నక్షత్రాలు వజ్రాల్లా మెరుస్తున్నాయి. చల్లటి గాలి రివ్వున వీచి వణుకు పుట్టిస్తోంది. డ్రైవర్ చాలా చాకచక్యం గలవాడు. ఎదురుగా వస్తోన్న రాళ్ళనూ, చెట్లనూ, అతి నేర్పుగా తప్పించుకుంటూ డ్రైవ్ చేస్తున్నాడు. ప్రక్కన కూర్చున్న గార్డ్ సూటిగా ముందుకు చూస్తున్నాడు.

వ్యానులో ఎవరూ మాట్లాడుకోవడంలేదు.

కేబిన్‌లో కూర్చున్న జాన్‌కి యెంత చెవులు రిక్కించినా వెనక మాటలు విన్పించడంలేదు. వెనుక ఖాటియా,

గౌతమ్, నళిని గాక కొందరు విదేశీ ఏజెంట్లు కూడా వున్నారు. వాళ్ళు గాక గార్డ్స్ యెందరున్నారో తెలీదు.

హఠాత్తుగా భాటియా అరుపు విన్పించింది:

"ఓహ్ గాడ్! హెడ్‌లైట్స్ కన్పిస్తున్నాయి! పోలీస్!"

డ్రైవర్ ఉలిక్కిపడ్డాడు. వెనుక స్త్రీ కంఠం అరిచింది. అది నళిని అని జాన్ పసిగట్టాడు. ఉన్నట్టుండి వ్యాన్‌లో కలకలం బయలుదేరింది. భాటియా అందర్నీ శాంత పరుస్తున్నాడు. డ్రైవర్ యింకా వేగం పెంచాడు.

జాన్ గుండెలు వేగంగా కొట్టుకున్నాయి:

శాంతిలాల్ వెంబడిస్తున్నాడా?

గజానంద్ గార్డ్స్‌ని చూసి మళ్ళీ అరిచాడు, "వాళ్ళు దగ్గరికి వస్తున్నారు—షూట్ చెయ్యండి!"

ఇద్దరు గార్డ్స్ నిలబడి వెనుక డోర్ తెరిచారు.

సుమారు అయిదువందల అడుగుల దూరాన హెడ్ లైట్స్ కన్పించాయి—ఒకటికాదు, రెండుకాదు, ఎన్నో జీపులు వెంబడిస్తున్నాయి.

రెండు వరసల్లో వస్తున్న పది పోలీసు జీపుల్లో, మొదటిదానిలో రివాల్వర్‌తో నిలబడ్డాడు శాంతిలాల్. అతని పక్కన గాయత్రి వుంది-పూర్తిగా పాలిపోయిన ముఖంతో.

"షూట్!" అర్చాడు భాటియా.

గార్డ్స్ చేతిలో గన్స్ మోగాయి. జీపులమీద గుళ్ళ వర్షం కురిసింది. కానీ గుళ్ళన్నీ గురితప్పి గాల్లోకి దూసుకెళ్ళాయి. ఒక్క క్షణం జీపులన్నీ ఆగిపోయి తిరిగి ముందు కురికాయి.

శాంతిలాల్ చేతిలో రివాల్వర్ మూడుసార్లు పేలింది. వ్యాన్‌డోర్‌లో నిలబడివున్న ఇద్దరు గార్డ్స్ గావుకేక

పెట్టారు. గన్స్ వదిలేసి, గుండెలు పట్టుకొని కిందపడ్డారు.

"ఓహ్, డామిట్!" అర్చాడు ఖాటియా, తొడ చరుచుకుంటూ.

మరో ఇద్దరు గార్డ్స్ డోర్ దగ్గరికి వచ్చారు. వెంటనే గుళ్ళవర్షం కురిపించారు. జీపులు చెల్లాచెదురయ్యాయి. గాయత్రి గట్టిగా అరచి వెనక్కి వాలిపోయింది. కాస్సేపటిలో స్పృహతప్పింది. శాంతిలాల్ మరో రెండు షాట్లు పేల్చాడు. కానీ గురి తప్పింది.

జాన్ గుండె వేగంగా కొట్టుకుంటోంది. డ్రైవర్ వేగం యింకా పెంచాడు. అడవి మార్గంలో వ్యాను విపరీతంగా కుదిపేస్తోంది. జాన్ పక్కన వున్న గార్డ్ ఫైరింగ్ విని గన్ సిద్ధంగా పట్టుకొని, జాన్‌ని చూశాడు. జాన్ తీవ్రంగా ఆలోచిస్తూ తటస్థంగా కూర్చున్నాడు.

వెనుక జీపుల్లో రెండు టైర్లు పగిలి ఆగిపోయాయి. అందులో వున్న ఇన్‌స్పెక్టర్లూ, కానిస్టేబిల్స్, మిగిలిన జీపుల్లో ఎక్కారు.

ఎదురుగా గుళ్ళు దూసుకొస్తున్నా వాటిని లెక్క చెయ్యకుండా శాంతిలాల్ స్వయంగా డ్రైవ్‌చేస్తూ బుల్లెట్స్ వృథా చెయ్యకుండా, గురి కుదిరినప్పుడే షూట్‌చేస్తున్నాడు. మంచిఫలితం కనిపిస్తోంది.

కొన్ని క్షణాల్లో ఆ ఇద్దరు గార్డ్స్ కూడా కూలిపోవడంతో ఖాటియా రెచ్చిపోయాడు. అతన్ని చూసి మరో ఇద్దరు గార్డ్స్ డోర్ దగ్గరికి వురికారు. కానీ ఖాటియా వారించాడు:

"షట్ ది డోర్!" ఆ తర్వాత గొంతు పెంచుకుని, "డ్రైవ్ ఫాస్ట్!" అనర్చాడు.

డ్రైవర్ వేగం యింకా పెంచాడు. చల్లటిగాలి ఈడ్చి

కొరడాలా కొడుతోంది జాన్ తేరుకున్నాడు. ఖణఖణమని శబ్దం చేసుకుంటూ, చీకటిగా వున్న అడవిలో అడ్డమార్గాల ద్వారా గమ్యానికి పరిగెడుతోన్న వ్యాన్ వెనుక జీపులు ఇప్పుడు చాలా దూరమయ్యాయి.

వ్యాన్‌లో అంతా ప్రాణాలరచేతిలో పెట్టుకుని కూర్చున్నారు. విదేశీయుల ముఖాల్లో ఎలాటి భావాలున్నాయో చీకట్లో కన్పించడంలేదు. వాళ్ళ గొంతు పెగిలి ఒక్కమాట రాలేదు. నళిని, గౌతమ్ కూడా అలాగే వున్నారు.

ఖాటియా దృఢమైన హస్తాల్ని తొడల మీద వుంచుకుని చీకటిలో కళ్ళు చీల్చి చిరుతపులిలా చూస్తున్నాడు. వెనుక ఫైరింగ్ శబ్దం విన్పించడంలేదు.

హఠాత్తుగా వ్యాను మలుపు తిరిగింది. ఆ వేగంతో మలుపు తిరగడంతో జాన్ గార్డ్‌ని గుద్దుకున్నాడు. గార్డ్ దవడ పట్టుకుని మూల్గాడు. జాన్ ఉలికిపడి కిటికీలోంచి తల బయటపెట్టి వెనక్కి చూశాడు—హెడ్ లైట్స్ కన్పించడంలేదు.

వ్యాను దట్టంగా వున్న చెట్లమధ్య నుంచి వురుకుతోంది. జాన్‌కి పరిస్థితి బోధపడింది—వెనుక జీపులు దారి తప్పాయి. హఠాత్తుగా అతని గుండెలు వేగంగా కొట్టుకో సాగాయి. ఇప్పుడేం చెయ్యాలి?

ఖాటియా నెమ్మదిగా లేచాడు. డోర్ దగ్గరికి వెళ్ళి గ్లాస్ ఎత్తి చూశాడు. చీకటి తప్ప ఏమీ కన్పించలేదు. వికృతంగా నవ్వి, ప్రమాదం తప్పినట్లు ప్రకటించాడు:

"ఫ్రెండ్స్ వాళ్ళు దారి తప్పారు. మళ్ళీ మనల్ని కనుక్కోడం వారి తరంకాదు. మరోఅరగంటలో ఎవరికీ అందకుండా మనం బొంబాయిలో వుంటాం. అక్కడ నుంచి మీరంతా మీమీ క్షేమకరమైన స్థలాలకి వెళ్ళిపోవచ్చు....

జరిగిన సంఘటనకి నేను చాలా విచారిస్తున్నాను. ఒక పొరపాటు ఈ అపాయాన్ని తెచ్చిపెట్టింది. అయినా మీరేమీ భయపడకూడదు—మన సంబంధాలు ఎప్పటిలా కొనసాగుతాయి. ఫోర్ ఏసెస్ ఆర్గనైజేషన్ శాశ్వతంగా వర్ధిల్లుతుంది!"

అందరూ తేలిగ్గా వూపిరి వదిలారు.

జాన్‌కి ఆతృత ఎక్కువవుతోంది. ఏదో ఒకటి చెయ్యాలి! వీళ్ళంతా పోలీసుల బారినుంచి తప్పించుకున్నారు. కాస్సేపటికి గమ్యం చేరుకుంటారు. అప్పుడు తానేమీ చెయ్యలేడు! పైగా తనకి ప్రమాదకరం!

నెమ్మదిగా తలతిప్పి గార్డ్‌ని చూశాడు. అతను సూటిగా ముందుకు చూస్తున్నాడు. చెయ్యి గన్ మీద వుంది.

ఒక్కక్షణం ఆలోచించకుండా జాన్ గన్‌తో గార్డ్ నెత్తిమీద కొట్టాడు. గార్డ్ గట్టిగా మూల్గి కిందపడ్డాడు. డ్రైవర్ కంగారుపడి చూశాడు. జాన్ గన్ గురిపెట్టి బెదిరించాడు:

"వ్యాన్ ఆపు!"

వెనుక ఎవరికీ విన్పించకుండా తగ్గుస్వరంతో అన్నాడు.

డ్రైవర్ బెదిరిపోయాడు.

"నువ్వు—నువ్వు—"

"వ్యాన్ ఆపు!"

"ఎందుకు?"

జాన్ ఛటుక్కున గన్ అతని తలకి ఆనించాడు:

"కమాన్, వ్యాన్ ఆపు!"

"ఆపను" అర్చాడు డ్రైవర్. వేగం యింకా పెంచి డ్రైవ్ చెయ్యసాగాడు. జాన్‌కి సహనం చచ్చింది.

"నీకే చెప్తున్నాను: ఆపకపోతే ఛస్తావు!"

"నాతోపాటూ నువ్వా...." డ్రైవర్ అన్నాడు నిర్ల క్ష్యంగా.

"మనతోపాటే—" జాన్ ఛటుక్కున ఆగిపోయాడు.

డ్రైవర్‌ని షూట్ చేస్తే....

జాన్ గిరుక్కున తిరిగి డోర్ హాండిల్ తిప్పాడు. డోర్ విసురుగా తెరుచుకుని గాలికి కొట్టుకుంది. జాన్ కిందికి చూశాడు. దట్టమైన పొదలున్నాయి. మధ్య మధ్య చెట్లున్నాయి.

మళ్ళీ తిరిగి డ్రైవర్‌ని చూశాడు. డ్రైవర్ యింకా వేగం పెంచి జాన్‌ని చూచి నవ్వాడు:

"భయమేస్తోందా? నువ్వు పోలీస్ మనిషివి కదూ? దూకేస్తావా?"

జాన్ చేతిలో గన్ పేలింది. గుళ్ళు డ్రైవర్ తలలో దూసుకెళ్ళాయి. గావుకేక వెలువడింది. రక్తం పిచికారిలా చిమ్మింది. జాన్ ఛాతి తడిసిపోయింది. ఒక్క క్షణం నిశ్చేష్టుడైపోయాడు.

వ్యాను స్టీరింగ్ కంట్రోలు తప్పి అడ్డదిడ్డంగా పరిగెత్తింది. డ్రైవర్ తల స్టీరింగ్ పైన వాలిపోయింది.

అకస్మాత్తుగా వెనుక కేకలు విన్పించాయి.

ఉలికిపడి తేరుకున్నాడు జాన్. వ్యాను గుంటల్లోపడుతూ, రాళ్ళని గుద్దుకుంటూ, చెట్లని పడకొడ్తో దూసుకెళుతోంది. వెనుక కేకలు ఇంకా ఎక్కువయ్యాయి.

జాన్ గాభరాగా కిటికీలోంచి బయటికి చూశాడు. చిమ్మ చీకటి. ఇందాక చూసిన పొదలు జ్ఞాపకం వచ్చాయి. ఎదురుగా హెడ్‌లైట్స్‌లో వ్యాన్‌ను ఢీ కొనడానికి సిద్ధంగా వున్న పెద్ద రాతిబండ, పొడవైన చెట్లూ కన్పించాయి....

విపరీతమైన వేగంతో అదుపులేని వ్యాను మరో రెండు

అపరాధ పరిశోధన పోటీ-155

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును. నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. అల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 7-6-'81 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఆగస్టు '81 నెల సంచికలో ప్రచురిస్తాము.*

1. ఈ ఎండాకాలంలో వీటి ప్రమాదాలే ఎక్కువగా కనబడుతున్నాయి—? (అగ్నిప్రమాదాలు, రైలుప్రమాదాలు)

2. తెలుగువారి పరువును మరొకసారి బజారు కీడ్చిన సంఘటన—? (రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు, విశాఖ ఉక్కుఫ్యాక్టరీ ఉద్యోగ నియామకాలు)

3. భయంకర సంఘటనలను యిప్పుడు వీటిలో కూడా చూపుతున్నారు—? (కథలలో, సినిమాలలో)

4. భారతీయులు అందరికీ యీ దేశప్రవర్తన ఆందోళన కలిగించక మానదు—? (పాకిస్తాన్, బ్రిటన్)

5. రాష్ట్రంలో యీ జిల్లాలోని నిరుద్యోగులకు ఎక్కడా లేని ప్రాముఖ్యత లభిస్తుంది—? (మెదక్, రంగారెడ్డి)

క్షణాల్లో వాటిని ఢీ కొంటుంది.

జాన్ కీ ఆలోచన రాగానే కళ్ళు చీకట్లు కమ్మాయి. తల బరువెక్కింది. స్పృహ తప్పేలా వుంది.

అప్పుడు జాన్ విసురుగా డోర్ తెరిచి స్పృహ తప్పే లోపున బయటికి, ఎముకలు కొరికే చలితో నిండిన చీకట్లోకి శక్తి కొద్దీ దూకేశాడు — అప్పుడతనికేమీ తెలియదు — ఆ తర్వాత జరిగిందేమిటో.

వ్యాన్ బండను ఢీకొని, అడ్డం తిరిగి, మూడుసార్లు దొర్లి, నాల్గవసారి తల్లకిందులుగా వుండిపోయింది.

95

చీకటి తెరలను చీల్చుకుంటూ వెలుగురేకలు పొడుచుకొని వస్తున్నాయి. పక్షులు మనోహరంగా కూస్తూ, తమ దైనందిన జీవితాన్ని ప్రారంభిస్తూ ఎగిరిపోతున్నాయి. క్రమంగా నిత్యజీవితంలో విన్పించే శబ్దాలన్నీ నాలుగు మూలల నుంచి విన్పించసాగాయి....

తెల్లవారింది.

జీవనక్రమం ప్రారంభమైంది.

సూర్యకిరణాలు క్రమంగా వేడెక్కుతూ, యింకా తగ్గని చలినీ, పొగమంచునూ అదృశ్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి.

అద్దాల కిటికీలోంచి ఎండ ముఖంమీద పడుతోన్నా జాన్‌కి కళ్ళు తెరవ బుద్ధికావడం లేదు—బరువుగా, మంటగా వున్నాయి: శరీరమంతా బాధగా వుంది. మెలుకువ వస్తోన్నకొద్దీ బాధ ఎక్కువవుతోంది.

అయిదు నిమిషాల్లో పూర్తిగా మెలుకువ వచ్చి, బాధను అణుచుకుంటూ, బద్ధకంగా కళ్లు తెరిచాడు: క్రొత్త ప్రదేశం. పరిసరాలు వింతగా వున్నాయి: తనెక్కడున్నాడు?

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 50/-లు నగదు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—6—'81 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదేవిధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హోం.డె. సభ్యులు కాని వారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు ఆగస్టు '81 నెల సంచికలో చూడండి.

ఏప్రెల్ '81 పోటీ ఫలితాలు

(1) ఏప్రెల్ '81 నెల "అపరాధ పరిశోధన" ముఖ చిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

కౌగిలి విందు!
కరకు చూపు!!

పంపినవారు : శ్రీమతి జె. స్వరాజ్యలక్ష్మి, ఎమ్. ఎస్. సి., ఇసామియా బజార్, హైదరాబాదు.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

తిరుగులేని యంత్రబలం!
సాటిరాదు కండబలం!!

పంపినవారు : శ్రీమతి పి. రోహిణి, c/o డాక్టర్ పి. సత్యనారాయణమూర్తి, మెయిన్ రోడ్, అమలాపురం (తూ.గో.)

పై విజేతలు ఇరువురికీ చెరొక రు. 25/-లు చొప్పున బహుమతి పంపబడుతుంది.

రెండు భుజాల మీద రెండుచేతులు పడ్డాయి. అతినెమ్మదిగా కుదిపాయి. జాన్ తెలివిలో కొచ్చి చూశాడు - శాంతిలాల్ నవ్వుతున్న ముఖం.

జాన్ ముఖం విచ్చుకుంది.

ఆతృతగా లేవబోయాడు. శాంతిలాల్ ఆపాడు.

"వెల్, పార్ట్‌నర్! ఇకముందు శాంతిలాల్ లేడు! తిరిగి వెళ్ళిపోయాడు—నా వూహాజగత్తులోకి!! వాడు నా వూహాజగత్తులో పుట్టి, నా పథకంలో పనిచేశాడు-విజయవంతం చేశాడు! పొరబడకు-మాస్టర్ కిల్లర్ ఒక్కడే గొప్ప నటుడు కాడు! అతన్ని మించినవాడ్ని నేనూ!"

జాన్ గొంతు పూడుకపోయింది "నువ్వు-నువ్వు-"

"నీ పార్ట్‌నర్ని! లాల్‌ని! శాంతిలాల్ ఎవరో కాదు. నేను. నాకు తమ్ముడెవరూ లేడు! సారీ-జాన్. నిన్ను నమ్మించకపోతే నా పథకం పారదు. నీ ప్రవర్తనలో సహజత్వం వుండాలి. అందుకే నీ నుంచి చాలా రహస్యాలు దాచాను-ఫోర్ ఏసెస్‌ని నాశనం చేయడానికి!

"వెల్, నా అందమైన క్రాఫు త్యాగం చేసుకున్నాను. బాస్టర్డ్! మంగలివాడు వెంట్రుకలు తీస్తున్నప్పుడు తల రెండుచోట్ల తెగింది-మూడురోజులు బాధపడ్డాను-ఫరవాలేదు-ప్లాస్టిక్ సర్జరీ ద్వారా నా మణికట్టుమీద పుట్టుమచ్చ తీయించేశాను. విగ్గుపెట్టుకుని శాంతిలాల్ తిరుపతి-వెళ్ళినట్టు నమ్మించాను. నా చెయ్యి చూసి గాయత్రి నేను డిటెక్టివ్ లాల్‌ని కాదని నమ్మింది. ఇక శాంతిలాల్ యాక్టింగ్‌తో డిటెక్టివ్ లాల్ ఆపరేషన్ డైరెక్టు చేస్తున్నాడని వాళ్ళు సులభంగా నమ్మేశారు!"

లాల్ విగ్గుతీసి నవ్వాడు.

"యూ ఆర్ వండర్‌ఫుల్ లాల్!" అర్చాడు జాన్.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి అసలు ధరకే రు. 9-00 లకు మా ఏజెంట్ ద్వారాగాని, వి. పి. ద్వారాగాని మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇందుకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ, పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 9/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 108/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

"కానీ-నిన్ను తెలిసీ అపాయంలోకి పంపించాను. మరో మార్గం కన్పించలేదు. ముందు నేను చాలా భయపడ్డాను-ఆఫ్టరాల్ ఓ పల్లెటూరి మనిషి శాంతిలాల్ ఆజ్ఞలను నువ్వు స్వీకరిస్తావా అని!"

"నా కేమీ తోచలేదు. అంతా హడావుడిగా, కంగారుగా జరిగిపోయింది."

"అంతా సవ్యంగా జరిగింది."

"ఏం జరిగింది?"

"ఆర్గనైజేషన్ పూర్తి బృందం ఆసుపత్రిలో ట్రీట్‌మెంట్ తీసుకుంటోంది."

జాన్ లేచి కూర్చున్నాడు, "వాళ్ళంతా...."

"కులాసాగా వున్నారు. నువ్వు డ్రైవర్‌ని షూట్ చేసి దూకెయ్యకపోతే ఎప్పటికీ కన్పించేవాళ్ళి కావు! వ్యాన్‌ను కనుక్కోడానికి అరగంట పట్టింది. అందర్నీ సిటీకి తరలించాం.

"వెల్! ఆపరేషన్ సక్సెస్ అయింది. ఆర్గనైజేషన్ సమూలంగా నాశనమైంది. ఎక్కడా దాని అవశేషాలు లేవు. ఇంకెలాటి ఉపద్రవాలు దానివల్ల సంభవించవు.

"నెంబర్ వన్‌కి తలకి బలంగా దెబ్బలు తగిలాయి. నెంబర్ టూ వెన్నెముక విరిగింది. కాలు చీలమండ ఫ్రాక్చర్ అయింది. నెంబర్ త్రీ చెయ్యి విరిగింది. నెంబర్ ఫోర్-అతన్ని నేను చంపేశాను. ఇక విదేశీ ఏజెంట్లంతా అక్కడక్కడ దెబ్బలతో బయటపడ్డారు. ఈ రోజు అందరి స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తారు."

"మరి గాయత్రీదేవి?" అడిగాడు జాన్.

"అరెస్టయింది. ఈ ఘరానా వ్యక్తుల కథ విని ప్రపంచం విస్తుపోతోంది. నాకిప్పుడు చాలా తృప్తిగా వుంది! అందర్నీ

అపరాధ పరిశోధన పోటీ-153

[ఫలితాలు]

ఏప్రెల్ '81 నెల "అపరాధ పరిశోధన పోటీ — 153"కి సరియైన సమాధానాలు:

1. కౌలాలంపూర్.
2. లాటరీలు.
3. 167 రైళ్లు.
4. ధరలు.
5. —

ఐదవ ప్రశ్నకు మేము సమాధానాలు యివ్వనందున ఆ ప్రశ్నను లెక్కలోకి తీసుకోలేదు. అదే కారణంగా అనుకుంటాము జవాబులు కూడా అతితక్కువగా వచ్చాయి. పోటీలో కొద్దిమంది మాత్రమే పాల్గొన్నారు. ఐదవ ప్రశ్నను యీ నెల మళ్ళీ ఇచ్చాము.

మొదటి నాలుగు ప్రశ్నలకు ముగ్గురు పాఠకులు మాత్రమే సరియైన సమాధానాలు వ్రాశారు. వీరికి జూలై '81 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

1. శ్రీ ఎన్. సత్యానంద్, ఇంజనీర్, మెయిన్ రోడ్, బెల్లంపల్లి—504 251 (ఆదిలాబాదు జిల్లా).

2. శ్రీమతి ఎస్. పూలమణి, బి-68, రైల్వే క్వార్టర్సు, కాచిగూడ, హైద్రాబాదు-500 027.

3. శ్రీమతి జి. ప్రమీలారాణి, w/o చిన హనుమంతరావు, బి.ఇ., హనుమాన్ ఇంజనీరింగ్ కంపెనీ, జనరల్ హాస్పిటల్ రోడ్, ఒంగోలు (ప్రకాశం జిల్లా).

ఒకేసారి రెడ్ హాండెడ్‌గా పట్టుకొని వాళ్ళ నిజస్వరూపం ప్రజలకి తెలియజేశాం!"

"నువ్వు అసాధ్యుడివి లాల్!" జాన్ అన్నాడు ఉద్వేగంగా.

లాల్ నవ్వి, జాన్ కట్లను సరిచేస్తూ, "పట్టుదల వుంటే అసాధ్యమంటూ ఏదీ వుండదు!" అన్నాడు.

"కానీ ఇదంతా నిజమని నేనింకా నమ్మలేకపోతున్నాను లాల్!" ఆందోళనగా అన్నాడు జాన్, "ఫార్ములాతోసహా ఆర్గనైజేషన్‌ని నిజంగా మనం నాశనం చేశామా?"

లాల్ జాన్ కళ్ళల్లోకి సూటిగా చూచి లేచినిలబడ్డాడు, "ఓ.కే. ఈ హోటల్ గదిలో నిన్ను కదలకుండా పడుకోబెట్టి హాస్కాకొడుతున్నాననుకుంటున్నావా?" పెద్దగా నవ్వి, టేబిల్‌మీది పత్రికలు జాన్‌కిచ్చి మళ్ళీ అన్నాడు.

"ఒక్కసారి పత్రికలు చూడు! రేడియోలో వార్తలు విను! ఇంకా నమ్మకం కుదరకపోతే తక్షణం హైద్రాబాదు వెళ్ళి అక్కడ మనవాళ్ళు - మనక్కావలసిన వాళ్ళు - మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులూ.... మనల్ని సన్మానించడానికి ఎంత అసహనంగా ఎదురు చూస్తున్నారో కళ్ళారా చూడు!"

—: సమాప్తం :—

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.